www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 17 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ మాఘ బహుళ నవమి
04-10 మార్చి 2024
వెల : ₹20/-





## తెరకెక్కిన చరిత్రాత్మక ఘట్టం








## ఇది వికసిత జమ్ముకశ్మీర్





## శివోహం...

హిందూ బంధువులందరికి
మహా శివరాత్రి శుభాకాంక్షలు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# అహోబిలం పార్వేటకు యునెస్కో గుర్తింపు?

ఆంధ్రప్రదేశ్‌లోని అహోబిల నరసింహస్వామి వారి ఆలయంలో ఏటా జరిగే 'పార్వేట' ఉత్సవానికి యునెస్కో గుర్తింపు తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) సంస్థ ఈ మేరకు ప్రయత్నాలు ప్రారంభించింది. పార్వేట అంటే ఉత్తుత్తి వేట అని అర్థం. ఈ ఉత్సవానికి సాంస్కృతికంగా ఎంతో ప్రాధాన్యం ఉందని ఇంటాక్ చెబుతోంది. పైగా నల్లమలలోని చెంచుగూడేలకు అహోబిల నరసింహుడికి ఉన్న అవినాభావ సంబంధాన్ని పార్వేట ఉత్సవం వెల్లడిస్తుంది. ఇది తరతరాలుగా వారు ఆచరిస్తున్న ఉత్సవం. మహాలక్ష్మి అమ్మవారు చెంచులక్ష్మిగా  ఆ తండాలలో పుట్టిందని అంతా విశ్వసిస్తారు. విష్ణు అవతారమైన నరసింహుడితో ఆమె వివాహం అయింది. అందుకే చెంచులు స్వామివారిని తమ బావగారిగా భావిస్తారు. ఈ ఉత్సవంలో ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను 32 చెంచుగూడేలకు తీసుకువెళతారు. మకర సంక్రాంతికి ఈ ఉత్సవం ఆరంభమై నలభయ్ రోజుల పాటు జరుగుతుంది. 1881 నాటి కర్నూలు జిల్లా గజెట్‌లో ఈ విషయాలు ఉన్నాయి.

పార్వేట కాలంలోనే నరసింహ దీక్షను కూడా పాటిస్తారు. ఇదే పేరుతో చాలా ఆలయాలలో ఉత్సవం జరిపినా స్వల్పకాలంలోనే ముగుస్తుంది.





# జాగృతి.. ఒక మేలుకొలుపు.. ఒక వేకువ పిలుపు..




జాగృతిని చదువుదాం.. చదివిద్దాం..
జాతీయవాద భావనను బలోపేతం చేద్దాం..
సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుందాం..

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి క్రిందనున్న
క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి. లేదా లింక్‌లను ఉపయోగించండి.

ఒక సం.ర చందా రూ.850/-
http://payit.cc/S18970

విడి ప్రతి
రూ.20/-

ఐదు సం.రాల చందా రూ.4000/-
http://payit.cc/S18973
















తక్షణ, చారిత్రక అవసరం
**ఉమ్మడి పౌరస్మృతి**
వెల : రూ.20/-
ప్రతులకు:
సాహిత్య నికేతన్
హైదరాబాద్-27
040-27563236
9290127329

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(ఒక సం॥ర చందా రూ.850/- + మ్యాగజైన్ పోస్టు సం॥రానికి రూ.624/-)

వెల : రూ.1474/-
https://payit.cc/S32796

Bank A/c details :
Jagriti Prakashan Trust, A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad,
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

వివరాలకు సంప్రదించండి - సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ



ముఖపత్ర కథనం

## ఇది వికసిత జమ్ముకశ్మీర్

ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరి 20న జమ్ములో జరిపిన పర్యటనకు ఒక ప్రత్యేకత ఉంది. ఉగ్రవాదుల పీడ నుంచి బయటపడి, రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన ఆటంకంగా మారిన 370 అధికరణం రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో నెలకొంటున్న సాధారణ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని జరిపిన ఈ పర్యటన, 'శాంతి'వల్ల కలిగే అభివృద్ధి ప్రయోజనాలు ఎట్లా ఉంటాయో ప్రజలకు స్పష్టంగా వివరించే రీతిలో కొనసాగింది.

6,9లో

## చందాదారులకి గమనిక

చందాలను ఎవరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. జాగృతి అకౌంట్‌కి లేదా మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. ఆన్‌లైన్‌లో కట్టినట్లయితే Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు, ఫోన్ నంబర్ తప్పకుండా రాయించండి.
జాగృతి ట్రస్టు పేరుతో నడుస్తున్నది కావున ఫోన్ పే, గూగుల్ పే లాంటివి లేవు. జాగృతిలో ఇచ్చిన అకౌంట్ / Link / QR Code లను ఉపయోగించి మీ చందా చెల్లించగలరు.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

040-27561453/9959997013 నంబర్లలో సంప్రదించవచ్చు.

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

మైనారిటీలను బుజ్జగించడానికి దురాచారాలను కూడా కొనసాగించే దుస్థితికి ఇవాళ్టి రాజకీయం దిగజారడం అత్యంత విషాదం. సాంఘిక దురాచారాలను వదిలించుకోవడానికి భారతీయ సమాజం సుదీర్ఘ పోరాటమే చేసింది. అయితే అదంతా ఒక వర్గానికి పరిమితం. మైనారిటీలలో ఒక భాగం ఇస్లాంలో సంస్క రణకు చోటు తక్కువ. దీనితో కొన్ని దురాచారాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఆ మతంలోను సంస్కరణల కోసం కొన్ని ఉద్యమాలు జరగలేదని చెప్పలేం. కానీ తక్కువ. ఏమైనా దురాచారాల దుష్ఫలితాలు ఎక్కువగా అనుభవించేది (ఏ వర్గంలో అయినా కూడా) మహిళలే. అస్సాంలో అమలులో ఉన్న 'ముస్లిం వివాహ, విడాకుల రిజిస్ట్రేషన్ చట్టం, 1935' అందుకు సంబంధించిన అవశేషమే. దానినే ఆ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పరిణామాన్ని స్వాగతించడానికి బదులు బుజ్జగింపు రాజకీయ శిబిరాలు యథాతథ స్థితిని కోరుతున్నాయి.

అస్సాంలో ప్రతిపక్ష కాంగ్రెస్, ఆలిండియా యునైటెడ్ డెమాక్రటిక్ ఫ్రంట్ (ఏఐయుడీఎఫ్) ఫిబ్రవరి 26న ఈ అంశం మీద శాసనసభ నుంచి వాకౌట్ చేశాయి. 1935నాటి ఆ చట్టాన్ని రద్దుచేస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకో వడమే ఇందుకు కారణం. మంత్రిమండలి నిర్ణయం గురించి చర్చకు పట్టుపడుతూ ఏఐయూడీఎఫ్ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని కూడా స్పీకర్ బిశ్వజిత్ దయామరి నిరాకరించారు. బిల్లుకు సవరణలు చేయవచ్చు గాని, మొత్తంగా రద్దు చేయడం సరికాదన్నది కాంగ్రెస్ వాదన. రాష్ట్రంలో పెద్ద సామాజిక బెడదగా పరిణమించినందుకే బాల్య వివాహాలను అరికట్టడానికి ముస్లిం వివాహ, విడాకుల రిజిస్ట్రేషన్ చట్టాన్ని రద్దు చేయాలని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మంత్రి వర్గం నిర్ణయించింది. ఈ సామాజిక రుగ్మతని పూర్తిగా నిర్మూలించడానికి ఈ నిర్ణయం తొలి అడుగు అవుతుందని కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు. ఒక దశలో విపక్షాల అడ్డగోలు వాదనలకు ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. 'జాగ్రత్తగా వినమని ప్రార్థన. నేను జీవించి ఉన్నంతకాలం అస్సాంలో బాల్య వివా

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ మాఘ బహుళ నవమి**

*లోపలి పేజీలలో...*




అంతర్జాతీయం
**షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి చుక్కలే..?**
14లో



ప్రత్యేక వ్యాసం
**యుగపురుషుడు**
24లో



ప్రత్యేక వ్యాసం
**ఆదిదేవుడికి అనంత ప్రణామాలు**
26లో

# జాగృతి

## సంపాదకీయం

హాలకు అనుమతించబోనని శపథం చేస్తున్నాను. 2026 సంవత్సరంలోగానే ఈ దుకాణం మూయిస్తానని మీకు రాజకీయంగా సవాలుచేస్తున్నాను' అని సభలో గర్జించారాయన. ఆ దుకాణం అంటే ముస్లిం బాలికల జీవితాలను ధ్వంసం చేయడానికి కాంగ్రెస్, ఏఐయూడీఎఫ్ తెరిచిన దుకాణమని ఆయన బాహాటంగానే విమర్శించారు. అయినా ఈ పక్షాలు తమ పట్టు వీడలేదు. మంత్రిమండలి నిర్ణయానికి నిరసనగా కాంగ్రెస్ పది నిమిషాలపాటు వాకౌట్ చేసింది. ఏఐయుడీఎఫ్ ఐదు నిమిషాలు సభలో బైఠాయించి తరువాత వాకౌట్ చేసింది. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఏకైక సీపీఎం సభ్యుడు మాత్రం సభలోనే ఉండిపోయారు.

## 'బాల్య'రాజకీయాలు

ముస్లింలకే పరిమితమైన బ్రిటిష్ కాలం నాటి ఆ చట్టం ప్రకారం ముస్లిం కుటుంబాలలో జరిగిన వివాహాలను లేదా తీసుకున్న విడాకుల గురించి స్వచ్ఛందంగా రిజిస్ట్రర్ చేసుకోవాలి. అయితే ఇందులో ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేదు. ఒక ముస్లింకు రిజిస్ట్రేషన్ చేసే హక్కును (లైసెన్సును) ప్రభుత్వం అప్పగిస్తుంది. ఈ దుష్ట సంప్రదాయాన్ని ఆపడానికే ఫిబ్రవరి 23న మంత్రిమండలి ఈ చట్టం రద్దుకు ఆమోద ముద్ర వేసింది.

చాలాచిత్రంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన తలాక్ రద్దు చట్టం అస్సాంలో వర్తించడం లేదు. అందుకు అడ్డంగా నిలిచినది 1935 నాటి ఆ ముస్లిం వివాహ, విడాకుల చట్టమే. చట్టం ప్రకారం వివాహం చేసిన యువతికి 18 సంవత్సరాల నిండకపోయినా, ఆ పెళ్లి రిజిస్టరవుతుంది. కానీ అందుకు బాధ్యత రిజిస్ట్రేషన్ అధికారం ఉన్న ఖాజీది కాదు. ఆ చట్టం ఖాజీని బాధ్యుడిని చేయడం లేదు. అంటే 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయడానికి ఈ చట్టం అన్ని విధాలా తోడ్పడుతుంది. ఇంకా చెప్పాలంటే చట్టం లోని 8(1) వయోపరిమితితో సంబంధం లేకుండా బాలికలకు వివాహం చేయడానికి అనుమతి ఇచ్చేదే. దీనిని సవరించి మిగిలిన చట్టాన్ని యథాతథంగా ఉంచాలని కొందరి వాదన. ఇది ఎంత అర్థరహితమో చెప్పక్కరలేదు. ఆ సంగతి ఎలా ఉన్నా ఈ చట్టం రద్దు దరిమిలా ఇష్టారాజ్యంగా విడాకులు ఇవ్వడానికి మాత్రం వీలు ఉండదు. బాల్య వివాహాల మీద హిమంత బిశ్వశర్మ అక్షరాలా యుద్ధమే ప్రకటించారు. గడచిన సంవత్సరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దీని మీద నిఘా పెట్టారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వేలాది మందిని ప్రభుత్వం అరెస్టు చేసింది కూడా.

ఈ మార్పును ఉదారవాదులు యథాప్రకారం విమర్శించడం ఆరంభించారు. ఎలాగంటే బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 అమలులో ఉంది. ఇప్పుడు కొత్త చట్టం తీసుకువస్తే ముస్లింలలో గందరగోళం సృష్టించడమేనని అంటున్నారు. మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ అయితే ఇస్లాం నుంచి యువతను దూరం చేయడానికే ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం 1935 చట్టాన్ని రద్దు చేసిందని పెద్ద ఆరోపణే చేశారు. బాలికల జీవితాలు నాశనమైపోతున్నా, ఛాందసత్వం, ఓటు బ్యాంకు రాజకీయాలు కొనసాగాలన్నదే వీరందరి లక్ష్యంగా కనిపిస్తున్నది.

ఉత్తరాఖండ్ తరువాత ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయడానికి సిద్ధపడుతున్న రాష్ట్రం అస్సాం. 1935 నాటి ఆ చట్టం రద్దు ఇందుకు నాంది అన్న అభిప్రాయం ఉంది. వివాహం, విడాకులు, వారసత్వం వంటి విషయాలలో దేశ ప్రజలందరినీ ఒకే చట్టం కిందకు తెచ్చే ఉద్దేశంతో తీసుకువస్తున్నదే ఉమ్మడి పౌరస్మృతి. దీనికి పరిస్థితులను సానుకూలం చేసే ఏ చర్యకయిన మద్దతు ఇవ్వడం దూరదృష్టి కలిగిన వారి బాధ్యత. ★

04 మార్చి 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**జంగిడి జీవితం**

– రంజిత్ గన్నోజు





| | | |
|---|---|---|
| ఇసుక తవ్వకాలపై నివేదికతో వైసీపీలో మథనం (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| స్వరవాహిని... 'స్వర్ణ'గాయని (మహిళ) | - | 22 |
| ఫత్వాలకు, బాలలకు సంబంధమేమిటి? (జాతీయం-1) | - | 30 |
| 'నంది'కి ప్రత్యామ్నాయం 'గద్దర్' పురస్కారమా!? (చర్చ) | - | 32 |
| బాలక్‌రామ్‌కు రాగసేవ (సన్నిధి) | - | 36 |
| బీపాస్: 'బైపాస్'... వందలాది ఫైళ్లు మాయం (తెలంగాణ) | - | 38 |
| బాల జాగృతి | - | 46 |
| నవ్వించే సీక్రెట్ ఏజెంట్ 'చారి 111' (సినిమా) | - | 50 |

**ఇది సినిమా థియేటర్‌లో వినిపించినా, మూడున్నర దశాబ్దాల పాటు ఆసియా ఖండాన్నీ, నిజానికి ప్రపంచాన్నీ కలత పెట్టిన కశ్మీర్ కల్లోలం మీద లోతైన వ్యాఖ్య. ఉగ్రవాదం ఆ లోయను కన్నీటితో నింపింది. మతోన్మాదం ఆ భూతల స్వర్గంలోని పచ్చని నేల నిండా రక్తపు కళ్లాపి చల్లింది.'అక్కడ ఉగ్రవాదం ఒక వ్యాపారం, మరొక కోణం ఏదీ దానికి లేదు!' అంటుంది ప్రధాన పాత్ర. ఆ చిత్రమే ఫిబ్రవరి 23న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన 'ఆర్టికల్ 370'. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే అధికరణమిది. దీనిని ఆగస్ట్ 5, 2019న బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అదొక ప్రపంచ వార్త. ఒక సంచలనం. ఐక్య రాజ్యసమితిని వాడీవేడీ చర్చకు వేదికను చేసింది.**



వేలాది మంది కశ్మీరీ పండిత్‌లను లోయలో చంపినా, తరిమేసినా, అందుకు జవాబుదారీతనం లేకుండా చేసినది–ఆర్టికల్ 370. కొన్ని కుటుంబాలు వంశపారంపర్యంగా రాష్ట్రాధికారాన్ని అనుభవించ డానికి ఎర్ర తివాచీ పరిచినదీ అదే. డ్రైఫ్రూట్స్ అక్రమ రవాణా చేస్తున్నా, ఉగ్రవాదానికి నిధులు సమకూరు స్తున్నా, ఆఖరికి ఆర్థిక అవకతవకలపై విచారణ లేకుండా చేయగలిగినా అదంతా ఆ అధికరణం చలవే. పాకిస్తాన్ నుంచి వచ్చే దొంగ నోట్లను పంచి కుర్రకారును రాళ్లు రువ్వే అల్లరిచిల్లర మూకలుగా తయారు చేసినా అడ్డుకునే శక్తి కేంద్రానికి లేకుండా చేసినా కారణం అదే. ఇదంతా ఒకటైతే, 40 మంది సీఆర్‌పీఎఫ్ భద్రతా బలగాలను పొట్టన పెట్టుకున్న పుల్వామా (2019) వంటి దారుణ ఘటనపై ప్రతి చర్యలకు ఆటంకం కూడా 370. దీనినే రద్దు చేసింది కేంద్రం. ఏడు దశాబ్దాలుగా రాజ్యాంగంలో గడుసుగా తిష్ట వేసిన ఒక అధికరణాన్ని చెత్తబుట్టలో పడేయడం వెనుక పెద్ద నేపథ్యం ఉంటుంది. కానీ అది చలనచిత్రంగా రూపొందించడానికి అనువుగా ఉంటుందా? ఉంటుందనే రుజువు చేశారు 'ఆర్టికల్ 370' చిత్ర దర్శకులు, నిర్మాతలు, చిత్రానువాదకులు.


యామీ గౌతమ్

'కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం నిర్మించాం. ఇది డాక్యుమెంటరీ కాదు, అయినా కల్పిత కథ' అంటూ లాంఛనంగా ప్రకటించుకున్నా, 1947 నాటి ఎర్రకోటపై పతాక వందనం, దాని కింద నెహ్రూ కనిపిస్తున్న నలుపు తెలుపు డాక్యుమెంటరీ శకలంతోనే ఈ సినిమా ఆరంభ మైంది. ఆ పరిణామాలు, కశ్మీర్‌ను రాజా హరిసింగ్ భారత్‌లో విలీనం చేయడం, అందుకు దారి తీసిన పరిస్థితులు అజయ్ దేవగన్ గళంతో నేపథ్యంలో చెప్పించారు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే 370 అధికరణాన్ని తాత్కాలిక ప్రాతిపదికపైన రాజ్యాంగకర్తలు ప్రవేశపెట్టారు. ఈ వాస్తవాన్నే చాలా రాజకీయ పక్షాలు సౌకర్యంగా మరచిపోయాయి. వక్రభాష్యాలు చెప్పాయి. అందుకే కశ్మీర్–భారత్‌ల మధ్య వారధిగా ఉండాలని భావించి ప్రవేశపెట్టిన ఆ తాత్కాలిక అధికరణమే చివరికి లోయలో ఉగ్రవాదుల స్వైర విహారానికి ఆసరా ఇచ్చింది. వేర్పాటువాదుల రక్షణకు, మూడు నాలుగు రాజకీయ కుటుంబాల ప్రయోజనాల వరకే పరిమితమైంది. దానిని రద్దు చేయడమే ఈ చిత్ర ఇతివృత్తం. జూనీ హక్సర్ (భద్రతా అధికారి), రాజేశ్వరీ స్వామినాథన్ (ప్రధాని సచివాలయ కార్యదర్శి) అనే రెండు స్త్రీ పాత్రలతోనే ఈ వాస్తవ గాథను నడిపించారు. నెహ్రూ, బుర్హాన్‌వనీ వంటి కొన్ని పేర్లు తప్ప మిగిలిన పాత్రలను వాటి హోదాలతోనే పిలిచారు. నరేంద్ర మోదీ, అమిత్‌షా, ముఫ్తీ మోహబూబా పాత్రలకు వారి పదవుల పేర్లే ఉన్నాయి. పాత్రధారులు, ఆహార్యం, కదలికలు ఆయా వ్యక్తులను ప్రతి లిప్తలోను తలపునకు తెస్తాయి.

**ఇతివృత్తం విషయానికి వస్తే-**

సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించే తీరులో ఒక సరిహద్దు రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కట్టబెట్టినది 370 అధికరణం. దీనితో జరుగుతున్న విధ్వంసం ఆధునిక భారతదేశానికి తీరని వ్యథ. 1947లో రాజా హరిసింగ్ కశ్మీర్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేశాడు. అక్కడ నుంచి నేరుగా వేర్పాటువాది సయ్యద్ అలీషా జిలానీ, ఉగ్రవాది బుర్హాన్ వనీ కాలానికి దర్శకుడు తీసుకువస్తాడు.

ఆరు అధ్యాయాలుగా సాగిన ఈ సినిమాలో తొలి అధ్యాయమే తెరకు కళ్లప్పగించే విధంగా ఉంది. ఇది హిజ్‌బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్‌తో మొదలవుతుంది. ఈద్ వేడుక కోసం ఒక ఇంటికి అతడు వచ్చాడని తెలిసి అక్కడ మాటు వేస్తాయి భద్రతాదళాలు. కొందరు ఇంటిలోకి చొచ్చుకు వెళ్లగా, జూనీ ఇంకొందరు బయట కాపు వేస్తారు. అప్పటికే తప్పించుకుపోతున్న ఉగ్రవాదులు జూనీ కంటపడ్డారు. భీకరంగా కాల్పులు జరిగాయి. వనీ చనిపోతాడు. దీనితో కశ్మీర్ మొత్తం అట్టుడికి నట్టు ఉడికిపోతుంది. వనీ శవంతో ఊరేగింపు జరుపుతారు. దీనికంతకీ జూనీని బాధ్యురాలిని చేస్తారు పై అధికారులు. అంత ప్రాబల్యం ఉన్న ఉగ్రవాదిని ఎలా చంపుతావని, వారితో సంప్రతింపులు మార్గమని హితోక్తులు పలుకుతారు. అంతేకాదు, ఆమెను ఢిల్లీకి బదిలి చేసి, మంత్రి జలాల్ బందోబస్తుకు నియమిస్తారు. తరువాత రాజేశ్వరి మళ్లీ ఆమెను ఒప్పించి ఎన్ఐఏ అధిపతిగా పూర్తి స్థాయి అధికారాలతో లోయకు పంపుతుంది. ఆ సందర్భంగా ఆ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ చాలా ముఖ్యమైనది. కేంద్రంలోని పార్టీ ముఫ్తీ మెహబూబాతో సంకీర్ణ ప్రభుత్వం నడుపుతున్నదని, 370 అక్కడి కింది వర్గాలకు, మహిళలకు హక్కులు లేకుండా చేస్తున్నదని అక్కడ పనిచేయడం ఎలా అని ప్రశ్నిస్తుంది జూనీ. ముఫ్తీ మెహబూబాతో కలిసి బీజేపీ

# తెరకెక్కిన చరిత్రాత్మక ఘట్టం




ప్రభుత్వం ఏర్పాటు చేయడం, అక్కడి యంత్రాంగం ఆనుపానులు తెసుకోవడానికేనని తరువాత వెల్లడైంది.

బుర్హాన్ వనీ హత్య తరువాత లోయలో ఉగ్రవాదం మరింత పెరిగింది. ఫలితం పుల్వామా దాడి. ఆ దాడిలో జూనీకి సన్నిహితంగా ఉండే ఒక భద్రతా అధికారి కూడా చనిపోతాడు. తరువాత కూడా కొన్ని ఘటనలు జరుగతాయి. ప్రధాని అధ్యక్షతను కీలక సమావేశం జరుగుతుంది. ఈ సమస్యకు పరిష్కారం 370 రద్దు మాత్రమేనని సమావేశంలో అభిప్రాయానికి వస్తుంది. కానీ కొందరు ఇందుకు సందేహిస్తారు. ప్రధాని కుర్చీలో నుంచి లేచి ఇంకా ఎంత కాలం ఈ ఓర్పు! మనం 370ని రద్దు చేస్తున్నాం. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండకూడదు అంటాడు. కశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం లేకపోవచ్చు. అక్కడ ప్రధాని లేకపోవచ్చు. రెండు జెండాలు లేకపోవచ్చు. కానీ 370 అంతకు మించి అధికారాలు, హక్కులు కట్టబెడుతున్నది. అందుకే ప్రధాని పాత్రతో ఆ మాట అనిపించారు. అయితే ఆ చర్యలో అమాయకుడైన ఒక్క కశ్మీరీ రక్తపు బొట్టు కూడా కింద పడకూడదని ఆదేశిస్తాడు ప్రధానమంత్రి. ఇందుకు సంబంధించిన చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టే బాధ్యతను హోంమంత్రికి అప్పగిస్తారు.

జూనీ హక్సర్‌కు ఒక విషాద గతం ఉంది. ఆమె తండ్రి కబీర్ హక్సర్‌ను ఒక బ్యాంక్ అవినీతి వ్యవహారంలో బలిపశువును చేశారు. ఆయన శవం దాల్ సరస్సులో కనిపించింది. 370 అమలులో ఉండగా ఆ వివాదానికి ఎలాంటి ముగింపు రాలేదు. ఆమె మనసును బాధ పెట్టే ఒక దుర్ఘటనగా మిగిలింది. 370 అధికరణ కారణంగా ఆ అవినీతి వ్యవహారంలో దోషులెవరో తేల్చడానికి బాధితులెవరో నిగ్గు తేల్చడానికి అవకాశం లేకపోయింది. దీనికి చక్కని ముగింపు ఇచ్చారు. 370 రద్దు తరువాత హక్సర్‌ను ఇరికించిన ఆ కేసును తిరగతోడుతున్నారని వార్త వస్తుంది. ఆ పేపర్ క్లిపింగ్ తీసుకువెళ్లి జూనీ దాల్ లేక్‌లో విడిచిపెడుతుంది. 370 రద్దుతో దేశంలో, కశ్మీర్‌లో వెల్లువెత్తిన హర్షాతిరేకాలకు సంబంధించిన వార్తలు, వాటిని ప్రచురించిన పత్రికల పేర్లతో తేదీలతో సహా ప్రస్తావించారు. చివరికి 370 రద్దు చట్టబద్ధమేనంటూ ఇచ్చిన సుప్రీం తీర్పును ప్రసావించారు. దీనితో సినిమా ముగిసింది.

నిజానికి 370 రద్దుకు ముందు ఢిల్లీలో, మంత్రుల కార్యాలయాలలో జరిగిన ఘటనలు సినిమాలో సృష్టించిన ఉత్కంఠకు తీసిపోనంతగా విస్తుగొలుపుతాయి. న్యాయపరమైన చిక్కులు ఎదురు కాకుండా పరిశోధన జరిగింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంత జరుగుతున్నా కాస్త కూడా విషయం బయటకు రానీయలేదు. క్రికెట్ మ్యాచ్‌లో తుది ఫలితం ఇచ్చే ఒక్క బాల్ పడుతున్న సమయంలో ఉండే ఉత్కంఠ ఇందులో కనిపిస్తుంది. మొదట ప్రధాని, హోంమంత్రులకు మాత్రమే ఈ విషయం తెలుసు. అధికరణం రద్దు కసరత్తు అంతా ఎవరికీ అనుమానం రాకుండా హోంమంత్రి కార్యాలయం లేదా న్యాయశాఖ మంత్రి కార్యాలయాలలో కాకుండా వేరే చోట నిర్వహించారు. అయితే సమాచారమంతా పార్లమెంట్ భవనం కింది అంతస్తులో ఉన్న హోంమంత్రి కార్యాలయానికి ఎప్పటికప్పుడు చేరేది. వాటిని పరిశీలించే పనిలో సహకరించడానికి కొందరు గుజరాతీ రాజకీయవేత్తలు కూడా అక్కడే ఉండేవారు. అమిత్‌షా, సొలిసిటర్ జనరల్ ఏ క్షణంలో మాట్లాడుకోవాలన్నా వీలుగా ఫోన్ ఏర్పాటు చేశారు. బీజేపీ ప్రత్యేకంగా విప్ జారీ చేయడమే కాదు, ఆ ఒక్క రోజు కొత్త ఎంపీలు సభలో ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలో తర్ఫీదు కూడా ఇప్పించింది. ఆనాటి కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, రైల్వేమంత్రి పీయూష్ గోయెల్ పార్లమెంటులో హోంమంత్రి ఇచ్చే ఉపన్యాసం తయారు చేశారు. అప్పుడు అస్సాంమంత్రిగా ఉన్న హిమంత బిశ్వశర్మకు ఒక బాధ్యతను అప్పగించారు. బిల్లును ప్రవేశపెట్టే రోజున సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లోత్‌ను పూర్తిగా రోజంతా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నిజానికి ఆయన చాంబర్‌నే వార్‌రూమ్‌గా ఉపయోగించుకున్నారు. అమిత్ షా, ఆయన సహాయకులు ఆ రోజంతా ఆ చాంబర్‌లోనే ఉన్నారు. ఇంత జరిగినా రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టే క్షణం వరకు ఎవరికీ ఏమీ తెలియలేదు. దీనితో బృందా ఘోష్ అనే జర్నలిస్టు ప్రదర్శించిన అసహనం చాలా విషయాలు వెల్లడిస్తుంది.

సినిమాలో పుల్వామా మృతులకు ప్రధాని నివాళి ఘటించే సన్నివేశం, 370 రద్దు నిర్ణయాన్ని ప్రధాని ప్రకటించే సన్నివేశం అద్భుతంగా ఉన్నాయి (ఈ సన్నివేశానికి ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు). 370 రద్దయితే ఎలాంటి సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది? అన్న రహస్య చర్చలో స్లిప్‌ల మీద రాసే సన్నివేశం కూడా చక్కగా ఉంది. మొదట జూనీ ఒక అంశం రాసి ఓ పెద్ద బోర్డుకు అతికిస్తుంది. చివరికి ఆ బోర్డు ఖాళీ లేకుండా అలాంటి స్లిప్‌లతో నిండిపోతుంది. పాక్ దాడి మొదలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఉన్న వాహనాల డ్రైవర్ల వరకు సమస్యలు కనిపిస్తాయి. అప్పుడు జరుగుతున్న అమర్‌నాథ్ యాత్రను హఠాత్తుగా నిలిపివేశారు. రాష్ట్రంలో 144వ సెక్షన్ విధించారు. మాజీ ముఖ్యమంత్రులను, ముఖ్య నాయకులను గృహ నిర్బంధంలో ఉంచారు. పత్రికా రచయితలు, ముఖ్యంగా బీజేపీ వ్యతిరేక,


ప్రియమణి








ఉదారవాద పత్రికా రచయితలు కూపీ లాగే యత్నం చేస్తుంటారు. ఒక్క అక్షరం కూడా బయటకు పొక్కదు. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి ముందు రాత్రి మీడియా అంతా ప్రధాని నివాసం ఎదుట కాపు వేసి ఉంటుంది. కొంతసేపటి తరువాత ప్రధాని కాన్వాయ్ హఠాత్తుగా బయలుదేరుతుంది. ఆ గందరగోళం సద్దుమణిగిన తరువాత మరొక కారు ప్రధాని నివాస ప్రాంగణం నుంచి మరొక దారిలో రాష్ట్రపతి భవన్‌కు వెళుతుంది. అందులో ప్రధాని ఉంటారు. అబ్దుల్లా అనే స్మగ్లర్‌ని అరెస్టు చేసి తీసుకువెళుతున్నప్పుడు రాళ్లు రువ్వే మూకలు అడ్డం పడతాయి. అయితే కొద్దిసేపు యుద్ధం తరువాత వారంత వారే దారి ఇస్తారు. ఎందుకు? అబ్దుల్లాను జీప్ బాయినెట్‌కు కట్టి ముందుకు తీసుకువెళతారు భద్రతా సిబ్బంది.

సినిమా పేరు వినగానే ఇది డాక్యుమెంటరీని చూడడమే అనుకుని వెళ్లే ప్రేక్షకుడు కంగు తినక తప్పదు. నాటకీయత, సన్నివేశ కల్పన, మలుపులు అద్భుతంగా ఉన్నాయి. ఇదంతా వాస్తవాల ఆధారంగా కొద్దిపాటి కల్పనతో తీసినదే. గడచిన ఏడు దశాబ్దాలుగా ఈ ఆర్టికల్‌ను రద్దు చేస్తే దేశం భస్మీపటలమైపోతుందంటూ చిరకాలం దేశాన్ని ఏలిన పార్టీ ఆడిన నాటకమే ఇలాంటి రాజకీయ కథకు పసందైన నాటకీయతను తెచ్చి పెట్టింది. కశ్మీర్ అందాలను, నిశిరాత్రి లోయను చాలా అందంగా చిత్రించారు. నేపథ్య సంగీతం ప్రత్యేకతను తెచ్చి పెట్టింది.

అక్షరాలా మూడో కంటికి తెలియకుండా 370ని నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసింది. మొదటి దఫా అధికారంలోకి వచ్చినప్పుడే దీనిని రద్దు చేయాలని అనుకున్నా పార్లమెంట్‌లో అందుకు తగిన బలం లేదు కాబట్టి రెండో దఫా ఎన్నికైనప్పుడు ఆ పని చేశారు. ఈ చిత్రమంతా రాజ్యాంగంలో తాత్కాలిక ప్రాతిపదికతో ఉన్నప్పటికీ అంతర్జాతీయ సమస్యగా పరిణమించిన ఒక చట్టాన్ని నేలరాయడం అవసరం అన్న వాదనతోనే నడుస్తుంది. ఇస్లాంనే కాదు, ఇస్లాం మతోన్మాదం మీద కూడా కటువైన వ్యాఖ్య వినిపించదు. దాని క్రూరత్వం మాత్రం ప్రతి ఫ్రేమ్‌లోను కనిపిస్తూనే ఉంటుంది. ★

## తెర మీద, తెర వెనుక

**జూ**నీ హక్సర్ (యామీ గౌతమ్), రాజేశ్వరీ స్వామినాథన్ (ప్రియమణి రాజ్), రామాయణం ఫేం అరుణ్ గోవిల్ (ప్రధానమంత్రి), కిరణ్ కర్మాకర్ (హోంమంత్రి), ఖవార్ అలీ, అనుమానాస్పద ఉద్యోగి (రాజ్ అర్జున్), విపక్షనేత రోహిత్ థాపర్ (అసిత్ రెడిజి) ఐఎస్ఐ అధిపతి (సందీప్ చటర్జీ), జర్నలిస్ట్ బృందా ఘోష్ (ఇరావతి హర్షే). ఆదిత్య ధర్ (కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, యూరి దర్శకుడు). సిద్ధార్థ వసానీ (సినిమాటోగ్రఫీ). ఆదిత్య సుహాస్ జంభాలే (దర్శకుడు).


ఆదిత్య ధర్


ఆదిత్య సుహాస్ జంభాలే




# ఇది వికసిత జమ్ము-కశ్మీర్

ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరి 20న జమ్ములో జరిపిన పర్యటనకు ఒక ప్రత్యేకత ఉంది. ఉగ్రవాదుల పీడ నుంచి బయటపడి, రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన ఆటంకంగా మారిన 370 అధికరణం రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో నెలకొంటున్న సాధారణ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని జరిపిన ఈ పర్యటన, 'శాంతి'వల్ల కలిగే అభివృద్ధి ప్రయోజనాలు ఎట్లా ఉంటాయో ప్రజలకు స్పష్టంగా వివరించే రీతిలో కొనసాగింది. ఈ సందర్భంగా ప్రధాని జమ్ములో రూ.32 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడం, గతంలో నిత్య హింసాకాండ అనే 'చలి' తప్ప మరోటి తెలియని జమ్ము-కశ్మీర్ ప్రజలకు ఉదయిస్తున్న 'ప్రగతి భానుడి' లేలేత కిరణాలు 'నులివెచ్చని' అనుభూతిని తప్పక కలిగించి ఉంటాయి. ఆరోగ్యం, విద్య, రైలు, రోడ్లు, విమాన యానం, పెట్రోలియం, పౌర మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులు ప్రధాని శంకుస్థాపన చేసిన వాటిల్లో ఉన్నాయి. అంతేకాదు జమ్ము-కశ్మీర్ రాష్ట్రంలో కొత్తగా నియమితులైన 1500 మంది ఉద్యోగులకు నియామక పత్రాలను కూడా ప్రధాని అందజేయడం విశేషం. 'వికసిత్ భారత్ వికసిత్ జమ్ము' కార్యక్రమం కింద వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారితో ప్రధాని నరేంద్రమోదీ ముచ్చటించడం, పలువురు లబ్ధిదార్లు అభివృద్ధి పథకాల ద్వారా తమకు కలిగిన ప్రయోజనాలను ప్రధానితో ముఖాముఖిగా వివరించడం మరో విశేషం.

గతంలో తాను జమ్ము-కశ్మీర్‌లో జరిపిన పర్యటనలకు, ప్రస్తుతం జరుపుతున్న పర్యటనకు ఎంతో వ్యత్యాసమున్నదని ప్రధాని పేర్కొనడం గమనార్హం. ఈ వ్యాఖ్యలోనే బీజేపీ ఏలుబడిలో అక్కడ వచ్చిన పెను మార్పును చెప్పక చెప్పారు. ముఖ్యంగా అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఖాతరు చేయకుండా జమ్ములోని మౌలానా అజాద్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రధాని కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడం ఈసారి ప్రత్యేకత! జమ్ము-కశ్మీర్‌లోని మూడు ప్రధాన ప్రాంతాల్లో పెద్ద స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో, వీటివద్ద పెద్దసంఖ్యలో గుమికూడిన ప్రజలు ప్రధాని కార్యక్రమాలను ఆసక్తిగా వీక్షించడం, ఆయన ప్రసంగాన్ని వినడం వారిలో 'ఉగ్రవాద' భయం తొలగిపోయిందనడానికి గొప్ప నిదర్శనం! అంతేకాదు జమ్ము-కశ్మీర్‌లోని 285 బ్లాకులకు చెందిన ప్రజల్లో ప్రధాని పర్యటన గొప్ప స్ఫూర్తిని నింపిందనడంలో సందేహం లేదు. నిజానికి ఈ కార్యక్రమం కేవలం వికసిత్ భారత్‌కు మాత్రమే పరిమితం కాదు, దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు చెందిన లక్షలాదిమంది ప్రజలకు కూడా సంబంధించింది. గత 70 సంవత్సరాలుగా ఫలించని జమ్ము-కశ్మీర్ ప్రజల కలలకు, త్వరలోనే తాను వాస్తవరూపాన్ని తీసుకు వస్తానని మోదీ ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇవ్వడం విశేషం. తమ కుటుంబాల సంక్షేమానికి మాత్రమే ప్రాధాన్యమిచ్చిన గత పాలకులు, సామాన్య ప్రజలను ఎంతమాత్రం పట్టించుకోలేదని మోదీ విమర్శించారు. 'వికసిత్ జమ్ము-కశ్మీర్' సాధనకోసం కేంద్ర ప్రభుత్వం నిరుపేదలు, రైతులు, యువత, నారీశక్తిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. ప్రస్తుత ప్రభుత్వం వేగంగా తీసుకుంటున్న చర్యలవల్ల జమ్ము ప్రముఖ విద్యాకేంద్రంగా వేగంగా రూపుదిద్దుకుంటోంది. జమ్ము-కశ్మీర్‌లో ఐఐటీ, ఐఐఎంలను ఏర్పాటు చేస్తామని 2014లో ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. "మోదీ హామీ ఇస్తే అది నెరవేరినట్టే" అన్న సత్యాన్ని జమ్ము-కశ్మీర్ ప్రజలు



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

గుర్తిస్తున్నారు. విద్య, నైపుణ్య రంగాల్లో నేడు సాధించిన అభివృద్ధిని పదేళ్లక్రితం నాటి పరిస్థితితో ఎంతమాత్రం పోల్చలేం. నేడు "సరికొత్త భారత్" అవిర్భవించింది. వర్తమాన కాలానికి అనుగుణమైన ఆధునిక విద్యకు కేంద్రం అత్యంత ప్రాధాన్య మిస్తోంది. ఈ నేపథ్యంలోనే గత పదేళ్లకాలంలో జమ్ము-కశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో 50 డిగ్రీ కళాశాలలతో సహా దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో స్కూళ్లు, కళాశాలలు, యూనివర్సిటీలు ఏర్పాట య్యాయి. జమ్ము-కశ్మీర్‌లో 45వేల మంది పిల్లలు పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. ఒకప్పుడు పాఠశాలలు నడిచేవి, కానీ నేడు బళ్లు విస్తరిస్తున్నా యంటే అతిశయోక్తి కాదు. 2014లో జమ్ము-కశ్మీర్‌లో కేవలం నాలుగు వైద్య కళాశాలలుండగా నేడు వాటి సంఖ్య 12కు పెరిగింది. 2014లో రాష్ట్రంలో కేవలం 500 మెడికల్ సీట్లుంటే నేడవి 1300కు చేరుకున్నాయి. ఇక మెడికల్ పి.జి.సీట్లు 2014 వరక లేనేలేవు. కానీ నేడు 650కి పైగా సీట్లు అందుబాటులోకి వచ్చాయి. గత నాలుగేళ్ల కాలంలో 45 పారామెడికల్, నర్సింగ్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. జమ్ము-కశ్మీర్‌కు రెండు ఏఐఐఎంఎస్‌లు మంజూరుకాగా, ఒకదాన్ని ప్రధాని ఫిబ్రవరి 20న ప్రారంభించారు. గత పదేళ్లకాలంలో దేశవ్యాప్తంగా 15 ఏఐఐఎంఎస్‌లను నెలకొల్పినట్టు ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. అంతేకాదు 370 అధికరణం రద్దు తర్వాత జమ్ము-కశ్మీర్‌లో సమతుల్య అభివృద్ధి సాధిస్తున్న సంగతిని ఆయన గుర్తుచేశారు. ఈ అధికరణం రద్దుపై త్వరలో విడుదల కానున్న చిత్రాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ చిత్రాన్ని యామి గౌతమ్ నిర్మించారు. కల్లోలిత జమ్ము-కశ్మీర్‌లో వాస్తవ పరిస్థితులను ఈ చిత్రం వెల్లడిస్తుందంటూ ప్రధాని ప్రశంసించారు. ఉగ్రవాదం, అవినీతి, ప్రత్యేక ప్రతిపత్తి అంశాలపై ఈ చిత్రం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిందన్నారు. ఫిబ్రవరి 23న ఈ చిత్రం విడుదలైంది. తన చిత్రాన్ని ప్రస్తావించినందుకు యామి గౌతమ్ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. మారిన పరిణామక్రమంలో జమ్ము-కశ్మీర్‌లో ప్రస్తుతం సానుకూల అభివృద్ధి సాగుతోంది. అంతేకాదు ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' విధానాన్ని అమల్లోకి తేవడంవల్ల ప్రయోజనం పొందిన మాజీ సైనికుల్లో ఈ ప్రాంతానికి చెందినవారు కూడా ఉన్నారన్న సంగతిని ఆయన ప్రస్తావించారు. దేశంలో 3కోట్లమంది 'లఖ్‌పతి దీదీ'లను తయారుచేయాలన్నది తన లక్ష్యమని పేర్కొన్నారు.



## అధిక ప్రయోజనం మహిళలకే

370 అధికరణం రద్దువల్ల ప్రధానంగా ప్రయోజనాన్ని పొందింది జమ్ము-కశ్మీర్ మహిళల మాత్రమే! ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పక్కా ఇళ్లను మహిళల పేర్న రిజిస్టర్ చేస్తున్నారు. హర్ ఘర్ జల్ పథకం కింద కుళాయి ద్వారా నీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఆయుష్మాన్ కార్డుల పంపిణీ పెద్దఎత్తున జరిగింది. 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద పెద్ద సంఖ్యలో మహిళలకు 'డ్రోన్ పైలెట్లు' గా శిక్షణ ఇస్తున్నారు. లక్షల రూపాయల విలువచేసే డ్రోన్‌లను వేల సంఖ్యలో ఉన్న స్వయంసహాయక గ్రూపులకు అందజేశారు. ముఖ్యంగా వ్యవసాయ, ఉద్యానవన పంటలపై మందులను స్ప్రే చేయడానికి ఇవి ఎంతగానో ఉపకరిస్తాయి. దీనిద్వారా ఆయా గ్రూపులకు చెందిన మహిళలు అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. ఇటీవలికాలంలో జమ్ము-కశ్మీర్‌కు దేశంలోని ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ బాగా పెరిగింది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైలు సర్వీసు నడుస్తుండగా, శ్రీనగర్ నుంచి సంగాల్దన్‌కు, సంగాల్దన్ నుంచి బారాముల్లాకు రైలు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఇందుకు నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మోదీ విమర్శకుడు ఫారూక్ అబ్దుల్లా కూడా కృతజ్ఞతలు తెలియచేయక తప్పలేదు. దేశవ్యాప్తంగా రైల్వేల విద్యుదీకరణ వేగంగా కొనసాగుతోంది. జమ్ము- కశ్మీర్‌లో మొట్టమొదటి విద్యుత్ రైలు నేడు అందు బాటులోకి వచ్చిన సందర్భంగా ప్రధాని

## ప్రధానితో లబ్దిదారుల ముఖాముఖి



- **వీణాదేవి (కిస్తివార్‌జిల్లా):** ఉజ్వల యోజన పథకం వల్ల సమయం ఎంతో ఆదా అవుతోంది. అంతకుముందు వంటచెరకు కోసం అడవికి వెళ్లాల్సి వచ్చేది. ఇందుకోసం ఎంతో కాలహరణం జరిగేది. ప్రస్తుతం ఉజ్వల యోజన కారణంగా నాకోసం, నా కుటుంబం కోసం కొంత సమయాన్ని వెచ్చించే అవకాశం కలిగింది.
- **కీర్తి శర్మ (కతువా):** రాష్ట్రీయ అజీవిక అభియాన్ లబ్దిదారు. ఈ పథకాన్ని స్వయం సహాయక గ్రూపులకు అనుసంధానించడం ఎంతో ప్రయోజన కరమైంది. తొలుత రూ.30వేలతో షెడ్‌ను నిర్మించి గోవుల పెంపకాన్ని ప్రారంభించగా, ఈ పథకం కింద మరో రూ.లక్ష రుణం లభించడంతో అదనంగా మూడు ఆవులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఈమె గ్రూపుకింద 30 ఆవులున్నాయి. బ్యాంకు రుణం పూర్తిగా తీర్చివేశారు.
- **లాల్ మహమ్మద్ (పూంచ్):** పాక్ సరిహద్దు ప్రాంతంలో తనకు మట్టి ఇల్లు ఉండగా, పాక్ రేంజర్ల కాల్పులకు గోడలు దెబ్బతినేవని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రూ.1,30,000 సహాయం అందడంతో పక్కా ఇంటిని నిర్మించుకున్నట్టు తెలిపాడు.
- **షహీనా బేగం (బందిపుర):** ఈమె సోషియాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేట్. ఉద్యోగం దొరకలేదు. స్వయం సహాయక గ్రూపులో చేరి రుణసహాయంతో తేనెటీగల పెంపకాన్ని చేపట్టింది. తర్వాత జాతీయ జీవనోపాధి మిషన్ కింద సహాయం పొంది ఈ ప్రాజెక్టును మరింత విస్తరించింది. అంతేకాదు తాను ప్రారంభించిన కోళ్లపెంపకం వ్యాపారానికి కిసాన్ క్రెడిట్ కార్డు ఏవిధంగా ఉపయోగపడింది కూడా ప్రధానికి వివరించారు.
- **రియాజ్ అహమ్మద్ కోలి (పుల్వామా):** ఈయన జల్‌జీవన్ మిషన్ లబ్దిదారు. ప్రస్తుతం తమ గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా పైప్‌లైన్లు ఉన్నాయని ప్రధానికి తెలిపారు. 370 అధికరణం రద్దు తర్వాత తన భూమిపై ఆస్తి హక్కులు లభించాయని ఆనందంగా వెల్లడించారు.

కేంద్రపాలిత ప్రాంత ప్రజలను అభినందించారు. ఇక రోడ్డు సదుపాయాల విషయానికి వస్తే శ్రీనగర్ రింగ్‌రోడ్డు రెండోదశ నిర్మాణం ద్వారా మానస్‌బల్ సరస్సు, ఖీర్ భవానీ దేవాలయానికి మరింత సులువుగా వెళ్లవచ్చు. అదేవిధంగా శ్రీనగర్–బారాముల్లా–యూరి హైవే వల్ల పర్యాటక అభివృద్ధితో పాటు ఈ ప్రాంతంలోని రైతులు ఎంతో ప్రయోజనం పొందగలరు. ఢిల్లీ–అమృత్‌సర్– కట్రా ఎక్స్‌ప్రెస్ హైవే వల్ల ఢిల్లీ–జమ్ము మధ్య ప్రయాణం మరింత సౌకర్యవంతం కాగలదు.

**పెట్టుబడులకు గల్ఫ్ దేశాల ఉత్సాహం**

జమ్ము–కశ్మీర్‌లో పెట్టుబడులు పెట్టేందుకు గల్ఫ్ దేశాలు ఎంతో ఉత్సాహం చూపుతున్నాయి. అంతేకాదు జి–20 దేశాల సమావేశాలు ఇక్కడ కూడా ఏర్పాటు చేయడంతో, ప్రపంచానికి జమ్ము–కశ్మీర్ అందాల గురించి మరింతగా తెలిసింది. గత ఏడాది జమ్ము–కశ్మీర్‌ను సందర్శించిన పర్యాటకుల సంఖ్య రెండుకోట్లు దాటింది. అమర్‌నాథ్, శ్రీ వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించే యాత్రికుల సంఖ్య గత దశాబ్దకాలంలో ఎన్నడూలేని రీతిలో అత్యధిక స్థాయికి చేరుకుంది. జమ్ము–కశ్మీర్‌లో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా కొనసాగిస్తున్న కారణంగానే పర్యాటకుల సంఖ్య గరిష్టస్థాయికి చేరుకున్నదనేది అక్షరసత్యం. సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలుకా వాలంటే దేశ ఆర్థికపరిస్థితి బలంగా ఉండాలి. ప్రస్తుతం మనదేశం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందిన నేపథ్యంలో ఈ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయగలుగుతోంది. పక్కా ఇళ్లు, ఉచిత రేషన్, వైద్యసదుపాయం, గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్ల నిర్మాణం, కిసాన్ సమ్మాన్ నిధి వంటివి అమలు చేయగలగడానికి ప్రధాన కారణం దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటమే. వచ్చే ఐదేళ్లకాలంలో దేశాన్ని మూడో బలీయమైన ఆర్థిక వ్యవస్థ స్థాయికి తీసుకెళ్లడం ప్రధాన లక్ష్యంగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. అప్పుడు నిరుపేదల సంక్షేమం, మౌలిక సదుపాయాలకోసం ప్రభుత్వం మరింతగా ఖర్చుచేయ గలుగుతుంది. ఇందుకు జమ్ము–కశ్మీర్ మినహాయింపు కాదని ప్రధాని వివరించారు.

**విద్యారంగానికి ప్రోత్సాహం**

దేశంలో విద్యారంగం, నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో రూ.13,375 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఐఐటి భిలాయ్, ఐఐటి తిరుపతి, ఐఐఎస్‌ఈఆర్ తిరుపతి, ఐఐటీడీఎం కర్నూల్లో శాశ్వత క్యాంపస్ భవనాలను, ఐఐటి పాట్నా, ఐఐటి రోపోర్‌లలో అకాడమిక్, నివాస భవన సముదాయాలను, దేవప్రయాగ (ఉత్తరాఖండ్), అగర్తలా (త్రిపుర)ల్లో సంస్కృత విశ్వవిద్యాలయాల శాశ్వత భవన సముదాయాన్ని ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. ఐఐఎం విశాఖపట్నం, ఐఐఎం జమ్ము, ఐఐఎం బుద్ధగయల్లో శాశ్వత క్యాంపస్‌లను ప్రారంభించారు. అదేవిధంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ (ఐఐఎస్), కాన్పూర్‌ను ప్రారంభించారు. ఐఐఎస్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన నైపుణ్య శిక్షణ సంస్థ.

ఇదే సమయంలో ప్రధాని దేశంలోని వివిధ ప్రాంతాల్లో అత్యున్నత విద్యా సంస్థలకు శంకుస్థాపన చేశారు. ముఖ్యంగా ప్రస్తుత విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి పరచేందుకు



## నా ఆశీస్సులు ఉంటాయి

ప్రధాని జమ్ము పర్యటనలో భాగంగా మౌలానా ఆజాద్ మైదానంలో ప్రసంగిస్తున్నప్పుడు ఒక ఆసక్తికర సంఘటన జరిగింది. సభకు వచ్చిన ఒక వ్యక్తి తన చిన్నారిని చేతులతో ఎత్తి పట్టుకుని మోదీ ఆశీస్సులు కోరారు. వెంటనే మోదీ తన ఉపన్యాసాన్ని ఆపివేసి నా ఆశీస్సులు తప్పక ఉంటాయి. ఈ చలిలో ముందు చిన్నారిని జాగ్రత్తగా చూడండి అని సూచించారు.

## భారత్‌లో భద్రంగా ఉన్నాను, కశ్మీర్‌లో స్వేచ్ఛగా ఉన్నాను



"భారత్‌లో అంతర్భాగమైన కశ్మీర్‌లో నేను భద్రంగా ఉన్నాను. స్వేచ్ఛగా ఉన్నాను." అన్నారు కశ్మీర్ సామాజిక కార్యకర్త యానా మీర్. బ్రిటిష్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పైగా భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్ సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ ఈ మాటలు అన్నారు. సంకల్ప దివస్ సందర్భంగా బ్రిటిష్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ యానా, తాను స్వదేశం వీడి పారిపోయిన మలాలా యూసుఫ్‌జాయిని కాదని కూడా అన్నారు. ముస్లిం ఉగ్రవాదుల బెదిరింపులతో మలాలా పాకిస్తాన్‌లోని స్వాత్ లోయ నుంచి ప్రాణాలరచేత పట్టుకుని విదేశాలకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. 'నేను మలాలా యూసుఫ్ జాయిని కాదు. ఎందుకంటే నా దేశంలో నేను భద్రంగా ఉన్నాను. నేను పుట్టిన గడ్డ కశ్మీర్‌లో స్వేచ్ఛగా కూడా ఉన్నాను. అది భారత్‌లో అంతర్భాగం అని యానా వ్యాఖ్యానించారు. నా దేశం నుంచి పారిపోయి వేరే ఎక్కడో ఆశ్రయం పొందవలసిన అవసరం తనకు లేదని కూడా యానా అన్నారు. నా మాతృదేశ ప్రతిష్టను మలాలా అవమానిస్తే అంగీకరించబోనని కూడా స్పష్టం చేశారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న నా దేశంలో ఎవరినో అణచివేస్తున్నారు వంటి ఆరోపణలు సరికాదని యానా అన్నారు. ఏనాడూ కశ్మీర్‌లో పర్యటించడానికి సాహసం చేయకుండా ఇలా జాతీయ అంతర్జాతీయ సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం చేసే టూల్‌కిట్ సభ్యుల మాటలను తాను ఖండిస్తున్నానని కూడా యానా స్పష్టం చేశారు.

2012లో మలాలా మీద తాలిబన్ స్వాత్ లోయలో దాడి జరిపారు. బాలికల విద్యను తాలిబన్ నిషేధించినందుకు నిరసనగా ఆమె గళమెత్తి దాడికి గురయ్యారు. తరువాత పాక్ నుంచి బ్రిటన్ వెళ్లిపోయారు. ఆక్స్‌ఫర్డ్‌లో చేరిన తరువాత ఆమె అతి పిన్న వయసులో నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నారు. మలాల సహా ఇంగ్లండ్‌లో ఉంటూ భారత్‌పై దుష్ప్రచారం చేసే వారంతా ఆ పని మానుకోవాలని యానా విజ్ఞప్తి చేశారు. ఇంగ్లండ్‌లో కూర్చుని భారతీయులను విడదీసే ప్రయత్నం ఆపాలని కూడా ఆమె కోరారు. మీ ప్రచారాలు ఆపండి, కశ్మీరీలను ప్రశాంతంగా బతకనివ్వండి. జైహింద్ అని ఉపన్యాసం ముగించారు యానా. డైవర్సిటీ అంబాసెడార్ పురస్కారం అందుకున్న యానా, 370 రద్దు తరువాత కశ్మీర్‌లో జరిగిన పురోగతి గురించి కూడా వివరించారు. ★



కోట్ల వ్యయంతో నిర్మించిన ఎఐఐఎంఎస్‌లో 720 పడకలు, 125 సీట్లు కలిగిన మెడికల్ కళాశాల, 60 నర్సింగ్ సీట్లు, 30 పడకలతో కూడిన ఆయుష్ బ్లాక్ ఉన్నాయి. ఇంకా ఫ్యాకల్టీ, సిబ్బందికి నివాసాలు, యు.జి, పి.జి. విద్యార్థులకు హాస్టల్ సదుపాయం, నైట్ షెల్టర్, గెస్ట్‌హౌజ్, ఆడిటోరియం, షాపింగ్ కాంప్లెక్స్ వంటి సదుపాయా లను సమకూర్చారు. ఈ క్యాంపస్ నిర్మాణం 227 ఎకరాల్లో జరిగింది. 18 స్పెషలిస్ట్ విభాగాల్లో ఈ సంస్థ రోగులకు అత్యాధునిక వైద్యసేవలందిస్తుంది. అదేవిధంగా కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ఎండో క్రినాలజీ, బర్న్స్ & ప్లాస్టిక్ సర్జరీవంటి 17విభాగాల్లో సూపర్‌స్పెషాలిటీ సర్వీసులు ఈ సంస్థలో రోగులకు అందుబాటులో ఉంటాయి. ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ఎమర్జెన్సీ & ట్రౌమా యూనిట్, 20 మాడ్యులార్ ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్ లేబొరేట రీలు, బ్లడ్ బ్యాంక్, ఫార్మసీ వంటి సదుపాయాలను కూడా ఎఐఐఎంఎస్ సంస్థలో కల్పించారు. సుదూర ప్రాంతాలకు అందు బాటులో ఉండాలన్న ఉద్దేశంతో డిజిటల్ హెల్త్‌కు సంబంధించిన మౌలిక సదుపాయా లను కూడా ఈ ఆసుపత్రిలో పొందుపరచారు.

ఉద్దేశించిన ప్రాజెక్టులివి! వీటిల్లో సింధూ సెంట్రల్ యూనివర్సిటీ, ఐఐఐటి రాయ్‌చూర్‌లలో శాశ్వత క్యాంపస్‌ల నిర్మాణం, ఐఐటీ బొంబాయిలో శాశ్వత అకాడమిక్ బ్లాక్ నిర్మాణం, హాస్టల్, ఫ్యాకల్టీ క్వార్టర్లనిర్మాణం, ఐఐటీ గాంధీనగర్‌లో హాస్టల్, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం, బెనారస్ హిందూ యూనివర్సిటీలో బాలికల హాస్టల్ నిర్మాణం ఉన్నాయి.

**ఎఐఐఎంఎస్ జమ్ము**

జమ్ము–కశ్మీర్ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవ లందించే లక్ష్యంతో విజయ్ పూర్ (సాంబ), జమ్ములో ప్రధాని నరేంద్రమోదీ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఐఎంఎస్)ను ప్రారంభిం చారు. 2019 ఫిబ్రవరిలో ఈ సంస్థకు శంకుస్థాపన చేసింది కూడా నరేంద్రమోదీనే. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షా యోజన కింద ఈ సంస్థను నెలకొల్పారు. మొత్తం రూ.1660

**జమ్ము ఎయిర్‌పోర్ట్‌లో కొత్త టెర్మినల్ భవనానికి శంకుస్థాపన**

ప్రధాని నరేంద్రమోదీ జమ్ము విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనానికి శంకుస్థాపన చేశారు. 40వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించబోయే ఈ భవనంలో అన్నికాలాల ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. రద్దీ వేళల్లో రెండువేల మంది ప్రయాణికులు ఈ సదుపాయాలను వినియో గించుకో గలుగుతారు. ఈ భవనం పర్యావరణానికి హాని కలిగించని రీతిలో, స్థానిక సంస్కృతీ సంప్రదా యాలను ప్రతిబింబించే విధంగా నిర్మించనున్నారు. దీని ద్వారా ఈ ప్రాంతంలో వర్తకం, పర్యాటకాలకు తగిన ప్రోత్సాహం లభించడమే కాదు, ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఇది దోహదకారిగా ఉండగలదు.

**రైలు ప్రాజెక్టులు**

జమ్ము–కశ్మీర్‌లోని వివిధ రైలు ప్రాజెక్టులతోపాటు, బనిహాల్–ఖా రి– సంబర్–సంగల్దాన్ (48 కి.మీ.) రైల్వే లైను, బారాముల్లా– శ్రీనగర్– బనిహాల్–సంగల్దాన్ సెక్షన్‌లో(185.66 కి.మీ) విద్యుదీకరణ పూర్తయిన రైల్వేలైన్లను ప్రధాని ప్రారంభించారు. జమ్ము–కశ్మీర్‌లో తొలి విద్యుత్ రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభించడమే కాకుండా, సంగల్దాన్–బారాముల్లా స్టేషన్‌ల మధ్య రైలు సర్వీసును కూడా ప్రారంభించారు. బనిహాల్–ఖారి–సంబర్–సంగల్దాన్ సెక్షన్‌లో రైల్వే లైను బల్లాస్ లెస్ ట్రాక్ (బీఎల్‌టీ) రకానికి (రైల్వే ట్రాక్ నిర్మాణంలో ఇదొరకం) చెందినది కావడం విశేషం. దీనివల్ల ప్రయాణీకులు మంచి ప్రయాణ అనుభూతిని పొందగలరు. అదేవిధంగా ఖారి–సంబర్ మధ్య 12.77 కిలోమీటర్ల మేర నిర్మించిన అతిపెద్ద టి–20 సొరంగం ప్రత్యేక ఆకర్షణ. ఈ రైలు ప్రాజెక్టు పర్యావరణ హితమైనది కావడమే కాకుండా, ఈ ప్రాంతానికి అనుసంధానతో పాటు, ఆర్థికాభివృద్ధికి దోహదకారి కాగలదు.

**రోడ్డు ప్రాజెక్టులు**

ప్రధాని తన జమ్ము పర్యటనలో భాగంగా రోడ్డు ప్రాజెక్టులకు సంబంధించి రెండు ప్రధాన ప్యాకేజీలను ప్రారంభించారు. వీటిల్లో 42 కిలోమీటర్ల దూరం

## జమ్ములో ప్రధాని నరేంద్రమోదీ మ్యాజిక్

- ఐఐటి భిలాయ్, ఐఐటి తిరుపతి, ఐఐఐటిడిఎం కర్నూల్, ఐఐఎం బుద్ధగయ, ఐఐఎం జమ్ము, ఐఐఎం విశాఖపట్నం, ఇండియన్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ స్కిల్స్ (ఐఐఎస్) కాన్పూర్ విద్యా సంస్థల క్యాంపస్‌లు జాతికి అంకితం.
- దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు చెందిన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన.
- జమ్ము ఎఐఐఎంఎస్ ప్రారంభం.
- జమ్ము విమానాశ్రయం నూతన టెర్మినల్ భవనానికి, కామన్ యూజర్ ఫెసిలిటీ పెట్రో లియం డిపోకు శంకుస్థాపన.
- జమ్ము–కశ్మీర్‌లో పౌర సదుపాయాలు, మౌలిక వసతులకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన.
- వికసిత్ జమ్ము–కశ్మీర్ కార్యక్రమం కింద యువత, మహిళలు, రైతులు, నిరు పేదలపై ప్రత్యేక దృష్టి.
- సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనేవి జమ్ము–కశ్మీర్ అభివృద్ధికి పునాదులు.
- మొట్టమొదటిసారి జమ్ము–కశ్మీర్ ప్రజలకు రాజ్యాంగంలో పొందుపరచిన సామాజిక న్యాయం అందుబాటులోకి రావడం.
- 370వ అధికరణం రద్దుతో జమ్ము–కశ్మీర్ అభివృద్ధికి అడ్డంకులన్నీ తొలగిపోవడం.
- వికసిత్ జమ్ము–కశ్మీర్‌ను వీక్షిస్తూ ఉత్తేజం పొందుతున్న ప్రపంచం.



ఉండే ఢిల్లీ-అమృత్‌సర్-కట్రా ఎక్స్‌ప్రెస్ హైవే ఒకటి. ఇది జమ్మును కట్రాతో కలుపుతుంది. ఇక రెండో ప్యాకేజీ శ్రీనగర్ రింగ్‌రోడ్డు రెండో దశ. జాతీయ రహదారి-01కు చెందిన 161 కిలోమీటర్ల పొడవైన శ్రీనగర్- బారా ముల్లా-యూరి సెక్టార్‌లో స్థాయి పెంపుకోసం ఐదు ప్యాకేజీలు, జాతీయ రహదారి-444కు చెందిన కుల్‌గామ్ బైపాస్ మరియు పుల్వామా బైపాస్‌ల నిర్మాణం మరో ప్రాజెక్టు.

ఢిల్లీ-అమృతసర్-కట్రా హైవే నిర్మాణం పూర్తయితే మాతా వైష్ణోదేవి దేవాల యాన్ని సందర్శించే భక్తులకు ఎంతో సదుపాయంగా ఉంటుంది. ఇదే సమయంలో ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఎంతో దోహదకారి కాగలదు. శ్రీనగర్ రింగ్ రోడ్డుకు సంబంధించి రెండోదశలో చేపట్టిన నాలుగు లేన్ల రహదారి నిర్మాణంలో జాతీయరహదారి-01కు చెందిన సుంబాల్- వాయుల్ రహదారి స్థాయి పెంపు కూడా భాగంగా ఉంది. 24.7 కిలోమీటర్ల దూరం గల ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే శ్రీనగర్ పట్టణంలో ట్రాఫిక్ రద్దీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అంతేకాదు మానస్‌బల్-ఖీర్ భవానీ దేవాలయాలకు అనుసంధానత కూడా పెరుగుతుంది. ఇదే సమయంలో లేహ్, లద్దాఖ్‌లకు ప్రయాణకాలం కూడా గణనీయంగా తగ్గడం మరో విశేషం. జాతీయ రహదారి-01కు చెందిన 161 కిలోమీటర్ల శ్రీనగర్-బారాముల్లా-యూరి రహదారి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైంది. ఇదే సమయంలో బారాముల్లా, యూరి, జాతీయ రహదారి-444కు చెందిన కుల్గామ్ బైపాస్, పుల్వామా బైపాస్‌లు... ఖాజీగుండ్-కుల్గామ్-సోపియాన్-పుల్వామా-బద్గామ్-శ్రీనగర్‌లను అనుసంధానించడం వల్ల, ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కూడా గణనీయంగా పెరుగుతాయి.

**సీయూఎఫ్ పెట్రోలియం డిపో**

ప్రధాని నరేంద్రమోదీ జమ్ములో కామన్ యూజర్ ఫెసిలిటీ (సీయూఎఫ్) పెట్రోలియం డిపోకు శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణ వ్యయం రూ.677 కోట్లు. దీని నిల్వ సామర్థ్యం లక్ష కిలోలీటర్లు. ఇందులో మోటార్ స్పిరిట్ (ఎంఎస్), హైస్పీడ్ డీజిల్ (హెచ్ఎస్‌డీ), సూపర్ కిరోసిన్ ఆయిల్ (ఎస్‌కేఓ), ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్(ఏటీఎఫ్), ఇథనాల్, బయోడీజిల్, వింటర్ గ్రేడ్ హెచ్ఎస్‌డీని నిల్వ చేయవచ్చు.

**ఇతర ప్రాజెక్టులు**

ప్రధాని నరేంద్రమోదీ ఇంకా రూ.3150కోట్ల విలువైన ఇతర పౌర అభివృద్ధి ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపన చేశారు. జమ్ము-కశ్మీర్‌లో పౌర సదుపాయాల కల్పనకోసం ఈ ప్రాజెక్టులను ఉద్దేశించారు. వీటిలో రోడ్లు, వంతెనలు, గ్రిడ్ స్టేషన్లు, రిసీవింగ్ స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్ ప్రాజెక్టులు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, వివిధ కళాశాలల భవనాల నిర్మాణాలు, శ్రీనగర్ నగరంలో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ, ఆధునిక నార్వెల్ ఫ్రూట్ మండి, కథువాలో ఔషధాల పరీక్షాకేంద్రం, గండెర్‌వాల్, కుప్‌వారాల్లో 224 ఫ్లాట్లు వంటివి ఉన్నాయి. శంకుస్థాపన చేసిన వాటిల్లో జమ్ము-కశ్మీర్‌లో ఐదు ఇండస్ట్రియల్ ఎస్టేట్లు కూడా ఉండటం విశేషం. జమ్ము స్మార్ట్ సిటీకి చెందిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అవసరమైన డేటా సెంటర్, డిశాస్టర్ రికవరీ సెంటర్లకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. శ్రీనగర్‌లోని పరింపురలో ట్రన్స్‌పోర్ట్‌నగర్ స్థాయిపెంపు, 62 రోడ్డు, 42వంతెనల ప్రాజెక్టుల స్థాయిపెంపు, అనంతనాగ్, కుల్గామ్, కుప్వారా, సోపియాన్, పుల్వామా తదితర ప్రాంతాల్లో 2816 ప్లాట్లకు శంకు స్థాపన చేశారు.

**స్విట్జర్లాండ్‌కు పోటీగా...**

ప్రపంచంలో అద్భుతమైన పర్యాటక ప్రదేశంగా పేరుపొందిన స్విట్జర్లాండ్‌కు పోటీగా, జమ్ము-కశ్మీర్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రోడ్లు, రైలు, విమానా శ్రయాలను మరింతగా విస్తరించే పనిలో పడింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రధాని పర్యటించారని విమర్శించేవారు ఎలాగూ ఉం టారు. కానీ చేసిన అభివృద్ధిని చూపి, చేయబోయే అభివృద్ధిని విడమరచి చెప్పడం ప్రభుత్వాధినేతగా ప్రధాని బాధ్యత! దాన్ని నరేంద్రమోదీ సమర్థవంతంగా చాక చక్యంగా నిర్వర్తిస్తున్నారు. 2019 ఆగస్టులో 370వ అధికరణాన్ని రద్దుచేసిన తర్వాత మోదీ జమ్ములో పర్యటించడం ఇది రెండోసారి. మౌలానా ఆజాద్ స్టేడియంలో ప్రధాని 30నిముషాలకు పైగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని సభకు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొనడం విశేషం. 2013లో తాను ప్రధాని కాకముందు నరేంద్రమోదీ ఇదే స్టేడియంలో "లల్‌కార్ ర్యాలీ" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. 2022 ఏప్రిల్‌లో కూడా నరేంద్రమోదీ సాంబలో నిర్వహించిన సభకు కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. నిజం చెప్పాలంటే ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్రమోదీ, జమ్ము-కశ్మీర్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఉగ్రవాదం, హింస, విధ్వంసంతో అట్టుడికిపోతున్న జమ్ము-కశ్మీర్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చి, దేశ ప్రధాన స్రవంతిలో కలపాలన్న లక్ష్యంతో గట్టిగా కృషి చేశారు... చేస్తున్నారు. ఈ కృషి సత్ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. వివిధ రంగాల్లో సాధిస్తున్న ప్రగతిని సుస్థిరంగా కొనసాగేవిధంగా చూడాల్సిన బాధ్యత జమ్ము-కశ్మీర్ ప్రజలది. వారు ఉగ్రవాదం, మత ఛాందస వాదాలను దరిచేరనీయనప్పుడే సాధిస్తున్న అభివృద్ధి సుస్థిరంగా మనగలుగుతుంది. ★





ఎన్నో భయాందోళనలు, ఉత్కంఠ పరిణామాల మధ్య పాక్ ఎన్నికలు ముగిశాయి. మార్చి మొదటి వారంలో షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కొలువు తీరనుంది. సైన్యం, ఇతర రాజకీయ పక్షాలు మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ)ని బలహీనపరిచేందుకు సర్వశక్తులు ఒడ్డినా, పీటీఐ మద్దతుదారులు స్వతంత్రులుగా నిలబడి తమ సత్తా చాటారు. మరోవైపు ఆర్థిక సంక్షోభం, ఇతర సామాజిక అంశాలు అభద్రతను పెంచుతున్న నేపథ్యంలో కొత్త ప్రభుత్వం గట్టెక్కటం కష్టమే అని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు.

# షెహబాజ్ షరీఫ్ ప్రభు

పాకిస్తాన్‌లో తాజా రాజకీయ పరిణామాలను చూస్తున్న వారంతా 'ఇల్లు అలకగానే పండగ కాదు' అంటున్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో నవాజ్ షరీఫ్ తదుపరి ప్రధాని అవుతారని భావించినా, షెహబాజ్ షరీఫ్‌ను కూటమి కొత్తగా నేతగా నియమించారు. నవాజ్ షరీఫ్, ఆయన పార్టీ పాకిస్తాన్ ముస్లిం లీగ్ (పీఎంఎల్-ఎన్) అత్యధిక స్థానాలను గెలుచుకోవచ్చని ఎన్నికలకు ముందు, రాజకీయ విశ్లేషకులు భావించారు. సర్వేలు కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ వచ్చాయి.

ఈ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులు 101 సీట్లను గెలుచుకోగా, వారిలో 93 మంది ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పీటీఐ మద్దతుదారులే. పాకిస్తాన్ ముస్లిం లీగ్(నవాజ్) 75, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ 54, ఎంక్యూఎం పాకిస్తాన్ 17 సీట్లు గెలుచుకున్నాయి. ప్రభుత్వం ఏర్పాటుకు ఏ పార్టీకి మెజార్టీ రాలేదు. షెహబాజ్ నేతృత్వంలో ఏర్పడే పై మూడుతో పాటు ఇతర చిన్న పార్టీలు ఉన్నాయి. అయితే ఇది బలహీనమైన సంకీర్ణం అని ఇమ్రాన్ పార్టీ వ్యాఖ్యానించింది.

తగినంత మెజార్టీ లేకపోవటంతో నవాజ్ పదవి చేపట్టడంలేదని ఆయన మద్దతుదారులు చెబుతుండగా, దాని వెనుక రాజకీయ వ్యూహం ఉందని రాజకీయనిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వంలో అస్థిరత ఏర్పడినప్పుడు వెనుక ఉండి చక్రం తిప్పే అవకాశం ఉందని అంటున్నారు.

**కొత్త ప్రభుత్వం ముందున్న సవాళ్లు**

షెహబాజ్ షరీఫ్ పదహారు నెలల పాటు (ఏప్రిల్ 2022- ఆగస్టు 2023 )వరకు ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో పాక్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఐఎంఎఫ్ నుంచి, ఇతర దేశాల నుండి సహాయం ఉన్నప్పటికీ కోలుకునే సూచన కనిపించలేదు. ఎగుమతులు తగ్గుతూ దిగుమతులు పెరిగాయి. దేశ ఆర్థికవ్యవస్థ తొలిసారిగా కుంచించుకుపోయింది. ప్రభుత్వ వ్యయాలను అరికట్టడానికి, పన్ను నెట్‌ను విస్తరించడానికి, సబ్సిడీలను తొలగించడానికి ఐఎంఎఫ్ నుంచి పెరుగుతున్న ఒత్తిడి మధ్య ఆర్థిక వ్యవస్థను నిర్వహించడం కఠినమైన సవాలుగా మారుతోంది.



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడానికి అతనికి పెద్దగా అవకాశాలు ఉండకపోవచ్చు అనే అభిప్రాయం వినిపిస్తోంది. కూటమి భాగస్వాముల మధ్య బందీగా ఉండవలసి రావటం వల్ల బలమైన నిర్ణయాలు తీసుకోవటానికి ఇబ్బంది అవుతుందని అంటున్నారు.

కొత్త ప్రభుత్వానికి భద్రతా సమస్యలు మరో సవాలు. గత రెండేళ్లలో ఉగ్రదాడులు అనేక రెట్లు పెరగడమే కాకుండా ఆఫ్ఘనిస్తాన్‌తో సంబంధాలు క్షీణించాయి. 2023లో ఉగ్రవాద దాడులు 70 శాతం పెరిగాయి. రెండు ప్రావిన్స్‌లు కేపీలో 39.5 శాతం, బలూచిస్తాన్‌లో 42.9 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. కేపీలోని ఒక జాతీయ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికలు ఒక అభ్యర్థి హత్య కారణంగా రద్దు చేయబడ్డాయి.

ప్రభుత్వం తన రాజకీయ మనుగడ కోసం సైన్యంతో కలిసి పనిచేయాలి. పీఎంఎల్,పీపీపీలు ఒకప్పుడు సైన్యాన్ని దూరంగా ఉంచాలనే ఒప్పందం చేసుకున్నాయి. .ఎన్నికల ఫలితాలను తిరస్కరించిన పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ), జమాత్ ఉలేమా ఇస్లాం-ఫజల్ (జేయూఐ-ఎఫ్) పాలనా వ్యవహారాలకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించే అవకాశం ఉంది. అంతంత బలంగల ప్రభుత్వం ఉగ్రవాద ముప్పును ఎదుర్కోవడానికి ఐక్య విధానాన్ని తీసుకురాలేకపోవచ్చు.

షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయా అనే దానిపై చాలామంది రాజకీయ నాయకులు, వ్యాఖ్యాతలు, అంతర్జాతీయ పరిశీలకులు చివరి క్షణం వరకు సందేహంతోనే ఉన్నారు. అత్యున్నత న్యాయస్థానం జోక్యం తర్వాతే తేదీ నిర్ణయమైంది. ఆగస్టు 2023లో ప్రభుత్వం రద్దు కాగా, దేశ రాజ్యాంగం ప్రకారం, మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి. అయితే, తాజాగా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల విభజనకు కొంత సమయం పట్టింది.

పోలింగ్‌కు ఒక్క రోజు ముందు బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో రెండు భీకర బాంబు దాడులు జరగగా, 22 మంది చనిపోయినట్లు అధికారులు ప్రకటించారు. పిషిన్ జిల్లాలోని ఖనుజాయ్ ప్రాంతంలో స్వతంత్ర అభ్యర్థి కార్యాలయం ఎదురుగా జరిగిన దాడిలో 14 మంది మృతి చెందారు. 35 మంది గాయాలపాలయ్యారు.అక్కడికి 50 కి.మీ. దూరంలో ఖిల్లా సైఫుల్లా జిల్లాలో జరిగిన దాడిలో ఎనిమిది మంది చనిపోయారు.

**ఇమ్రాన్ ఎత్తులు.. షరీఫ్ వ్యూహాలు,**

రాజకీయాల్లో తిరిగి రావడానికి షరీఫ్ సైన్యంతో ఒప్పందం చేసుకున్నట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. నవాజ్ షరీఫ్ విదేశాల్లో ఉన్నప్పుడు తరచుగా సాయుధ బలగాలకు వ్యతిరేకంగా గొంతెత్తేవారు. దేశంలోని రాజకీయ అస్థిరతకు ముఖ్యంగా ఐఎస్ఐ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మాజీ హెడ్, మాజీ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌ను నిందించారు. న్యాయవ్యవస్థను కూడా ఆయన తీవ్రంగా విమర్శించారు. న్యాయమూర్తులు కుమ్మక్కయ్యారని, బోగస్ కేసులకు తాను బాధితుడిగా మారినట్లు వ్యాఖ్యానించారు. స్వదేశానికి తిరిగి వచ్చినప్పటి నుంచి ఆయనకు చట్టపరంగా చాలా ఉపశమనాలు దక్కాయి. దీన్నిబట్టే ఆయనకు మిలిటరీ మద్దతు ఉన్నట్లుగా అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

ఇమ్రాన్ ఖాన్ పాలనకాలం అల్లకల్లోలంగా సాగింది. మిలిటరీతో ఆయన సంబంధాలు చెడిపోయాయి. 2022లో పార్లమెంట్ అవిశ్వాస తీర్మానంలో ఓడిన ఇమ్రాన్ ఖాన్ పదవీ నుంచి



షెహబాజ్ షరీఫ్

# త్వానికి చుక్కలే..?

తప్పుకోవడంతో నవాజ్ షరీఫ్ తమ్ముడు షాబాజ్ షరీఫ్ బాధ్యతలు స్వీకరించారు.

ఇమ్రాన్ ఖాన్ పతనం తర్వాత నుంచి షరీఫ్ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు రాజకీయ కార్యకలాపాలను వేగవంతం చేశారు. ఆయనను పదవీచ్యుతుడిని చేసిన మిలటరీ మళ్లీ స్వాగతించడంతో ఆయనపై ఉన్న కేసులన్నీ కరిగిపోయాయి. ఆయన 1990లో ఆయన మొట్టమొదటగా ప్రధానమంత్రి అయ్యారు. అప్పటి ప్రతిపక్ష నేత బెనజీర్ భుట్టో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా 1993లో ఆయనను తొలగించారు.

1997లో మళ్లీ ప్రధానమంత్రి అయ్యి రాజకీయాలను శాసించేలా కనిపించారు. రెండేళ్లకు (1999) ఆయన ప్రభుత్వాన్ని ఆర్మీ చీఫ్ పర్వేజ్ ముషారఫ్ కూలగొట్టారు. హైజాకింగ్, తీవ్రవాదం ఆరోపణలపై అరెస్ట్ చేసి జీవితఖైదు విధించారు. అవినీతికి పాల్పడ్డారంటూ రాజకీయ కార్యకలాపాల నుంచి జీవితకాల నిషేధం విధించారు. షరీఫ్‌తో పాటు ఆయన 40 మంది కుటుంబ సభ్యులను పదేళ్ల పాటు సౌదీ అరేబియాకు బహిష్కరించారు. 2007లో పాకిస్తాన్‌కు తిరిగొచ్చేవరకు ఆయన రాజకీయ జీవితం నెమ్మదించింది. తర్వాత ప్రతిపక్షంలో ఓపికగా వ్యవహరించారు. 2008 ఎన్నికల్లో ఆయన ఆతని పీఎంఎల్-ఎన్ పార్టీ పార్లమెంట్‌లో నాలుగింట ఒక వంతు సీట్లను గెలుచుకుంది.

2013 ఎన్నికల్లో విజయం సాధించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఇమ్రాన్ ఖాన్ పార్టీ నుంచి ఆయన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల్లో షరీఫ్ రిగ్గింగ్ చేశారని ఆరోపిస్తూ ఇస్లామాబాద్‌లో పీటీఐ పార్టీ ఆరు నెలల పాటు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసింది. 2016లో పనామా పేపర్ల లీకేజీ పైన సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఆయన అవినీతికి పాల్పడినట్లు నిర్ధారిస్తూ పాకిస్తాన్‌లోని ఒక కోర్టు జులై 6, 2018న పదేళ్ల జైలు శిక్ష విధించింది. భార్యకు లండన్ చికిత్స జరుగుతున్నందున ఆయన అప్పట్లో అక్కడే ఉన్నారు.

ఈ ఎన్నికల ఫలితాలు ఇమ్రాన్ ఖాన్ పీటీఐ పార్టీకి గల ప్రజాదరణ సోషల్ మీడియా బబుల్ కాదని, నిజమైనదేనని స్పష్టం చేశాయి. ఎన్ని అవరోధాలు సృష్టించినా ప్రజలు పెత్తఎత్తున ఓటు హక్కు వినియోగించుకుని ఇమ్రాన్ ఖాన్‌కు మద్దతు పలికారు. ఇమ్రాన్ ఖాన్ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం లేకపోవటంతో పలువురు స్వతంత్ర



ఇమ్రాన్ ఖాన్



ఆసిఫ్ ఆలీ జర్దారీ

అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. ఉమ్మడి బ్యాట్ గుర్తును ఎన్నికల కమిషన్ లేకుండా చేసింది. ఇన్ని అవరోధాల మధ్య వర్చువల్ ర్యాలీల ద్వారా ఇమ్రాన్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇది అద్భుతమైన ప్రభావాన్ని చూపింది. పార్టీ అధికారిక ట్విటర్ (ఎక్స్), టిక్‌టాక్ ఖాతాలకు మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. పాకిస్తాన్‌లోని మిగిలిన ప్రధాన రెండు పార్టీలైన పీపీపీ, పీఎంఎల్-ఎన్‌ల కన్నా కూడా ఎక్కువ సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నారు. ఇతర నాయకులతో పోలిస్తే ఇమ్రాన్‌ఖాన్ వ్యక్తిగత సోషల్ మీడియా అకౌంట్లకు ఫాలోవర్ల సంఖ్య భారీగా ఉంది. నేరుగా సందేశం ప్రజలకు చేరేందుకు ఇది అవకాశంగా మారింది.

ఎన్నికల కమిషన్ బ్యాట్ గుర్తును కేటాయించకపోయినా, ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించి, ఆయా స్థానాల వారీగా అభ్యర్థులు, వారికి ఎన్నికల కమిషన్ కేటాయించిన గుర్తుల వివరాలను ఒకేచోట ఉంచారు. పాకిస్తాన్ జనాభాలో 30% మాత్రమే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. అందువల్ల పీటీఐ వారిని చేరుకోవడంలో పరిమితులు ఉన్నాయని అంతా అంచనా వేశారు. అందరి అంచనాలు తల్లకిందులయ్యాయి. సైన్యం చివర్లో రిగ్గింగును ప్రోత్సహించి ఫలితాలను తారుమారు చేసింది.

ఈ ఎన్నికల్లో గెలిచిన ఓ అభ్యర్థి తన గెలుపు రిగ్గింగ్ వల్లనే అని సంచలనాత్మక ప్రకటన చేశారు. ఇమ్రాన్ పార్టీపై నిషేధం విధించటంతో స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలోకి దిగిన వారిలో నయూమ్ ఉర్ రహ్మాన్ ఒకరు. తనకు 26 వేల ఓట్లు వచ్చాయని, తనతో పోటీ పడిన సైఫ్ భారీకి 31వేల ఓట్లు వచ్చాయని, కానీ తర్వాత సైఫ్‌కి 11వేల ఓట్లు వచ్చినట్టు ప్రకటించారని పేర్కొన్నారు. రెహ్మాన్ ఆరోపణలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది. రిగ్గింగ్ ఆరోపణలపై వచ్చిన పిటీషన్ 2018ను పాక్ సుప్రీంకోర్టు కొట్టేసింది. అంతేకాదు. ఈ పిటీషన్ దాఖలు చేసిన మాజీ ఆర్మీ ఆఫీసరుకు జరిమానా కూడా విధించింది. మరోవైపు పోల్ రిగ్గింగు ఆరోపణలపై విచారణ చేపట్టాలని యూఎస్, ఈయూ డిమాండ్ చేస్తున్నాయి.

72 ఏళ్ల షెహబాజ్ షరీఫ్ పాక్ కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపడుతున్నారు. మరోవైపు మార్చి 9వ తేదీలోగా కొత్త అధ్యక్షుని ఎంపికకు రంగం సిద్ధం చేస్తున్నారు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ కో- ఛైర్ పర్సన్‌గా ఉన్న ఆసిఫ్ ఆలీ జర్దారీ (68) అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు బిల్వాల్ పార్టీ, నవాబ్ పార్టీలు ఉమ్మడి అభ్యర్థిగా రంగంలోకి దింపాలని నిర్ణయించాయి. అధికార ఒప్పందంలో షెహబాజ్ ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతు ఇచ్చినందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. 265 స్థానాలున్న పాక్ పార్లమెంటులో అధికారం చేపట్టటానికి 133 స్థానాలు సాధించిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ఫిబ్రవరి 8వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో ఏ పార్టీకి మెజార్టీ రాని పరిస్థితుల్లో సంకీర్ణం అనివార్యమైంది. వివిధ పార్టీల కలగూరగంపలా ఉన్న ప్రభుత్వం ఏ తీరులో ముందుకు సాగుతుంది, సవాళ్లను అధిగమిస్తుందని తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగవలసిందే. ★



రాష్ట్రంలో పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న విషయం నిజమేనని అందిన నివేదికను సర్వోన్నత న్యాయస్థానం ముందు ఉంచాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ ) ఆదేశించడంతో రాష్ట్ర సర్కారు న్యాయస్థానం ముందు దోషిగా నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్‌జిటి నిర్వహించిన విచారణ సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. అక్రమ మైనింగ్‌పై సామాజిక కార్యకర్త దండా నాగేంద్ర ఎన్‌జిటిలో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దానిమీద విచారణ జరిపిన ఎన్‌జిటి, తవ్వకాలను ఆపేయాలని, తవ్వకాలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని పర్యావరణ అటవీమంత్రిత్వశాఖను గతంలో ఆదేశించింది. ఆ మేరకు ఏర్పాటైన అటవీ మంత్రిత్వ శాఖ కమిటీ తన నివేదికలో, రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు సంబంధించిన పలు అక్రమాలను వివరించింది. పర్యావరణ అనుమతులు లేకుండా ఇంకా భారీగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు నివేదికలో నిర్ధారించింది. ఫొటోలతో పాటు ఇతర సాక్ష్యాధారాలతో నివేదికను ఎన్‌జిటికి అందజేసింది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొంది. ఎలాంటి అనుమతులు లేకుండా 24 గంటలూ తవ్వకాలు చేపడుతున్నారని, ఒక్కో రీచ్‌లో రోజుకు రెండు వేల టన్నుల మేర తవ్వకాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. శాటిలైట్ చిత్రాల ద్వారా తవ్వకాల ఆధారాలు సేకరించామని వివరించింది. ఎలాంటి ఈసీలు లేకుండా తవ్వకాలు చేస్తున్నారని తెలిపింది.

# ఇసుక తవ్వకాలపై నివేదికతో

గతంలో తాము ఇచ్చిన ఆదేశాలు అమలు కావట్లేదని ఎన్‌జిటి పేర్కొంది. కేంద్ర కమిటీ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించాలని కేంద్ర పర్యావరణ అటవీశాఖకు ఎన్‌జిటి ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంలో కలెక్టర్ల నివేదిక, కేంద్ర మంత్రిత్వశాఖ నివేదిక పూర్తి భిన్నంగా ఉన్నాయని పేర్కొంది. సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ జరుగుతోందని, ఏం చేయాలనేది న్యాయస్థానమే తేలుస్తుందని స్పష్టం చేసింది. తాము కూడా నివేదికను సర్వోన్నత న్యాయస్థానానికి అందజేస్తామని తెలిపింది.



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**
**ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ**

**దర్జాగా ఇసుక అక్రమ రవాణా**

ఆంధ్రప్రదేశ్‌లో దర్జాగా సాగే దందాల్లో ఇసుక అక్రమ రవాణా ఒకటి. నదులు, వాగులు, వంకల నుంచి రాత్రింబవళ్లనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుకను అక్రమంగా తవ్వి అమ్ముకోవడం ఏళ్ల తరబడి జరుగుతూనే ఉంది. నాటి ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కొత్త ఇసుక విధానంతో ఇసుక సరఫరాను నిలిపివేసింది. దీంతో నిర్మాణరంగం పూర్తిగా కుదేలైపోయింది. ఆ రంగంలోని సుమారు 30 లక్షల కార్మికులు ఉపాధి దొరకక రోడ్డున పడ్డారు. 2019 అక్టోబరులో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ఎత్తివేసి కొత్త విధానాన్ని తెచ్చింది. అదీ లోపభూయిష్టంగా ఉండటంతో దానిని మార్చారు. ఇలా ఇసుక విధానాన్ని మూడుసార్లు మార్చి, ఇసుకను పూర్తిగా వ్యాపారవస్తువుగా చేసేశారు. సామాన్యులకు ఇసుక దొరకడం లేదు. ఇసుక బంగారం కంటే విలువైనదిగా విమర్శలొచ్చాయి. ఐదేళ్ల కిందట ట్రాక్టరు ఇసుక ధర రూ.1500 ఉండగా, ఇప్పుడు రూ.5000 దాటింది. ఏటా రూ.50 వేల కోట్ల మేర అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అవినీతిని ప్రశ్నించిన వారిపై కక్షగట్టి ప్రమాదాల పేరుతో ఇసుక లారీలు, ట్రక్కుల చక్రాల కింద నలిపేస్తున్నారని ఆరోపణలు పెరిగాయి. గతంలో యూపీ, బీహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరిగే ఇలాంటి సంఘటనలు ఇప్పుడు ఏపీలో నిత్యకృత్యమైపోయాయని రాజకీయపార్టీలు, పర్యావరణవేత్తలు అంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మే 12, 2021 –మే 13, 2023 మధ్యకాలంలో ఇసుక కాంట్రాక్టును జేపీ వెంచర్‌కు ఇచ్చింది. 2021 మేలో ఇసుక టెండర్ అప్పగించారు. ఆ సంస్థ పేరిట వైసీపీ నేతలు, ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వేసినట్లు, వేల కోట్ల అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇసుక సరఫరాను సులభతరం చేసినట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకున్నా అదంతా అబద్ధమని వినియోగదారులు విమర్శిస్తున్నారు. ఇసుక బ్లాక్ మార్కెట్‌లో యథేచ్ఛగా లభిస్తోందంటున్నారు. రోజూ చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌లకు కొన్ని వందల లారీల ఇసుకను తరలించడం, దానిని అడ్డుకున్న వారిపై దాడులు చేయడం నిత్యకృత్యమైపోయింది. కొత్త వాల్టా చట్టం, దాని నిబంధనలు, 25, 71 జీవోల ముసుగులో అధికారికంగానే అంతులేని



# వైసీపీలో మథనం

దోపిడీకి తెరలేచిందంటున్నారు. కేవలం ఇసుక లాబీయింగ్‌తోనే పాలకపార్టీ నేతలు కోట్లాది రూపాయలను మింగేశారంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. 40 రీచ్‌లలో యంత్రాల్లేకుండా ఇసుకను తవ్వుకోవచ్చు కానీ 500 రీచ్‌లలో ఏకంగా జేసీబీలను రంగంలోకి దించి తవ్వేసుకున్నారంటున్నారని, ఒకేసారి 2 టన్నుల ఇసుకను వెలికి తీసే బకెట్లను వాడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. ఇక తాజాగా 2 నెలల క్రితం కాంట్రాక్టులు దక్కించుకున్న జేసికేసి, ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థలు కూడా ఇవే తప్పులు చేస్తూ దొరికిపోయా యంటున్నారు.

**జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో కేసు**

ఇసుక అక్రమ తవ్వకాలతో, పర్యావరణ విధ్వంసం చేస్తున్నారంటూ ఆగస్టులో జేపీ వెంచర్స్‌పై గుంటూరుకు చెందిన నాగేంద్రకుమార్ జాతీయ హరిత ట్రైబ్యునల్ కేసు వేశారు. రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ (సియా), కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని జాయింట్ కమిటీలతో ఎన్జీటీ విచారణలు చేయించింది. సెమీ మెకనైజ్డ్ రీచ్లో భారీ యంత్రాలు ఉపయోగించి ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, పర్యావరణ పరిరక్షణ మార్గదర్శకాలను పూర్తిగా ఉల్లంఘించారని విచారణలో తేలింది. చేతిరాతతో వే బిల్లులు ఇస్తున్నారు. కంప్యూటరైజ్డ్ బిల్లులు లేవు. సీసీ కెమెరాలు లేవు. వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ లేదు. ఇలా అడుగడుగునా ఉల్లంఘనలే. జిల్లాల వారీగా రీచ్ వివరాలు అడిగితే రాష్ట్ర ప్రభుత్వం, గనులశాఖ అవేవీ ఇవ్వలేదని, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఎన్జీటీకి నివేదించింది. దీంతో 2023 మార్చి 23న ఎన్జీటీ కీలక నిర్ణయం తీసుకుంది. కృష్ణా, గుంటూరు, చిత్తూరుతో పాటు రాష్ట్రంలోని అన్ని రీచ్‌ల (110–బీ2 కేటగిరీ) కు ఇచ్చిన పర్యావరణ అనుమతుల (ఈసీ)ను రద్దు చేసింది. జేపీ వెంచర్స్ తీవ్రస్థాయిలో పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడినందుకు ఒక్కో రీచ్‌కు రూ. 18 కోట్ల చొప్పున పెనాల్టీ విధించింది. ఆ సొమ్ము చెల్లించాలని, ఆ తర్వాతే ఇసుక మైనింగ్‌కు కొత్తగా ఈసీలు తీసుకోవాలని ఎన్జీటీ ఆదేశించింది. రాష్ట్రంలో 2023 మార్చి 23 నాటికి బీ2 కేటగిరీ సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లు 110 ఉన్నాయి. వీటికి ఇచ్చిన ఈసీలు రద్దయ్యాయి. అలాగే, ఎన్జీటీ ఆదేశాల మేరకు జేపీ వెంచర్స్ ఒక్కో రీచ్‌కు 18 కోట్ల చొప్పున మొత్తం 110 రీచ్‌కు కలిపి రూ. 1908 కోట్లు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. పెనాల్టీ చెల్లించాలని ఎన్జీటీ ఆదేశించడంతో జేపీ వెంచర్స్ సుప్రీం కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకుంది. సుప్రీంకోర్టు స్టే ఇచ్చేనాటికి ఇసుక అక్రమాలపై కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ జాయింట్ కమిటీల నివేదికలు అందలేదు. 2023 ఆగస్టులో సుప్రీం తీర్పు ప్రకారం ,,ఇసుక తవ్వకాలు చేపట్టడానికి కొత్తగా పర్యావరణ అనుమతులు తీసుకోవాలి. కానీ ఈసీలు లేకుండా, ఇసుక రీచ్లకు కొత్తగా అనుమతి లేకున్నా 2023 నవంబరు నెలాఖరు వరకు జేపీ వెంచర్స్ ఇసుక తవ్వకాలు జరిపిందని, పర్యావరణ మార్గదర్శకాల ఉల్లంఘన జరిగిందని కేంద్ర అటవీ పర్యావరణ పరిరక్షణ విభాగం ఎన్జీటీకి నివేదించింది. ఈ నేపథ్యంలో ఈ నివేదికను సుప్రీంకోర్టు ముందుంచాలని ఎన్జీటీ ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కొత్త ఈసీలు తీసుకున్నాక మైనింగ్ చేయాలన్న ఆదేశాన్ని జేపీ వెంచర్స్ ఉల్లంఘించిందని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు పక్కా ఆధారాలతో నివేదికలు రూపొందించాయి. సుప్రీం కోర్టు ఈ నివేదికలను పరిగణనలోకి తీసుకొంటే ఎన్జీటీ విధించిన పెనాల్టీ అంశంపైనే తొలి విచారణ జరగనుంది. గుంటూరుకు చెందిన నాగేంద్రకుమార్ కూడా ఇదే అంశంపై మరో పిటిషన్ దాఖలు చేశారు.

**అధికార దుర్వినియోగం**

ఏపీ ఇసుక దోపిడీపై గతంలోనే సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అయినప్పటికీ నేతల లెక్కలేనితనం, అధికారం యంత్రాంగం తోడ్పాటు వల్ల ఈ దోపిడీ యథేచ్ఛగా సాగుతూనే వచ్చింది. వైసీపీ పాలన పగ్గాలు చేతిలోకి తీసుకున్నప్పటి నుంచి యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసింది. స్వలాభం కోసం అధికారులు చాలామంది అధికారపార్టీ చెప్పినట్లు చేస్తూ ఆ పార్టీ కార్యకర్తల కన్నా ఎక్కువగా పనిచేశారు. ఇసుక అక్రమ రవాణాను కనిపెట్టలేకపోయారంటే రాష్ట్ర గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోలది ఘోర వైఫల్యం అనేకన్నా వారికి అన్నీ తెలుసనీ కాని పట్టించుకోలేదని విమర్శలొస్తున్నాయి. 26 జిల్లాలకు గాను 25 జిల్లాల కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకాలు జరగడం లేదని కూడబలుక్కొని ఒకే మాట మీద నిలబడటం, మూకుమ్మడి అబద్ధం చెప్పడమేనని బ్యూరోక్రసీ అవినీతికి ఇది పరాకాష్ఠగా పార్టీలు ఆరోపిస్తున్నాయి. కలెక్టర్లంతా ఒకే ఫార్మాట్లో నివేదికలు సమర్పించడం ఎన్‌జీటీని దిగ్భ్రాంతి పరిచింది. కలెక్టర్లు అక్రమ రీచ్‌లు వదిలేసి ఉత్తుత్తి రేవులకు వెళ్లి పరిశీలించి చేతులు దులుపుకున్నట్లు ఎన్‌జీటీకి స్పష్టంగా అర్థమైపోయిందని తెలుస్తోంది. ఎన్నికల ముందు వైసీపీ ఆ పరిణామం ప్రభావాన్ని చూపనుందని అంటున్నారు. ★

14

# రామరాజ్యం : ధర్మరాజ్యం




ఎన్ని శతాబ్దాలు గడిచిపోయినా శ్రీరామ చంద్రుడు భారతీయులకు ఈ నాటికీ స్ఫూర్తి ప్రదాతే; ఆదర్శమూర్తే. ఆయన నామస్మరణ మాత్రం తో బాధలన్నీ తొలగిపోగలవని మనం విశ్వ సిస్తున్నాం.

శ్రీరాముని వ్యక్తిత్వం పరిపూర్ణమైనది. వ్యక్తిగతంగాను, సామాజికంగాను ఆయన శీలం జాతి మొత్తానికి ఆదర్శంగా వెలుగొందుతోంది. మానవుడుగా అవతరించి, మానవుడుగా జీవించి సమస్త జనులకు మానవత్వ స్వరూపాన్ని చూపించారు. పితృవాక్య పరిపాలన మొదలు ఆయన ఆచరించిన ప్రతి వ్రతమూ మానవులందరికి ఒక మహోన్నతాదర్శంగా దీపిస్తోంది.

సామాజికంగా ఆయన అవలంబించిన ధర్మం నాటికే కాదు. యుగాల తర్వాత కూడా మానవాళికి ఆదర్శ శిఖరంగానే ఉంటుంది. రాజ్యం ప్రజలది – తాను ప్రజల ప్రతినిధి. తన పరిపాలనలో ప్రతి క్షణంలోనూ దీనిని రుజువు చేస్తూ వచ్చారు. సింహాసనం అధిష్టించే ముందు ప్రజల అంగీకారాన్ని పొందారు. సింహాసనాన్ని విడనాడేటప్పుడు సైతం ప్రజల అనుజ్ఞకోసం అభ్యర్థించారు. ప్రజా సౌఖ్యానికి తన సర్వాస్వాన్ని ధారపోసేందుకు సదా సిద్ధంగా ఉండే మహనీయుడు రామచంద్రుడు.

**స్నేహం దయాంచ సౌఖ్యంచ**
**యది వా జానకీ మపి**
**ఆరాధనాయ లోకస్య**
**ముంచతే నాస్తి మే వ్యథా॥**

'స్నేహాన్ని, దయను, సౌఖ్యాన్ని, అవసరమైతే జానకిని సైతం ప్రజా సౌఖ్యానికై త్యజిస్తా' నని చాటిన మహనీయుడు, త్యాగశీలుడు, ప్రజాస్వామ్యవాది ఇంకెవరుంటారు? సువర్ణమయమైన లంక తన స్వాధీనమయి, సామ్రాజ్య లక్ష్మి స్వయంగా తన పాదాక్రాంతమై ఉన్న సమయంలో 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అంటూ స్వస్థానానికి బయల్దేరిన రామచంద్రుని మించిన దేశభక్తు లెవరుంటారు? రాక్షస శక్తులు ప్రబలిపోయి, ప్రకృతి శక్తులన్నీ వాటిముందు మోకరిల్ల వలసి వచ్చిన విపత్సమయంలో, మానవత్వాన్నైనా సరిగా పొందని (వా)నరులను సమీకరించి లోకంలో శాంతి నెలకొల్పిన వాని కన్నా భౌతిక, ఆధ్యాత్మిక శక్తి సంపన్నుడెవంటారు? ఇవన్నీ గుర్తించారు కనుకనే గాంధీజీ, భ్రష్టమైపోతున్న మనజాతికి 'రామనామ' మంత్రాన్ని సూచించారు. 'రామరాజ్య' ఆదర్శాన్ని ముందుంచారు.

రాముని పాలనకు కాదు జీవితానికి గీటు రాయి ధర్మం. ధర్మానికి సమస్త జనులూ తల యొగ్గ వలసిందే. ధర్మమే సమాజ ప్రాతిపదిక. స్వభావతః రాముడు అహింసావాదే కాని, ధర్మహానికలిగే సందర్భంలో దుష్టశిక్షణకు వెనుకాడ లేదు. స్వయంగా సర్వశక్తిమంతుడే అయినా తన పరిపాలనకు అడ్డు రాగలవారెవరూ లేకపోయినా, ధర్మ నిర్దేశకుడుగా వసిష్ఠుని గురుస్థానంలో ఉంచుకున్నారు. ధర్మానికి ముందు ఎట్టి రాగ ద్వేషాలకు గాని, ఏ వ్యక్తికీ ఎట్టి ప్రత్యేకతలకుగాని అవకాశం లేదు. ధర్మందృష్ట్యా ప్రజలందరూ– వారేమతానికి, కులానికి, వర్ణానికి, శాఖకు చెందినవారైనా సరే అందరూ సమానులే. 'యథారాజా తథాప్రజా' అన్నట్లు ప్రజలూ రాముని అడుగుజాడల్లో ధర్మపథాన్నే స్వీకరించారు. ప్రజలు, పాలకుడు అన్యోన్యానురాగంతో సంచరించారు. నాడు దేశంలో విలసిల్లిన ఆధ్యాత్మిక శక్తి సంపదవల్ల ఈతిబాధలు సైతం వీరి దరి చేరలేకపోయాయి.

శతాబ్దాలు గడిచాయి. తరాలు మారాయి. ప్రజల్లో నైతిక విలువలే మరుగున పడుతున్నాయి. ఆధ్యాత్మిక చింతన అడుగంటి పోతోంది. భౌతిక భోగలాలసతో ప్రపంచం అధోగతి పాలవుతోంది. నాయకులు ధర్మంయెడ అంధులుగా సంచరిస్తున్నారు. రాక్షస శక్తులు పైశాచికనృత్యం ప్రారంభించాయి. నాయకులు ధర్మంయెడ అంధులుగా సంచరిస్తున్నారు. ఫలితంగా మానవాళిఫలితంగా మానవాళి యావత్తూ పరిష్కరించలేని సమస్య లుత్పన్నమవుతున్నాయి. శ్రీరామచంద్ర స్ఫూర్తితో వాటిని అధిగమించేందుకు నడుం కట్టాలి.

– సంపాదకీయం

'జాగృతి' 09-04-1954 సంచిక నుంచి

ఆధ్యాత్మికం

నవ చిరంజీవులు

## సద్గుణాలు సరే... 'అహం'మాట...?



పరమ భాగవతోత్తముడు ప్రహ్లాదుడి మనవడు విరేచనుడి కుమారుడు బలి, ఉత్తముడు, సత్యసంధుడు, అమిత శౌర్యపరాక్రమశాలి. ఆయన పాలన సుభిక్షమైనదని, అన్ని వర్గాల వారు సుఖశాంతులతో జీవించేవారని భాగవతం చెబుతోంది. ఇచ్చిన మాట తప్పడు. తాత ప్రహ్లాదుడి విష్ణుభక్తి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నప్పటికీ సాత్వికాహంకారం వీడలేకపోయాడు. త్రిలోకాధిపత్యం కోసం ఇంద్రునితో పోరాడి పరాజయం పాలయ్యాడు. కులగురువు శుక్రాచార్యుడి సూచనతో విశ్వజిత్ యాగం నిర్వహించాడు. హోమకుండం నుంచి గుర్రాలు పూన్చిన బంగారు రథం, దివ్య ధనుస్సు, అక్షయమనే అమ్ములపొది, దివ్య కవచం వచ్చాయి. బ్రహ్మ వాడిపోవని పూలహారం బహూకరించాడు. శుక్రాచార్యుడు శంఖాన్నివ్వగా వాటి సహాయంతో, యాగబలం, ఫలంతో ఇంద్రునిపై దండెత్తాడు. ఆయన ధాటికి తట్టుకోలేని ఇంద్రుడు, గురువు బృహస్పతిని కలిశాడు. 'ఈ పరిస్థితుల్లో బలిని ఎదుర్కోవడం అసాధ్యం. అతను ప్రస్తుతం శక్తి సంపన్నుడు. భృగువంశం బ్రాహ్మణులు క్రతువుల ద్వారా ఈ బలసంపదను సమకూర్చారు. ఆయనను హరిహరులు తప్ప ఇతరులు ఎదుర్కొనలేదు. అనువైన సమయం కోసం నిరీక్షించడమే ప్రస్తుత కర్తవ్యం' అని హితవు పలకడంతో ఇంద్రుడు, ఇతర దేవతా ముఖ్యులు మారురూపాలతో అజ్ఞాతంలోకి వెళ్లారు.

# నేటి కాలానికి భారత సందేశం

14




మహాభారతం విశ్వవిజ్ఞాన కోశమని చెప్పదగిన మహా కావ్యము. అందులో చెప్పని విషయమేదియు లేదనేందుకు 'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తిన తత్క్వచిత్త' అనే వ్యాసవాక్యమే తార్కాణము. మహాభారతమును ఆంధ్రీకరింప మొదలిడిన వారిలో ప్రథముడును, ఆంధ్రమునకు ఆదికవి నన్నయ భారతమును 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్ర మనియు ఆధ్యాత్మవిదులు వేదాంతమనియు, నీతి విచక్షణులు నీతిశాస్త్రమనియు, కవిపుంగవులు మహాకావ్యమనియు, లాక్షణికులు బహులక్ష్య సంగ్రహమనియు, పౌరాణికులు బహుపురాణ సముచ్చయమనియు, ఇతిహాసికులు ఇహాసమనియు భావించునట్లుగను, విశ్వజనీనమై వెలుగొందునట్లు వరగుచుండునట్లగను వ్యాన మహర్షి రచించియుండెను'అని ఆది పర్వారంభంలో తెలిపారు. అట్లే తిక్కన సోమయాజియు, వ్యాసుడు ధర్మాద్వైతస్థితితో ధార వాఖ్యమైన, లేఖ్యమైన ఆమ్నాయమును రచించెదనని విరాటపర్వాదిలో ని తెలిపారు. భారతసందేశం విశ్వజనీనం, సార్వకాలికమని, ధర్మ ప్రధామనియు, సర్వజనోద్దిష్టమని వ్యక్తమవుచున్నది.

భారతమునందలి కథ సర్వవిది తమైనట్టిది. స్థూలముగా చూచినచో అది కౌరవ పాండవులకు, కురు క్షేత్రసంగ్రామానికి సంబంధించినదిగా కనిపించును. పాండవులు ధర్మమునకును, కౌరవులు అధర్మమునకును ప్రతీకలు. వారికి జరిగిన యుద్ధమును ధర్మా ధర్మములకు జరిగిన యుద్ధముగా భావింపవచ్చును. మానవుల నిత్యజీవితమున కూడ ధర్మాధర్మాలకు సంఘర్షణము 'జరుగుతుంటుంది. అధర్మము తాత్కాలికముగా అభ్యుదయం పొందినట్లు కనిపించినప్పటికీ చివరికి వినాశము పొందితీరును.

ఉద్యోగ పర్వ ప్రథమాశ్వాసంలో శ్రీకృష్ణుడు సంజయునితో 'ధర్మజుండు ధర్మతరు వర్జునుడు ఘన
**స్కంద మనిల సుతుడు శాఖ, కవల**
**పుష్పఫలము లేను భూసురులును**
**వేదములు, దదీయమై సమూలవయము**
**రోషమయ మహాతరువు సుయోధను**
**దురు స్కంద మందులోన కర్ణుడలరు**
**గొమ్మ సౌబలుండు, కుసుము ఫలములు**
**దుశ్శాసనుండు, మూల శక్తి తండ్రి'** అని తలిపెను. ధర్మ జయమును అధర్మ పరాజయమును మహాభారత ఇచ్చే ప్రధాన సందేశము. అధర్మము వృద్ధిచెందుతున్నట్లు కనిపించి పతనము ప్రాప్తిం చును ధర్మము వ్యయప్రయాసలతో కూడి ఉన్నప్పటికీ వరకు జయము పొందును. మానవులు లోకంలో అనేక కార్యములు ఆచరిస్తారు. అందులో మంచివి చెడ్డవి కూడ ఉంటాయి. కొందరు అవివేకముతో మంచి యేదో చెడుయేదో యెరుగలేక చెడు చేస్తుంటారు. మరికొందరు యుక్తాయుక్త జ్ఞానం కలిగి చేస్తున్న పని చెడు అని తెలిసి కూడా దానిని చేస్తుంటారు.. అంతఃకరణ ప్రవృత్తి, వారు చేస్తున్న పని చెడ్డదని లోపల బోధిస్తునే ఉంటుంది. అయినను వారు దానిని లెక్క చేయక తమ ఇష్టమును అనుసరించి తాత్కాలిక లాభం కోసం అయుక్త కార్యాన్నే ఆయరిస్తారు. అలాంటి వారు తాత్కాలికముగా కొంత లాభము పొందినను, చివరికి ఆ కార్యాచరణ ఫలితం హాని పొంది తీరుతారు. . దీనికి దురహంకార దురభిమానాలు హేతువులు. దుర్యోధను అటువంటి అహంకార దురభిమా నములకు వశుడై పతనమయ్యాడు. లోకంలో ధర్మాధర్మాలు జరుగుతుంటాయి. ప్రస్తుతం అధర్మము ఎక్కువగా కనిపించుచున్నది. దానిని అరికట్టే శక్తి అందరికి ఉండదు. కొందరే అందుకు దక్షులై ఉంటారు. అయినను వారు మనకెందుకని అధర్మాన్ని అరికట్టుటకు యత్నించరు. దానికి హేతువులు అనేకములు ఉండవచ్చును. అట్లు అధర్మనిరోధ దక్షులయినప్పటికి ఉపేక్ష వహించు వారికి చేటు కలుగుతుంది. దృతరాష్ట్రుడు శాసకుడయిన రాజు. అధర్మము ఏదైన జరుగు తున్నప్పుడు నివారించు అధికారము అతనికున్నది. భీష్మ ద్రోణ విదురాదులు ధర్మజ్ఞులు అయినప్పటికి వారికి శాసించు అధికారము లేదు. వారు చెప్పినను దుర్యోధనుడు ఆ మాటలు పెడచెవిన పెట్టవచ్చును. ద్యూత,ద్రౌపది వస్త్రాపహరణ,ఘోషయాత్ర సందర్భాలలో దృతరాష్ట్రుడు శాసనాధికారము కలిగి ఉన్నప్పటికి పుత్ర ప్రేమతో అధర్మాన్ని నివారించక ఉపేక్ష వహించాడు. **శ్రీ దివాకర్ల వేంకటావధాని**

**'జాగృతి' 04.07.1981 సంచిక నుంచి**

అలా అనాయాస విజయంతో బలి ముల్లోకాధి పతి అయ్యాడు. ఆయనతో శుక్రాచార్యులు నూరు అశ్వమేధ యాగాలు చేయించాడు. 'సద్గుణం మాత్రమే రాజ్యపాలన చేస్తుంది' అన్న తాత ప్రహ్లాదుడి మాటలను ఆదర్శంగా తీసుకున్నాడు. ఆ దానవోత్త ముడి పాలన సుభిక్షంగా సాగుతూ ప్రజలు సంతృప్తులై ఉన్నా, 'నేను 'అనే దానిని జయించలేకపోయాడు. దానవులు దేవతల కంటే మహా బలవంతులని ఆయన విశ్వాసం. అదే మాటను తాత ప్రహ్లాదుని వద్ద ప్రస్తావించగా, అందుకు ఆగ్రహించిన ఆయన 'నీ రాజ్యం నశించుగాక' అని శపిస్తాడు. పశ్చాత్తాపం చెందిన మనవడితో 'శ్రీమహావిష్ణువువ వల్ల ముక్తి కలుగుతుంది' అని చెబుతాడు. అటు, దేవమాత అదితి , తన సంతతి దేవతలకు కలిగిన దుస్థితికి కలత చెందింది. బలిని కట్టడి చేయడానికి విష్ణువును ప్రసన్నం చేసుకోవాలన్న భర్త కశ్యప ప్రజాపతి సూచనపై 'పయోభక్షణం' అనే వ్రతం చేపట్టింది. శ్రీహరి ప్రసన్నుడై ఆమె కుమారుడిగా (వామనుడు) జన్మించాడు. ఉపనయనం తరువాత, నర్మద నదీ తీరంలోని 'భృగుకచ్ఛం' వద్ద బలి అశ్వమేధ యాగం చేస్తున్న ప్రదేశానికి చేరి 'స్వస్తి జగత్రయా భువన శాసనకర్తకు...' ('ముల్లోకాలను శాసించగల నీకు మంగళం') అని ఆశీర్వదించాడు. దివ్యతేజస్సుతో వెలగొందుతున్న బాలుని చూచిన బలి 'ఆ సుందర వామనుడు మారువేషంలో వెలుగొందె త్రిమూర్తులలో ఒకరో, సూర్యుడో, అగ్నియో కాదుకదా! అని విస్తు పోయాడు. ఆతనిని సాదరంగా ఆహ్వానించి, ధర్మపత్ని వింధ్యావళి బంగారు కలశంతో తెచ్చిన నీటితో పాదాలు కడిగి, ఆ నీటిని శిరస్సున జల్లుకున్నాడు. **–రామచంద్ర రామానుజ**

## వివేకానంద సూక్తిశతి

**Stand up and fight ! Not one step back, that is the idea. Fight it out, whatever comes.**
**Death means olny a change of garment. What of it? thus fight!**

**లెండి మీరు వేగ లేచి పోరాడండి**
**వెనుకకడుగు మీరు వేయరాదు**
**మరణమన్న వలువ మార్పేగదా లెండి**
**వినుడి స్వామి సద్వివేకవాణి!!**





బండిరాజుల శంకర్

# జిజియా విధించడానికి కన్నడ కాంగ్రెస్ తహ తహ



**ఇది ఔరంగజేబ్, ఇతర ముస్లిం పాలకులు మధ్యయుగాలలో విధించిన జిజియా పన్నుకు ఏమాత్రం తక్కువ కాదు. హిందు వ్యతిరేకతను బహిరంగంగానే ప్రదర్శిస్తున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం హిందూ ఆలయాలపై పన్నులు విధించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హిందూ ఆలయాల మీద మాత్రమే పన్ను వేయడం లౌకికవాదానికి, సమానత్వానికి పూర్తి విరుద్ధం. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు బీజేపీ వ్యతిరేకతతో తోక ముడిచినా, కాంగ్రెస్ పార్టీ మొండిగా సమర్థించుకుంటూ, మరోసారి చూస్తామని నిస్సిగ్గుగా ప్రకటించింది. కర్ణాటకలో టిప్పుకు ప్రాణప్రతిష్ఠ చేశారని అనిపిస్తుంది. హిందువుల ఓట్లతోనే నెగ్గినా, వారి హక్కులు, మనోభావాలు కాంగ్రెస్ పార్టీకి పూచికపుల్లలతో సమానం. హిందూ ఆలయాల మీద పన్ను ప్రతిపాదన ఇందుకు తాజా ఉదాహరణ.**

మైనారిటీలను బుజ్జగించడానికి హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. ప్రభుత్వం చేపట్టిన ఏ పథకాలు, కార్యక్రమాలైనా తొలి ప్రయోజనం ముస్లింలకే అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నిస్సిగ్గుగా ప్రకటించారు. వాస్తవానికి ఈ విధానాలు నెహ్రూ, ఇందిర కాలం నుంచి ఉన్నాయి. ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించినా, ఈ విధానాన్ని మార్చుకోలేదు.

ఫిబ్రవరి 16న కర్ణాటక ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ని ప్రవేశపెట్టింది. అందులో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధి కోసం రూ.100కోట్లు, క్రైస్తవుల సంక్షేమం కోసం రూ. 200 కోట్లు కేటాయించింది. సిక్కులు, జైన్, మొదలైన ఇతర మైనారిటీ వర్గాలకు కేటాయింపులు చేసింది. హిందువుల సంక్షేమం ప్రస్థావనే లేదు.

గ్యారెంటీల పేరుతో గద్దెనెక్కిన కన్నడ కాంగ్రెస్ దగ్గర వీటిని అమలు చేయడానికి తగిన నిధులు లేవు. అందుకే రకరకాల పన్నులను వేయాలని నిర్ణయించుకుంది. హిందూ వ్యతిరేకతను నరనరానా జీర్ణించుకున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మైనారిటీల మెప్పు పొందడానికి మరో ఘనకార్యం చేశారు. వారి కన్ను హైందవ ధార్మిక క్షేత్రాల మీద పడింది.

**హిందూ వ్యతిరేక పన్ను**

కర్ణాటక అసెంబ్లీ దేవాలయాలపై పన్ను విధించే బిల్లు 'హిందూ మత సంస్థలు&ధర్మాదాయ (సవరణ) బిల్లు– 2024'ను ఆమోదించింది. దీని ప్రకారం రూ. కోటి కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉన్న దేవాలయాలు తమ ఆదాయంలో 10 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. రూ.10 లక్షల నుంచి రూ. కోటి వరకూ ఆదాయం ఉన్న ఆలయాల నుంచి 5 శాతం తీసుకుంటుంది. ఈ నిధిని 'ధార్మిక పరిషత్' పేరుతో వసూలు చేస్తుంది. ఈ నిధులను చిన్న దేవాలయాలతో పాటు 'ఇతర' పనులు చేపడతామంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం

ఈ బిల్లులో రెండు ప్రమాదకర క్లాజులు ఉన్నాయి. సెక్షన్ 19ఏ ప్రకారం ఇలా వసూలు చేసిన పన్నును ప్రజోపయోగపనులకు ఉపయోగిస్తారు. అయితే ఆ పనులు ఏమిటి అన్నది మాత్రం చెప్పలేదు. సెక్షన్ 25 ఇంకా ప్రమాదం. దీని ప్రకారం హిందూ మతానికి చెందని వ్యక్తులు కూడా దేవాదాయ శాఖలో ఉద్యోగులుగా చేరొచ్చు. హిందు ఆలయాలపై మాత్రమే పన్ను విధిస్తూ, ఇతర మతాల ప్రార్థనాలయాలను మినహాయించడం వివాదాస్పదంగా మారింది. అదీ కాక బిల్లులోని క్లాజుల ప్రకారమే దేవాలయాల దగ్గర వసూలు చేసిన పన్నును ప్రభుత్వం ఏ విధంగా అయినా ఉపయోగించుకునే అవకాశం ఉంది. పథకాలకు మళ్లించే అవకాశం లేకపోలేదు.

ఈ నిధులను ధార్మిక పరిషత్ ప్రయోజనాల కోసం, ఆర్థికంగా వెనుకబడిన అర్చకుల సంక్షేమం, వారి పిల్లలకు విద్యా సౌకర్యం, చిన్న దేవాలయాల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా బిల్లులో మాత్రం ఆ మాటలు చేర్చలేదు. సెక్షన్ 19ఏ క్లాజ్ ప్రకారం వసూలు చేస్తే ఆ ధనాన్ని ముస్లింలు, క్రైస్తవుల సంక్షేమ కార్యక్రమాలకు, స్కాలర్‌షిప్‌లు ప్రార్థనాలయాలకు, షాదీఖానాలు, మదరసాలు, చర్చి గోడల నిర్మాణాలకు కూడా ఉపయోగించే అవకాశం ఉంది. సెక్షన్ 25 ప్రకారం హైందవేతరులను ఆలయాల్లో ఉద్యోగులుగా, అధికారులుగా నియమిస్తే వారి నుంచి ఏ విధమైన ధార్మిక విధులను ఆశించగలం? ఫిబ్రవరి 19న ప్రభుత్వం కర్ణాటక శాసనసభలో ఈ బిల్లు ప్రవేశపెడితే 22న ఆమోదం పొందింది. అసెంబ్లీలో మొత్తం 224 సభ్యులు ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు 135 సభ్యుల సంఖ్యాబలం ఉంది. స్పష్టమైన మెజారిటీ ఉన్నందున తేలికగానే నెగ్గింది. అయితే శాసనసమండలి (కౌన్సిల్)కు ఈ బిల్లు రాగానే పరిస్థితి తారుమారయింది. మొత్తం కౌన్సిల్‌లో 75 సభ్యులు ఉంటే కాంగ్రెస్ సభ్యులు 30 మంది మాత్రమే.. బీజేపీకి 34 మంది, జేడీఎస్ 8 మంది, ఒక ఇండిపెండెంట్ ఉన్నారు. వీరంతా వ్యతిరేకించడంతో ప్రభుత్వ వెనక్కి తగ్గక తప్పలేదు. కానీ ఏ విధంగానైనా పంతం నెగ్గించుకోవాలని పట్టుదలతో ఉంది.

ఈ బిల్లును బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. హిందూ వ్యతిరేక విధానాలను అవలంబించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఖజానా నింపుకోవాలని చూస్తోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బిఎస్ విజయేంద్ర విమర్శించారు. హిందూ దేవాలయాల మీదనే ఈ పన్ను ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఈ బిల్లు ద్వారా కాంగ్రెస్‌పార్టీ కొత్తగా తన దిగజారుడుతనాన్ని బయట పెట్టుకున్నదని కేంద్ర మంత్రి, బీజేపీ నాయకుడు రాజీవ్ చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ దిగజారుడు తనానికి ఈ బిల్లు మచ్చుతునక అని పేర్కొన్నారు. ఏమైనా ఈ బిల్లు న్యాయ సంబంధ సమస్యలు కూడా ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. మత స్వాతంత్ర్యానికి భంగం కలిగిస్తుందనే విమర్శలు



చెలరేగుతున్నాయి. మరోవంక, కర్ణాటకలో విశేష ప్రాబల్యంగల ధార్మిక సంస్థలు, పీఠాలతో ప్రభుత్వ సంబంధాలు సహితం దెబ్బతినేందుకు దారితీయ వచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.

**కరసేవక్ పూజారి అరెస్టు**

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే ఈ హిందూ వ్యతిరేక ధోరణిని మొదలు పెట్టింది. హిందుత్వం అంటేనే ఉలిక్కి పడుతోంది. దేశమంతా అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ సందడిలో ఉండగా, కర్ణాటక ప్రభుత్వం కరసేవలను గుర్తించి హింసించడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా హుబ్బళి-ధార్వాడ్ పోలీసులు శ్రీకాంత్ పూజారి అనే కరసేవకుడిని అరెస్టు చేశారు. 1992 నుండి పరారీలో ఉన్నాడని, ఇప్పుడు దొరికినందున అరెస్టు చేశామని ఆయనపై అభియోగం. గత 31ఏళ్లలో పూజారిపై 16 కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి శ్రీకాంత్ పూజారి అదే నగరంలో గత 31 ఏళ్లుగా ఉంటూ, బహిరంగంగానే తిరుగుతున్నారు. పైగా ఆ పూజారి పూర్వికుల ఇంట్లో నివాసం ఉంటూ జీవనోపాధి కోసం ఆటో నడుపుతున్నాడు. 2004, 2009, 2018లో పూజారికి పోలీసులు సమన్స్ పంపారని చెబుతున్నారు. మరి అప్పుడే ఎందుకు అరెస్టు చేయలేదు అని ప్రశ్నిస్తే ప్రభుత్వం దగ్గర సరైన సమాధానం లేదు. బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం 1992లో హుబ్లీలో జరిగిన హింసా కాండలో ఆయన ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని, ఈ అరెస్టు ప్రతీకార చర్య కాదని ముఖ్య మంత్రి సమర్ధించుకున్నారు. కర్ణాటక బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా ఇందుకు నిరసనలు చేపట్టింది. బీజేపీ ఎమ్మెల్యే వి.సునీల్‌కుమార్ తాను కూడా కరసేవకుడినే, తనను అరెస్ట్ చేయండంటూ ప్లకార్డు పట్టుకొని నిరసన వ్యక్తం చేయడంతో ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు.

**కాషాయ పతాక వివాదం**

మాండ్యా జిల్లాలోని కేరగోడు గ్రామంలో 108 అడుగుల ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. దానికి హను మంతుని రూపం ఉన్న కాషాయ ధ్వజం ఎగుర వేశారు. ఈ జెండా ఏర్పాటులో చుట్టుపక్కల ఉన్న 10కి పైగా గ్రామాల ప్రజలు భాగస్తులయ్యారు. పోలీసులు వచ్చి దాన్ని దించేశారు. ఈ ఘటనపై అక్కడి గ్రామాల ప్రజలంతా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తంచేశారు. ఇక్కడ జాతీయ పతాకం ఏర్పాటు కోసం అనుమతి తీసుకొని కాషాయ జెండా ఎగురవేశారు అని ప్రభుత్వం వాదన. అయితే 15 ఆగస్టు, 26 జనవరి సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఆ తర్వాత కాషాయ ధ్వజంకోసం ఉపయోగించుకుంటామని ప్రజలు స్పష్టం చేశారు. బీజేపీ, బజ్రంగ్ దళ్, హిందుత్వవాదులు కాషాయ జెండాలు ఎగురవేసి మతపరమైన ఉద్రిక్తతలు రేపుతున్నారని, దీన్ని అనుమతించబోనని సీఎం సిద్ధరామయ్య హుంకరించారు. కానీ బెంగళూరు, మైసూరు సహా అనేక నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పెద్ద ఎత్తున ఆకుపచ్చ జెండాలు ఎగురుతున్నాయి.

**బజ్రంగ్ దళ్‌ను నిషేధిస్తారట**

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో బజ్రంగ్‌దళ్‌ను నిషేధిత ఇస్లామిక్ సంస్థ పీఎఫ్ఐతో కలిపి నిషేధిస్తామని ప్రకటించింది. బీజేపీ ఈ ప్రకటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాని మోదీ తన ప్రచార సభలో బజరంగ్ భలీని నిషేధిస్తారా అంటూ దుమ్మెత్తి పోశారు. ఆయన పాల్గొన్న బహిరంగ సభల్లో ప్రజలచేత బజరంగ్‌దళ్ నినాదాలు చేయించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఉలిక్కిపడింది. అలాంటిది తమ పార్టీ మేనిఫెస్టోలో లేదంటూ కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి వీరప్ప మొయిలీ వివరణ ఇచ్చు కున్నారు. కర్ణాటక కాంగ్రెస్ నాటి అధ్యక్షుడు డీకే శివకుమార్ హనుమాన్ ఆలయాలను సందర్శించి నష్ట నివారణ చర్యలు చేపట్టారు

**టిప్పు వివాదం**

బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో నిలిపివేసిన టిప్పు జయంతి ఉత్సవాలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సిద్ధరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తిరిగి నెత్తికెక్కించుకుంది. మైసూరు లేదా శ్రీరంగపట్నంలో 100 అడుగుల టిప్పు విగ్రహాన్ని ప్రతిష్టించే యోచన ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్వీర్ సైత్ చేసిన ప్రకటన కలకలం రేపింది. నిజంగా విగ్రహం పెడితే బాబ్రీ మసీదులా కూల్చివేస్తామని శ్రీరామ్‌సేన అధినేత ప్రమోద్ ముతాలిక్ హెచ్చ రించారు. బెంగళూరు నగర నిర్మాత కెంపెగౌడ పేరు మీద ఉన్న విమానాశ్రయం పేరును టిప్పుసుల్తాన్ విమానాశ్రయంగా మార్చాలని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం కూడా వివాదాస్పమైంది.

**ఆలయాలపై పెత్తనం ఎందుకు?**

దేశంలో అత్యధిక ఆలయాలు ఉన్న రాష్ట్రాల్లో కర్ణాటకది నాలుగో స్థానం. రాష్ట్ర వ్యాప్తంగా 34,563 ఆలయాలు ఉన్నాయి. వీటిలో ఏడాదికి రూ.25 లక్షల కన్నా అధిక ఆదాయం ఉన్న ఆలయాలు 205 మాత్రమే. ఇక రూ.10 లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయాలు 139. 34,219 ఆలయాల ఆదాయం ఏడాదికి రూ. 5 లక్షల లోపు మాత్రమే. ఆలయాల్లో అర్చకులు, ఉద్యోగులు జీతభత్యాలు, నిత్య ధూపదీప నైవేద్యాలు, నిర్వహణ చిన్న ఆలయాలకు భారంగా మారుతోంది. ఇతర మతాల వారి ప్రార్ధనా స్థలాల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు. హిందూ దేవాలయాలపై మాత్రమే ప్రభుత్వం పెత్తనం చేస్తుంది. హిందూ దేవాలయాలకు వచ్చిన విరాళాలపై ప్రభుత్వానికి ఆదాయ పన్ను కట్టవలసి ఉంది. దేవాలయ ఆర్థిక వనరులపై ప్రభుత్వ పెత్తనం ఉంది.

మైనారిటీల ప్రార్ధనా స్థలాల నిర్వహణలో వారికే పూర్తి అధికారాలున్నాయి. అవి ఎలాంటి పన్నులు చెల్లించనవసరం లేదు. వారు నిర్వహిస్తున్న విద్యా సంస్థలు, ఇతర సంస్థలపైన ప్రభుత్వ పెత్తనం పరిమితమే. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే హిందూ ఆలయాల ద్వారా వచ్చిన ధనాన్ని ఇతర మత సంస్థల నిర్వహణ కోసం ఖర్చుపెడుతున్నారు. కర్ణాటకలో దేవాలయాల నుంచి వచ్చే నిధులను మదర్సాల నిర్వహణకు, క్రైస్తవ చర్చిల నిర్వహణకు, హజ్‌యాత్రికుల ప్రయాణ సబ్సిడీలకు ఖర్చు పెడ్తున్నారు. ఒక్క కర్ణాటకలో మాత్రమే కాదు. హిందూ ఆలయాలపై రాజకీయ పెత్తనానికి వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



ఈ బిల్లును బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. హిందూ వ్యతిరేక విధానాలను అవలంబించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఖజానా నింపుకోవాలని చూస్తోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బిఎస్ విజయేంద్ర విమర్శించారు. హిందూ దేవాలయాల మీదనే ఈ పన్ను ఎందుకని ఆయన ప్రశ్నించారు.

# స్వరవాహి

'కలిమికి కాణాచి నీ పుట్టినిల్లు
చెలిమికి మాగాణి నువు మెట్టినిల్లు
కలలన్నీ నిజమౌ నీ కాపురానా
కలకాలం వెలుగు నీ ఇంటి దీపము!'

ఈ పాట ఎక్కడో విన్నట్లుందా? ముందు పంక్తులు గుర్తుకొస్తే, మనకు మరింత బాగా అర్థమవుతుంది. అవి ఇవి :

'కొత్త పెళ్ళికూతురా రారా!
నీ కుడికాలు ముందుమోపి రారా!
గుణవతి, కులసతి రారా
నువు కోరుకున్న కోవెలకు రారా!'.... దశాబ్దాల నాటి గీతం. ప్రధాన గాయని స్వర్ణలత, సంగీత, నాట్య రంగాల మేటి. ప్రత్యేకించి ఇరవై ఏళ్లపాటు ఆమె పాటలు ఊరూవాడా మారు మోగాయి. ఎంతో మార్దవం, హృద్యం, పరిణత తత్వం నిండిన స్వరం. మరింత విశిష్టత ఏమిటంటే... ఇటువంటి కుటుంబ గీతికలతోపాటు 'నవ్వుల నదిలో పువ్వులు రువ్వే..'వాటినీ ఆలాపించారీమె. .కాలక్రమంలో తనూ దీటుగా నిలిచి, శోభాయమానత కనబరచి, సాక్షాత్తు 'మహాలక్ష్మి' అనిపించుకున్నారు.పేరులో మొట్టమొదటి రోజుల్లో లక్ష్మీ ఉన్నా, ఆ తర్వాత గీత సరస్వతిగా ఖ్యాతి సంపాదించారు.

అంటే గీత, సంగీత, నర్తన ప్రక్రియల్లో తనకు తానే సాటి అన్న మాట. ఇన్ని విభిన్నతలున్న స్వర్ణలత పాతికేళ్ల క్రితం ఒక సంఘటన ఫలితంగా శాశ్వతంగా వెళ్లిపోయారు. అయినా ఇప్పటికీ శ్రోతల మనోమందిరాల్లో సుస్థిరంగా వెలుగుతూనే ఉన్నారు. ఈ గాయనీ మణి ఉదయాస్తమయాలు రెండూ మార్చిలోనే. తేదీ కూడా ఒకటే మార్చి 10 కావడం కాకతాళీయమే అయినా, ఇదొక విధి వైచిత్రి!



సినీ నేపథ్య గాయిని స్వర్ణలత

కళావతి, వసంతి, యక్షిణి...ఈ పాత్రలు 'మాయారంభ'లో కనిపిస్తాయి, వినిపిస్తాయి, అనురక్తి కలిగిస్తాయి. పురాణ ప్రధాన చిత్రమిది. ఇది రమారమి 75 ఏళ్లనాటి సంగీత సందర్భం. ఇందులో 'రాత్రీ పగలనక' పాట పాడారు స్వర్ణలత. పేరుకు తగిన తీరు. ఎప్పుడు ఏ సమయంలో చిత్రీకరణ కొనసాగినా స్వర్ణాలంకార భూషితగా వచ్చేవారు. బంగారు గాజులతో, నగల అలంకరణతో వచ్చి పాడుతూ ఉంటే – ఆ ప్రదేశమంతా లక్ష్మీకళ వెల్లివిరిసేది.

సీనియర్ గాయనీమణులతో కలిసి ఆమె ఆలాపించిన గీతికల్లో ఒకటి –

విన్నావ యశోదమ్మా!
మీ చిన్నికృష్ణుడు చేసినట్టి
అల్లరి చిల్లరి పనులు!
**యశోద** : అన్నం పున్నెం ఎరుగని పాపడు
మన్నుతినే నా తనయుడు; ఏమి చేసెనమ్మా?
ఎందుకు రవ్వ చేతురమా?
**గోపికలు** : మన్ను తినేవాడా... వెన్న తినేవాడా?
**కృష్ణుడు** : కలదామ్మా ... ఇది ఎక్కడనైనా కలదామ్మా?
గోపిక రణుల కల్లలూ....
నాకేం తెలుసూ– నేనిక్క లేందే!
**యశోద** : మరి ఎక్కడున్నావూ?
**కృష్ణుడు** : కాళిందు తలపై తాండవమాడి
ఆ విష సర్పమునంతము జేసి
గోవుల చల్లగా కాచానే (ఇంతలో....)
**ద్రౌపద** : హే కృష్ణా! ముకుందా! మొర వినవా?

ఇంత సుదీర్ఘ గీతిక అంతటిలోనూ స్వర్ణలత గాత్రం విలక్షణంగా వినవస్తుంది. అందులో ఏదో ప్రత్యేకత, ఎంతెంతో విశిష్టత నిండినట్లు అనిపిస్తుంది.

ఇలా వందలకొద్దీ చిత్రాల్లో తన గానమాధుర్యం మారుమోగింది. ప్రతీ అక్షరమూ ప్రస్ఫుటంగా వినిపించేది ఆ గొంతుకలో. భావ వ్యక్తీకరణ అసాధారణంగా ఉండి, శ్రోతల హృదయాలను ఇట్టే ఆకట్టుకునేది.

ఆమె బాల్యం, అనంతర జీవనం కూడా ప్రకాశవంతంగా కొనసాగింది. కర్నూలు ప్రాంతంలోని ఊరు ఆమెది. సంగీతం అంటే తొలి నుంచే ఎక్కువ మక్కువ. నాటక ప్రదర్శనలు విరివిగా చూస్తుండేది. పురాణ సంబంధ పద్యాలు ఆలాపిస్తూ ఉండేది. కొన్నిమార్లు నాటకాల్లో నటించింది. నర్తన గురించీ ఎంతగానో అభ్యాసం చేసింది. అంతగా

# ని... 'స్వర్ణ'గాయని



జంధ్యాల శరత్‌బాబు



కళా ప్రియత్వం స్వర్ణలత సొంతమైంది.

పాటలు పాడేవారు అనేకమంది ఉంటారు. వాటిల్లో ఒక్కో ప్రక్రియలో ఒక్కొక్కరు పేరు పొందుతుంటారు. అన్ని తరహాల గీతాలూ ఆలపించాలని గాయకులుకు ఉంటుంది. కానీ సాధికారత మాత్రం కొన్నిటికే మితమవుతుంటుంది. గాత్రకచేరీలు చేసిన అనుభవం ఎంతగానో ఉన్న స్వర్ణలత ప్రథమంగా చిత్రగానం చేసింది ఒక హాస్యకళాకారుడితో! బహుశా అందుకేనేమో... హాస్యగీతికల ఆలాపన అటు తర్వాత నిరంతరాయంగా సాగుతూ వచ్చింది.

1960 ప్రాంతాల్లో ఒక పాట ఎందరెందరినో మురిపించి, మైమరపింపచేసింది. అందులోని పదాలన్నీ ఆసక్తిదాయకాలే, మళ్లీమళ్లీ వినాలని అనిపించేవే.

**డివ్వి డివ్వి డివ్విట్టం**
**నువ్వంటేనే నాకిష్టం!**
**డోడిక్కంది అదృష్టం**
**గట్టెక్కింది మన కష్టం!**
**బాజాలతో, బాకాలతో**
**పందింట్లో ఇద్దరం ఒకటవుదాం...**
**బుక్కా వసంతాలు చల్లుకుందాం**
**ఎంచక్కా తలంబ్రాలు పోసుకుందాం!**
**దీవించి వేస్తారు అక్షింతలూ**
**ఇక అవుతాయి సౌఖ్యాలు లక్షంతలు!...**

వింటున్నంతసేపూ ఆనంద తరంగాలలో ఓలలాడిస్తుందీ గీతిక. ఎంతో చలాకీగా, చురుగ్గా, చమక్కుమనేలా పాడారు. ఆ రోజుల్లోనే అత్యంత ఆధునికత వ్యక్తపరచి, శభాష్ అనిపించుకున్నారు.

ఆమెది ప్రేమ వివాహం. ఆయనది కేరళ. సంతానంలో కొందరు వైద్యవృత్తిలో స్థిరపడ్డారు. అలాగే నటుడిగా, నృత్య దర్శకుడిగా పేరు పొందినవారున్నారు. పిల్లల్లో ఒకరు గాయకురాలిగా వారసత్వ సంపద అందుకున్నారు.

పాడిన ప్రతీ పాటలనూ ఎంతో కొంత విలక్షణత ధ్వనించాలన్నదే స్వర్ణలత ధ్యేయం. అందుకు నిరంతరం పరిశ్రమించేవారు. సాధనను కఠోరంగా కొనసాగిస్తుండేవారు. శక్తి, సమయం, వనరులన్నింటినీ గానరంగం మీదనే కేంద్రీకరించారు.

**ఓ పంచవన్నెల చిలక!**
**నీకెందుకింత అలకా?**
**ఆమె :** ఓ కొంటె బావగారూ! మనకెందుకింక పోరు?

మా నాన్నగారు చూస్తే మీ దుమ్ము దులుపుతారు!... అలా, మరెంతగానో విభిన్న స్వరాన్ని అందించారు. స్వర్ణలత, ఆ పాట, పాడిన విధానం రెండూ ప్రత్యేకంగా ఉంటాయి.

బలె బలె బలె బలె హిరణ్య కశపుడరా

నిన్ను ఇరుచుక తింటారా.... అంటూ సాగుతుందీ గీతం.

సాంఘికం, జానపదం, పౌరాణికం – అన్ని చిత్రాల్లోనూ తనదైన పటిమ చాటారు ఆ గాన సరస్వతి. అనేక పాటలు ఇప్పటికీ శ్రోతల సమాదరణ పొందుతూనే ఉన్నాయి. పాటపాటకీ నైపుణ్యం పెంచుకోవడంలో అపార శ్రద్ధాసక్తులు చూపిన ప్రజ్ఞానిధి. తన తనయుల్లో ఒకరికి తన పేరే పెట్టుకున్నారు.

1950, 1959, 1963, 1965.... ఈ విధంగా అన్ని సంవత్సరాల్లోనూ తానేమిటో నిరూపించుకున్నారు. అప్పట్లోనే విదేశీ పర్యటనలు సైతం జరిపారు. ఆ పర్యటనలు తరుణంలోనే అనుకోని ఘటన! విదేశీ సందర్శన ముగించుకొని, స్వదేశానికి చేరుకుని, కార్యక్రమానికి హాజరయ్యేందుకు కారులో వెళుతూ దారిలో దుండగుల బారినపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆ రోజు మార్చి నెల పదో తేదీ... పుట్టిన, గిట్టిన రోజు ఒకటే కావడం విధి బలీయం.

మెరుపులా మెరిసిన
నిండుదనానికి ప్రతీకగా నిలిచిన
తెలుగుతేజానిన నిరూపించిన

ఆమె లేరుకానీ... ఆ పాట ఉంది. ఆ మాటా వినపిస్తోంది. జీవితాన్ని సంగీతంలో, సంగీతంతోనే గడిపిన సార్థక నామధేయురాలు.

తన పాటల్లో చమత్కారం ఉట్టిపడేది.

ఎంత గడుసుతనంమో అనిపిస్తుండేది.

తర మొత్తాన్నీ ఉత్తేజితం చేసిన గాత్రశక్తి.

అసాధారణ వ్యక్తి, ఆమెదొక ప్రత్యేక రీతి. తెలుగుతోపాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ పాటలెన్నింటిన రక్తికట్టించిన గాత్ర సంపద ఆమెది. తలచుకున్న ప్రతీసారీ వెన్నెల చల్లదనం మన గుండెల నిండా నిండుతుంది.

విధి విసిరిన కరవాలం ఎంత పనిచేసిందీ? అనుకున్నప్పుడు విషాదం నిలువెల్లా ఆవహిస్తుంది. వినోద విషాదాల కలనేత తన జీవితం. అయినా కళారంగాన స్వర్ణలత స్థానం శాశ్వతం, నిరంతర స్మరణీయం.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**



మాఘ బహుళ ఏకాదశి (మార్చి 6) గురూజీ జయంతి

# యుగపురుషుడు



ఒకనాడు దేశంలో ఒక మహా విపత్కర పరిస్థితి ఏర్పడింది. హిందువులు సామాజిక ఏకత్వాన్ని మరచిపోయి వికృత మత సిద్ధాంతాలలో మునిగిపోయి, స్వార్థానికి, లౌకిక భోగాలకు దాసులై జీవితాన్ని గడపసాగారు. భరతభూమిలో ధర్మగ్లాని సంభవించింది. ఆనాడు పూజ్యపాదులు శ్రీ శంకరాచార్యులు ఉద్భవించారు. వారు అద్వైత మత ప్రవర్తకులే. కాని వారు చేసింది ధర్మప్రతిష్ఠాపన. వికృత రూపం ధరించిన సంప్రదాయాలను నిరసించి, సత్‌సంప్రదాయాలను అమోదించి, అనుష్టింపజేపి సమాజ సమైక్యతను సాధించారు. ఏ ప్రయాణ సౌకర్యాలు లేని రోజులలోనే దేశమంతటా మూడు పర్యాయాలు పర్యటించి, నలుమూలలా మఠాలను ఏర్పరచి సమాజ యోగ క్షేమాలకు చక్కని వ్యవస్థను ఏర్పరిచారు.

మరి ఈనాడో – పచ్చి స్వార్థం, బానిస మనస్తత్వం నరనరాన జీర్ణించిపోయి, హిందూ జాతిలో ధర్మగ్లాని సంభవించింది. సమాజాన్ని సుఖశాంతులతో వెలయింపజేసే ధర్మం జాతి జీవితానికి దూరం కావడంతో అనేక విధాలయిన అలజడులు, అపోహలు, అసూయ, విద్వేషాలు పెచ్చుపెరిగాయి. ఆ దురవస్థ నుండి హిందూజాతిని సముద్ధరించడానికి 1906లో మరల ఒక మహా పురుషుడు ఉద్భవించినాడు, ఆయన మాధవరావు సదాశివరావు గోల్వల్కర్. అనుయాయులు ‘గురూజీ’ అని ఆప్యాయంగా పిలుస్తుంటారు. రైలుపెట్టే స్వగృహంగా 33 సంవత్సరాల పాటు భారతదేశాన్ని ప్రతి సంవత్సరం రెండేసి సార్లు పర్యటించి ధర్మ ప్రబోధం చేసిన మహనీయుడు గురూజీ. ధర్మప్రతిష్ఠాపనకు స్థిరమైన ధృఢమైన పునాదులు వేసిన మహర్షి గురూజీ.

గురూజీ రామకృష్ణ పరమహంస శిష్యులైన స్వామి అఖండానంద శిష్యులుగా సన్యాస దీక్షను స్వీకరించి వారి ఆశ్రమంలో ఆరు నెలలపాటు ఆధ్యాత్మిక సాధనను సాగించారు. అయితే స్వంత మోక్షం కోసం తపోసాధనలో గడపడానికి ఉద్దేశించిన జీవితం గాదు గురూజీది. స్వామి అఖండానంద నిర్యాణం తరువాత గురూజీ నాగపూర్ తిరిగి వచ్చారు. అంతకు ముందే రాష్ట్రీయ స్వయంసేవక సంఘంతోనూ, దాని నిర్మాత పరమ పూజనీయ హెడ్గేవార్‌తోనూ వారికి గల సంబంధం ధృఢతరం కాసాగింది. డాక్టర్‌జీ అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘచాలక్ అయ్యారు. చివరిక్షణం వరకు హిందూ సముద్ధరణ కోసం, హిందూ సమాజ సంఘటన కోసం, నిర్విరామ కృషి చేశారు. నిజమయిన సన్యాసి వారు. కాదు కాదు మహాయోగి, మహర్షి, కాని వారు కాషాయాంబరాలు, దండకమండలాలు ధరించలేదు. వేదాంత చర్చలకు యోగ సాధనలకు భగవన్నామ సంకీర్తనలకు జీవితాన్ని అంకితం చేయలేదు. గురూజీ సేవించిన భగవంతుడు సాక్షాత్తుగా, సజీవంగా సాకారంగా, నిలచిన పరమేశ్వరుడు. గురూజీకి అత్యంత భక్తి పాత్రమయినది ఆ సమాజ పరమేశ్వరుని పాదాలు– సమాజంలో అట్టడుగున నిలచిన జన సమూహాలు.

సమాజంలో కాలక్రమేణ చొచ్చుకొని వచ్చిన భ్రష్టాచారాలు, సాంఘిక దురాచారాలు చూచి వారి మనసు క్షోభించేది. కొందరిని అంటరానివారని దూరం చేయడం వారికి సుతరామూ సమ్మతంగాదు. నిష్కారుణమైన ఈ దురాచారాన్ని తొలగించడానికి ఎంతో కృషి చేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో హిందువులంతా ఒక్కటే అనే సమత్వభావన ఆచరణ పూర్వకంగా కనబడుతున్నది. కాని యావత్తు హిందూ సమాజం ఇది ఆచరించాలి. అందుకోసం హిందువు హృదయాంతరాళం నుండి తరతరాలుగా తిష్ఠవేసుకు కూర్చొన్న ‘అస్పృశ్యతను పాటించకపోవడం అధర్మం’ అనే వికృత భావన తొలగాలి. దానికి సాధనం ధర్మగురువులు, మఠాధిపతులు, పీఠాధిపతులు మొదలయిన వారు అస్పృశ్యతను నిరసించడం ఒక్కటే. ఈ కార్యాన్ని వారు సాధించారు. 1969 డిసెంబరులో ఉడిపిలో జరిగిన కర్ణాటక ప్రాంత విశ్వహిందూ పరిషత్ మహాసభలలో వివిధ పంథాలకు చెందిన ధర్మాచార్యులు, గురువులు అస్పృశ్యతను నిరసిస్తూ “హైందవాః సోదరాస్సర్వే” అని ప్రకటించారు. దీనికి మూలకారణం గురూజీ అని చెప్పడం అనవసరమే. ఆనాడు ఆ సమావేశంలో పాల్గొన్న ఆర్. భరణయ్య (పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యులు, అస్పృశ్యులనే వర్గానికి చెందిన వారు) గురూజీని కౌగలించుకొని, సంతోష బాష్పాలు రాలుస్తూ రుద్ధ కంఠంతో “గురూజీ, మాకోసం ఈ మహాకార్యాన్ని స్వీకరించిన మీరెంత మంచివారు. మీరొక్కరే ఈ కార్యాన్ని సాధించగల సమర్థులని నా విశ్వాసం” అన్నారు.

“హిందూ ధర్మం నుండి ఏ కారణంచేతగానీ పతనం చెందిన వ్యక్తి ఇక శాశ్వతంగా ధర్మానికి దూరం గావలసిందే” అనే ఒక భావన ఉంది. ఇది ఆత్మహత్యాసదృశ్యం. గౌహతిలో విశ్వహిందూపరిషత్ మహాసభలో మాట్లాడుతూ గురూజీ ఇలా అన్నారు. శతాబ్దాలుగా వర మతావలంబులైన మన సోదరులను దూరంగా నెట్టి వేసే ఒక దురాచారానికి



‘సమాజంలో పుట్టి పెరిగి నశించిపోయే వ్యక్తి అనిత్య వస్తువు. కాని అనేక వ్యక్తుల సముదాయంగా వెలసిన సమాజం నిత్యం అనంతంగా సాగుతునే ఉంటుంది. ప్రతివానికి ఈ వివేకం కావాలి. అనిత్యమైన వ్యక్తి స్వార్థం కంటె నిత్య వస్తువు అయిన సమాజ శ్రేయస్సుకు అగ్రస్థానం ఇవ్వవలసి ఉంటుంది’.

స్వస్తిపలికించి, మరల మాతృధర్మం ఒడిలో చేరే భాగ్యాన్ని వారికి కలిగింపచేయడం యుగ ప్రవర్తకునకే చెల్లుతుంది. ఈనాడు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వేనవేలుగా క్రైస్తవులు, మహ్మదీయులు తిరిగి హిందూధర్మాన్ని స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావానికి గురూజీ కృషి అగ్రగణ్యమయినది. వారు పరిషత్ సంస్థాపక ధర్మకర్తలుగా చివరి క్షణం వరకు మార్గదర్శనం చేసారు.

హిందూ సామాజిక వ్యవస్థకు మూలమయిన జీవనతత్త్వాన్ని విశ్లేషించి ఆధునిక యుగానికి అన్వయించిన ప్రతిభాశాలి గురూజీ. 'నిత్యానిత్య వస్తు వివేకము' వేదాంతపరమయిన అర్థంలో గాక, సామాజికపరంగా ఇట్లా అన్వయిస్తారు వారు. 'సమాజంలో పుట్టి పెరిగి నశించిపోయే వ్యక్తి అనిత్య వస్తువు. కాని అనేక వ్యక్తుల సముదాయంగా వెలసిన సమాజం నిత్యం అనంతంగా సాగుతునే ఉంటుంది. ప్రతివానికి ఈ వివేకం కావాలి. అనిత్యమైన వ్యక్తి స్వార్థం కంటె నిత్య వస్తువు అయిన సమాజ శ్రేయస్సుకు అగ్రస్థానం ఇవ్వవలసి ఉంటుంది'. వారి ఆ భావన ఫలితమే ఈ నాడు హిందువు శతాబ్దాల గాఢ నిద్రను వదలి ప్రతి క్రియాత్మక ఆలోచనలకు స్వస్తి చెప్పి సనాతన ధర్మ ప్రాతిపదికపై నవనవోన్మేష మయి న సృజనాత్మక ఆలోచనలలో ఉరకలు వేస్తూ ముందడుగు వేస్తున్నాడు. భాషా ప్రాంత వర్ణవర్గాది భేదాలతో సతమత మవుతూ పవిత్ర భారత సవిత్రి సమగ్ర స్వరూపాన్ని దర్శించలేకపోయిన హిందువు ఈనాడు వాటిని అధిగమించి అఖిల భారత దృష్టితో చూడగలుగుతున్నాడు. గురూజీ జీవితాంతము కృషి చేసినది ఈ హిందూ సంఘటన కోసమే. దాని ద్వారా ప్రపంచంలో శాంతి సౌభాగ్యాల సంరక్షణ కోసమే. "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" (ఉన్నది ఒకే సత్ స్వరూపము. దానిని జ్ఞానులు పరిపరివిధాలుగా చెబుతారు) అంటూ సర్వమత సత్యత్వాన్ని సమాదరణీయతను ఉద్ఘాటించిన విశాల హిందూ ధర్మమొక్కటే శాంతిస్థాపన చేయగలుగుతుందనడం నిర్వివాదాంశం.

ఈ దేశంలో ఎందరెందరో మహనీయులు గురూజీ వ్యక్తిత్వంతో ప్రభావితులయ్యారు. వారితో సన్నిహిత సంబంధము నెరపిన వ్యక్తులు కాంగ్రెస్, సోషలిస్ట్, జనసంఘ్ మొదలయిన రాజకీయ పార్టీలన్నిటిలో ఉన్నారు. అన్ని ధార్మిక సంస్థలలోనూ ఉన్నారు టీఆర్ వెంకటరామశాస్త్రి. డాక్టరు ప్రకాశ, కేఎం మున్షీ, మాస్టర్ తారాసింగ్, కంచి కామకోటి శంకరాచార్యులు ఇలా ఎందరెందరో. వారి ప్రభావం ఆకాశంలా అందరినీ ఆవరించింది. రోజుకు ఒక్క పర్యాయం మాత్రమే అతి స్వల్పంగా భుజిస్తూ రెండు మూడు గంటల పాటు మాత్రమే నిద్రిస్తూ ముప్ఫై మూడు సంవత్సరాల నిరంతర పర్యటనల శ్రమకు ఓర్చగలిగిన గురూజీ మహాయోగి. వారు రాష్ట్రీయ స్వయంసేవక సంఘం ద్వారా చేసిన కృషి హిందువులకు తాము మరచిపోయిన "సంఘచ్ఛధ్వం సంవదధ్వం...' అనే వైదిక సూక్తిని గుర్తుకు తెచ్చి ఆ ప్రకారంగా కలసికట్టుగా మాటలలో చేతలలో నడకలో ఆలోచనలలో వ్యవహరించేటట్లు చేయడం. అట్టి వ్యక్తులను లక్షల సంఖ్యలో నిర్మాణం చెయ్యడం. వారు ఉద్దేశించినది హిందూ సమాజం, రాష్ట్రీయ స్వయంసేవక సంఘం ఒకటే అయిపోవాలని. ఈనాడు వారు లేకపోయినా వారు వెలిగించిన ధ్యేయజ్యోతి అనేక హృదయాలలో కాంతిపుంజాలను వెలార్చుతూనే ఉన్నది. వారీనాడు ఒక్క శరీరంతోగాక అనేక లక్షల శరీరాలతో తమ కార్యాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. గురూజీ భారతజాతిలో భారతదేశ చరిత్రలో చెరగని ముద్ర వేశారు. ఒకసారి ఇలా అన్నారు "ఒక మహాసౌధానికి పైన మెరసిపోయే శిఖరం మీద ఒకకాకి కూడా కూర్చోవచ్చు. కాని ఆ మహాసౌధాన్ని పెను తుపానుకు కూడా చలించకుండా ఉంచిన పునాదిలోని రాయి కావడం అందరికీ సాధ్యం కాదు. ఆ రాయి మన ఆదర్శం." వాస్తవానికి వారు అదేవిధంగా తమజీవితంలో అనుక్షణం జీవించారు. భావిచరిత్ర వారికి యోగ్యమయిన స్థానాన్ని ఇస్తుందనడంలో సందేహంలేదు.

**25.02.1974 'జాగృతి' నుంచి**

# 'రామరాజ్య స్థాపన అంటే రామడి ఆదర్శాలు పాటించడమే!'

## నాగపూర్ విజయదశమి ఉత్సవంలో శ్రీగురూజీ



ప్రపంచంలో విజ్ఞానం అభివృద్ధి చెందుతోంది. అటువంటి సమాజంలో ఒక దేశం– ఆ దేశపు సంస్కృతి– అటూ వాటిని పట్టుకొని వ్రేల్లాడడం మనస్సులో ఉన్న సంకుచితత్వాన్ని చూపిస్తుంది అని కొందరు అంటున్నారు. మనం దృక్పథాన్ని మార్చుకోవాలనీ మిగతా ప్రపంచాన్ని కూడా నిష్కల్మష హృదయంతో ఆహ్వానించాలని వాళ్లు మనకు సూచిస్తున్నారు. కాని నిష్కల్మష హృదయమంటే మన సంస్కృతి మీద మనకు విశ్వాసం లేని హృదయమా? ఈ రోజుల్లో ప్రపంచ శాంతి అంటే మిగతా దేశాల మీద ఏదో ఒక విధంగా ఒక ప్రముఖ దేశం అధికారం చలాయించడం, ఆ మిగతా దేశాలు దానికి అణగిమణగి ఉండడం అనిపిస్తుంది. ఇది మరీ ప్రమాదావస్థ. ఈ సమయంలో ముఖ్యంగా మన పతన కారణాన్ని తెలుసుకొని వాటిని మనం దూరం చేసుకోవాలి. భారతీయ సాంస్కృతిక ప్రాతిపదిక మీద సుసంఘటిత సమాజాన్ని సృష్టించుకోవాలి.

సంఘం సర్వ మానవత్వాన్ని ఏర్పరచడానికి ప్రయత్నించడానికి ముందు మనతో నిరంతరం అంతరస్రోతస్సుగా ప్రవహిస్తున్న ఐకమత్యాన్ని ప్రధానంగా తీసుకొని పనిచేస్తున్నది. దానికి సంఘం భారతీయ సంస్కృతిని ఆధారం చేసుకుంది. అదే భారత వర్షంలోని ప్రతి వర్గాన్ని కలుపుతున్న సూత్రం. సంస్కృతి అంటే భావాన్ని బహిర్గతం చేయడానికి అనువుగా ఉండే కళల వంటిది కాదు. అది వివిధ సంస్కారాల సారం! వివిధ సంస్కారాల ప్రాతినిధ్య శక్తి. రామచంద్రుని కాలంలో ఉన్న శాంతి సౌభాగ్యాలకు కారణం రామచంద్రుని వ్యక్తిత్వం ఒకటే కాదు. ఆ రోజుల్లో ప్రజలే ఆత్మత్యాగానికీ, ఆత్మశోధకూ నిలిచే ఉన్నతాదర్శాన్ని అందుకోడానికి ఉత్సాహితులయ్యారని గుర్తించాలి. రామరాజ్యం కావాలని నినాదం చేస్తున్నప్పుడు మన బాధ్యతల్ని మనం విస్మరించరాదు. ఊరికే శ్రీరాముడు దివ్యపురుషుడునని చెబుతూ మన కర్తవ్యాన్ని మనం నిర్వహించకుండా తప్పించుకోరాదు. రామచంద్రుని ఆదర్శాల్ని, ఆశయాల్ని దైనందిన జీవితంలోకి అనుభవించడానికి మనం ప్రయత్నించాలి.

కల్యాణ ప్రదాత, కల్యాణ స్వరూపుడు,జ్ఞాననేత్రుడు, సత్వగుణేపేతుడు, ఆదిదేవుడు, అమృతమయుడు, ఆనందమయుడు అని వేదాలు సదాశివుడిని శ్లాఘించాయి. ఆయన భక్తసులభుడు. భక్తులంటే ప్రీతి. బ్రహ్మవిష్ణువు సహా సురాసురులు, రు షులు మహాదేవుని ఉపాసించినవారే. క్షీరసాగర మథనవేళ లోకసంరక్షణార్థం హాలాహల స్వీకరణతో గరళకంఠుడిగా ప్రశస్థి పొందిన పరమశివుడిని వేదాలు మహాదేవుడిగా కీర్తించాయి. 'సర్వం శివమయం జగత్'...అంతా శివస్వరూపమే అన్నాయి. నిత్య శివరాత్రి, పక్ష శివరాత్రి, మాస శివరాత్రి అని మూడు పర్వదినాలు ఉన్నా మహాశివరాత్రికి మరింత విశిష్టత ఉందని శాస్త్రాలు, శివారాధనకు ఉత్కృష్టమైన రాత్రే శివరాత్రి అని స్కాంద పురాణం పేర్కొంది. భక్తకోటికి అత్యంత ప్రీతిపాత్రమైనది.



# ఆదిదేవుడికి

శివలింగం మూలం బ్రహ్మ స్వరూపమని, శివుడిని ప్రతిరోజు ఆరాధించడం నిత్య శివరాత్రి కాగా, ప్రతి పక్షంలోని చతుర్దశినాటి రాత్రి శివారాధనను పక్ష శివరాత్రి అని అంటారు. శివుడికి చతుర్దశి ప్రియమైనదే అయినా, కృష్ణపక్షంలోని చతుర్దశి మరింత ఇష్టమైనది కనుక దానికి మాస శివరాత్రి అని పేరు. మాఘ మాసంలోని కృష్ణపక్ష చతుర్దశి మహాశివరాత్రి. ఆనాడే లింగోద్భవం జరిగినట్లు శాస్త్రాలు చెబుతున్నాయి. మహాశివరాత్రి అంటే ముఖ్యంగా మూడు వ్రతాలతో కూడినది. అవి. అభిషేకం, ఉపవాసం, జాగరణ.

విష్ణువు అలంకారప్రియుడు కాగా శివుడు అభిషేకప్రియుడు. అభిషేకం అంటే సర్వ సమర్పణ అని అర్థం. 'నీ దయతో సిద్ధించిన ఈ జన్మను చరితార్థం చేసుకునేందుకు యత్నించే దాసాను దాసుడ'నని తనను తాను అంకితం చేసుకోవడం, శరణగతి కోరడం, చెంబుడు శుద్ధోదాకాన్ని లింగాకృతిపై పోసి, చిడికెడు భస్మాన్ని చల్లే సామాన్యులను, మహన్యాసపూర్వక నమకచమ కాదులతో ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతా భిషేకాలు చేసే అసామాన్యులను సమాన దృష్టితో ఏకరీతిన కరుణిస్తాడు. శివరాత్రి నాటి రాత్రి నాలుగు జాములలో వరుసగా పాలు, పెరుగు, నెయ్యి, తేనెతో అభిషేకించడం వల్ల శివానుగ్రహానికి పాత్రులవు తారని, పంచాక్షరీ జపంతో పునీతులవుతారని శాస్త్ర వచనం.

'ఉపవాసం' (ఉప+వసము) అంటే పస్తు ఉండడం అని లౌకిక అర్థంలో స్థిరపడిపోయింది. కానీ 'ఉప' అంటే సమీపం, 'వస' అంటే ఉండడం అని నిఘంటు అర్థం. ఎవరి సమీపాన అంటే...! భగవంతుని సమీపంలో అని అర్థం చెప్పుకోవాలి. ఆయనకు సమీపంలో ఉండడం అంటే భక్తి కలిగి ఉండడమే. మంగళకరమైన శివనామ స్మరణతో మోక్షం దొరుకుతుందని చెబుతారు.శక్తి,యుక్తి, బలం, విద్య, ధనం తదితరాలను దేవగణాలు ప్రసాదించ గలుగుతాయని, మోక్షం మాత్రం పరమేశ్వరుడే అనుగ్రహిస్తాడని అందుకే శివరాత్రి నాడు జాగరణతో శివనామస్మరణ చేస్తారు. మరో కథనం ప్రకారం, క్షీరసాగర మథనంతో పుట్టిన గరళాన్ని లోక సంరక్షణార్థం గళంలో దాచిన శివుడు దాని ప్రభావంతో కొంతసేపు (మాఘ బహుళ చతుర్దశి నాడు) స్పృహకోల్పోయాడు. పతి తలను ఒడిలో చేర్చుకున్న పార్వతీ విలపిస్తుండగా, విచారంలో మునిగిపోయిన దేవదానవులు ఆయనకు తిరిగి

# అనంత ప్రణామాలు




**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**

**సీనియర్ జర్నలిస్ట్**


స్పృహలోకి వచ్చేంతవరకు జాగరణ చేశారు. నాటి నుంచి నీలకంఠుని భక్తిశ్రద్ధలతో అర్చించి, జాగరణ చేయడం ఆనవాయితీ అనని పురాణాలు చెబుతున్నాయి.

రావణా సంహారం తరువాత బ్రహ్మ హత్యాపాతక దోష నివారణకు శ్రీరామచంద్రుడు సాగరతీరంలో సైకత లింగాన్ని ప్రతిష్ఠించి అర్చించాడు. మార్కండేయుడు శివయ్యను శరణువేడి చిరంజీవి అయ్యాడు. శ్రీ (పాలెపురుగు) కాళం (పాము), హస్తి (ఏనుగు) మూగజీవాలు, వనవాసి తిన్నడు తమ అమామకభక్తితో ముక్తులయ్యారు.

శివరాత్రి జాగరణ మొక్కుబడో, కాలక్షాపానికో కాకూడదు. అందుకు సంబంధించి పెద్దలు కొన్ని పద్ధతులు చెప్పారు. మహాశివరాత్రి నాడు వేకువ జామున నిద్రలేచి సూర్యోదయానికి పూర్వమే స్నానాదికాలు పూర్తి చేసి, గృహంలో నిత్య ఆరాధన తరువాత దేవాలయం దర్శనం చేయాలి. ఉపవాస దీక్ష చేసేవారు పండ్లు లాంటి అల్పాహారం మాత్రమే స్వీకరించాలని, లౌకిక అంశాలను పక్కన పెట్టి, పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ, వీలైనంతగా భగవధ్యానంలో గడపాలని శాస్త్రం చెబుతోంది.

**ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలు**

పరమశివుడు మూర్తిరూపంలో, లింగరూపంలో పూజాదికాలు అందుకుంటున్న దైవం. అయితే వాటిలో శివుడు జ్యోతిరూపంలో వెలుగుతుంటారని నాయనార్లు విశ్వసిస్తారు. వాటిలో ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలు అత్యంత ప్రధానమైనవి. ఏడాది పొడువున భక్తులతో సందడిగా ఉండే దేశంలోని ఈ క్షేత్రాలు శివరాత్రి పర్వదినంనాడు భక్తులతో కిటకిట లాడతాయి. వారణాశి (ఉత్తరప్రదేశ్), కేదార్‌నాథ్ (ఉత్తరాఖండ్), శ్రీశైలం (ఆంధ్రప్రదేశ్), రామేశ్వరం (తమిళనాడు), దేవ్‌ఘర్ వైద్యనాథం (జార్ఖండ్), ఘృష్ణేశ్వరం (ఎల్లోరా, మహారాష్ట్ర), భీమశంకర్ క్షేత్రం (మహారాష్ట్ర), త్ర్యయంబకేశ్వరం (మహరాష్ట్ర), ఓంకార్ క్షేత్రం (ఇండోర్/బీహార్), మహాకాలేశ్వర (ఉజ్జయిని/మధ్యప్రదేశ్), సోమనాథ్ (గుజరాత్), నాగేశ్వర్ క్షేత్రం (జామ్‌నగర్/గుజరాత్) క్షేత్రాలలో దేనినైనా ఆనాడు దర్శించుకోవాలని భక్తులు తహతహలాడతారు. వీటిలో కొన్నిటినైనా, ఏకకాలంలో, తక్కువ వ్యవధిలో దర్శించడం కష్టతరం కనుక మానసిక తృప్తి కలిగేలా శాస్త్రం ప్రాధాన్యత ప్రాతిపదికను చూపింది. వారి వారి జన్మరాశులను బట్టి దర్శించుకోవడం శుభప్రదమని పేర్కొంది. మేషరాశికి చెందినవారు రామేశ్వరం, సోమనాథ్ (వృషభం), నాగేశ్వరం (మిథునం), ఓంకారేశ్వరం (కర్కాటకం), దేవ్‌ఘర్ వైద్యనాథం (సింహం), శ్రీశైలం (కన్య), మహాకాలేశ్వరం (తుల), ఘృష్ణేశ్వరం (వృశ్చికం), వారణాసి (ధనుస్సు), దాక్షారం (మకరం), కేదారేశ్వరం (కుంభం), త్ర్యయంబకేశ్వరం (మీనం)ను దర్శించుకోవాలని తెలిపింది.

పంచభూతాత్మకమైన విశ్వమంతటా శివుడు వ్యాపించి ఉన్నాడు అనేందుకు నిదర్శనంగా కంచిలో పృధ్విలింగం, జంబుకేశ్వరం ఓజలలింగం, అరుణాచలం అగ్నిలింగం, శ్రీకాళహస్తిలో వాయులింగం, చిదంబరంలో ఆకాశలింగమై దర్శనమిస్తున్నాడు.

**పంచారామాలు**

పంచముఖుడు పరమేష్టి నాలుగు ముఖాలతో నలుదిక్కులు, ఐదవ ముఖంతో ఊర్ధ్వదిశలో చూస్తూ ఉంటాడు. ఆ ముఖాలు అయిదు పేర్లతో ఆంధ్రప్రదేశ్‌లో పూజలు అందుకుంటున్నాయి. తారకాసురుడు నేల కూలడంతో అతనిలోని ఆత్మలింగం అయిదు ముక్కలు కాగా, వాటిని దేవతలు ఆయా క్షేత్రాలలో ప్రతిష్ఠించారని చెబుతారు. అవే అమరలింగేశ్వరాలయం (అమరావతి), భీమేశ్వరాలయం (దాక్షారామం), కుమార భీమేశ్వరాలయం (సామర్లకోట), సోమేశ్వరాలయం (భీమవరం), క్షీర రామలింగే శ్వరాలయం (పాలకొల్లు). వీటికే అఘోరం (అమరావతి), తత్పురుష (ద్రాక్షారామ), వామదేవ

వారణాసి పుణ్య క్షేత్రాల దివ్యరాశి. భారతీయుల ఆత్మ. సనాతన విద్యలకు కేంద్రం. వరుణ,అసి నదుల మధ్య ప్రవహించే గంగానది తీరాన వెలసిన పుణ్యక్షేత్రం. ప్రళయకాలంలోనూ వినాశనం లేదా ప్రకాశించేది గనుక 'కాశి'అయిందంటారు ఆధ్యాత్మికవేత్తలు. అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటి. సతీదేవి కుడి కుండలం అక్కడ పడిందని శాస్త్రవచనం. శివుడికి శాశ్వత నివాసం. 'కాశీలో గృహస్థుడిగా జీవిస్తాన'ని స్వయంగా చెప్పినట్లు పురాణం. ఆయన ఈ క్షేత్రాన్ని విడువడు కాబట్టి 'అవిముక్తం'అని, శాశ్వతానందానికి విహార వనం కనుక 'ఆనందకాననం', రుద్రుడి నివాసం కనుక 'రుద్రవాసం',భస్మావశేషాలైన మహాభూతాలు నివసించే ప్రాతం కనుక 'మహా శ్మశానం' అని చెబుతారు. ఇక్కడ విశ్వనాథ జ్యోతిర్లింగంతో పాటు పద్నాలుగు సుప్రసిద్ధ లింగాలు, అనేక 'నిగూఢ'లింగాలు ఉన్నాయి. అష్టదిక్పాలకులు, గౌతమ, దుర్వాస, దధీచి, జౌగీషవ్య తదితర మహర్షులు ఇక్కడ శివలింగాలను ప్రతిష్ఠించారని ఐతిహ్యం. శంకరభగవత్పాదులు తమ ధార్మిక దిగ్విజయ యాత్రను ఇక్కడే నుంచే ప్రారంభించారని చెబుతారు. మనీషా పంచ వెలిసిందిక్కడే. రామాయణ, మహాభారతం,, శతపథ బ్రాహ్మణం, నాదర, స్కాంద పురాణాలు, జైన, బౌద్ధ గ్రంథాలు కాశీక్షేత్ర మహిమను వర్ణించాయి.



భజ విశ్వనాథం....

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల శిఖర దర్శనంతో పునర్జన్మ ఉండదని పురాణవాక్కు. అర్చామూర్తి మాత్రమే కాక ఆలయం కూడా స్వామి వారి విరాట్ రూపమని శాస్త్రాలు చెబుతున్నాయి. అష్టాదశ పీఠాలలో ఒకటైన శ్రీశైలంలోనే శంకరభగవత్పాదులు శివానందలహరి వెల్లడించారని ప్రతీతి. ఇతర జ్యోతిర్లింగాలలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ మల్లికార్జున భ్రమరాంబ కల్యాణం వేళ స్వామి వారికి బదులుగా ఆలయానికి తలపాగా చుడతారు. 365 మూరల పొడవు గల తల పాగాను రోజుకొక మూర తయారు చేయడం మరో విశేషం. శివరాత్రి నాటి రాత్రి రుద్రాభిషేకం సమయంలో దీనిని అలంకరిస్తారు. గర్భాలయం శిఖర నుంచి ముఖ మండపం పైన గల నందులను కలుపుతూ ఈ వస్త్రాన్ని అలంకరిస్తారు. గజచర్మధారుడు పట్టువస్త్రాలు, మెడలో రుద్రాక్షలు,తలపై ఒకవైపు నెలవంక,మరోవంక గంగమ్మతో; అమ్మవారు పట్టుచీర,స్వర్ణాభరణాలతో నయనానందకరంగా తయారవుతారు.


శ్రీశైల ప్రాభవం
(శ్రీశైలం ఆలయం)

(సామర్లకోట), సద్యోజాత (భీమవం), ఈశాన (పాలకొల్లు) అని నామాంతరాలు.

కృష్ణానదీ తీరంలో అమరావతిలో పదహారు అడుగుల ఎత్తుగల లింగాన్ని ఇంద్రుడు ప్రతిష్ఠించి నట్లు ఐతిహ్యం. రెండు అంతస్తులుగా ఉండే గర్భాలయంలో పై అంతస్తు నుంచి అభిషేకం నిర్వహిస్తారు. ఇక్కడి అమ్మవారు బాల చాముండేశ్వరి. సప్తగోదావరి తీర్థంగా ప్రసిద్ధి పొందిన దాక్షారామలో సూర్యుడు ప్రతిష్ఠించినట్లు చెప్పే భోగలింగం భీమేశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. పేరుకు తగినట్లే, సుగంధ ద్రవ్యాలు కలిపిన జలంతో అభిషేకిస్తారు. ఇక్కడి అమ్మవారు మాణిక్యదేవి. అష్టాదశ శక్తిపీఠాలలో ఇది ఒకటి. ఆమె కణత భాగం పడిన భాగంగా పురాణాలు వర్ణించాయి. సామర్లకోటలో యోగలింగాన్ని కుమారస్వామి నెలకొల్పడం వల్ల దీనిని కుమారారామంగా వ్యవహరిస్తున్నారు. బాలా త్రిపురసుందరి ఇక్కడి అమ్మవారు. ఆలయ అవరణలోని భీమకుండంలో స్నానం సర్వపాపహరమని విశ్వసిస్తారు. చైత్ర, వైశాఖ మాసాలలో ఉభయ సంధ్యలలో శివునిపై సూర్యకిరణాలు పడడాన్ని విశేషంగా చెబుతారు. గోస్తనీ నదీతీరంలో, క్షీరారామమని పూర్వనామం గల పాలకొల్లులో ఈశాన రూపుడైన శివలింగాన్ని (ఊర్ధ్వముఖంగా ఉండే) శ్రీమహావిష్ణువు ప్రతిష్ఠించాడని ప్రతీతి. ఈ ఆలయంలో శివుని కొప్పురూపం దర్శనం ఇస్తుంది కనుక ఆయనను 'కొప్పు లింగేశ్వరుడు' అని వ్యవహరిస్తారు. ఇక్కడి అమ్మవారి పేరు పార్వతీదేవి.

వీటితో పాటు శ్రీముఖలింగేశ్వరుడు (శ్రీకాకుళం జిల్లా), ముక్తేశ్వరం (పశ్చిమ గోదావరి), కోటప్పకొండ (గుంటూరు), మహానంది, యాగంటి (కర్నూలు), కపిలతీర్థం (చిత్తూరు) తదితరాలు ప్రముఖ శైవ క్షేత్రాలుగా పూజలందుకుంటున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో రాజ రాజేశ్వరస్వామి ఆలయం (వేములవాడ) , రామలింగేశ్వరస్వామి (కీసరగుట్ట), మల్లికార్జున స్వామి (ఐనవోలు, వరంగల్), రుద్రేశ్వరస్వామి (వేయి స్తంభాల గుడి), రామప్ప దేవాలయం (జయశంకర్ భూపాలపల్లి), కొమురవెల్లి మల్లికార్జునస్వామి (కొమురవెల్లి) వంటివి ప్రముఖ శైవ క్షేత్రాలుగా పూజలందు కుంటున్నాయి. లోకరక్షణ కోసం శివుడు అరవై అయిదు లీలా రూపాలు ధరించినట్లు శివపురాణం చెబుతోంది.

**శ్రీకాళహస్తి**

తెలుగునేలపై గల విశిష్ట శైవక్షేత్రాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సువర్ణముఖీ నదీతీరాన గల శ్రీకాళహస్తి. ఇక్కడి శివలింగాన్ని పంచభూతాలకు ప్రతీకలైన పంచలింగాలలో ఒకటైన వాయులింగం ఇక్కడ పూజలు అందుకుంటోంది. సాలెపురుగు (శ్రీ), కాళ(పాము), ఏనుగు (హస్తి)... మోక్షపొందిన క్షేత్రం. ఏ జ్ఞానంలేని చెంచు జాతీయుడు తిన్నడు..తన నేత్రదానంతో మోక్షం పొంది 'కన్నప్ప'గా విఖ్యాతుడయ్యాడు.

**ఆదిదంపతులు ఆదర్శం**

భార్యను 'అర్ధాంగి'గా మార్చిన ఘనత శివయ్యదే. అందుకే ఆయన అర్ధనారీశ్వరుడయ్యాడు. పార్వతీపరమేశ్వరులు ఆదిదంపతులై, అన్యోన్య ప్రేమానురాగాలకు నిదర్శనంగా నిలిచారు. అయినా ఇద్దరివి భిన్న నేపథ్యాలు. సిరిగల ఇంట పుట్టిన జగన్మాత భిక్షాటనం చేస్తూ శ్మశానంలో సంచరించే ఆయనను తపస్సుచేసి ఏరికోరి మరీ పరిణయణ మాడింది. ఆయనలోని క్షీరసాగర మథనవేళ హాలాహల స్వీకరణలాంటి లోకోద్ధరణ గుణాలనే తప్ప అందచందాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఎక్కడ, ఎప్పుడు భర్తను తక్కువచేసి మాట్లాడలేదు. ఆయనా అర్ధాంగి స్వేచ్ఛస్వాతంత్ర్యాలకు అడ్డుచెప్పలేదు. ఆమె నిర్ణయాలను ప్రశ్నించలేదు. పరిణామాలను ఆమెకే వదిలేశాడు. దక్షయజ్ఞం ఉదంతమే అందుకు నిదర్శనం. అలా అని జీవితేశ్వరికి కలిగిన కష్టాన్ని సహించలేకపోయాడు. ఇలాంటి సుగుణసంపన్న ఆదిదంపతులు భావితరాలకు ఆరాధ్యనీయులు.

**విదేశాల్లోనూ శివారాధన**

మహేశ్వరుడు ప్రాచీన కాలం నుంచి విదేశాలలో పూజలు అందుకుంటున్నాడు. ఇండోనేసియాలో 'బటరగురు' (ఆదిగురువు)గా ఆరాధిస్తారు. ఆగ్నేసియా దేశాలలో బౌద్ధ మత ప్రాబల్యం అధికంగా ఉన్నప్పుడూ జావా ద్వీపాలలో శివారాధన ఉండేదని చరిత్ర చెబుతోంది. అక్కడి వారు శివుడిని బుద్ధుడి అన్నగా భావిస్తూ, బుద్ధ, జనార్దనుడు (విష్ణువు)తో సమానంగా అర్చించే వారు.

తాంత్రిక ఆచారాలు పాటించే వజ్రయాన, మహాయాన బౌద్ధులు కూడా శివుడిని పూజించారని, జపనీయుల ఏడుగురు అదృష్టదేవతల శివతత్వమే మూలమని చరిత్రకారులు భావిస్తారు. సింగపూర్, ఆస్ట్రేలియా తదితర దేవాలలో శివాలయాలు నిర్మితమయ్యా.

ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, కంబోడియా, కెనడా, జర్మనీ, ఫిజీదీవులు, గయానా, ఘనా, నైజీరియా నేపాల్‌లోని పశుపతి ఆలయంలో, పాకిస్థాన్‌లోని ఉమర్ కోట్ ఆలయంలో శివరాత్రిని పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తారు. మారిషస్‌లో ఆరోజు 'గంగాతలావొ' సరస్సులో పుణ్యస్నానాలు చేస్తారు. పార్వతీపతిని మానుష విగ్రహం రూపంతో పాటు ఎక్కువగా లింగ రూపంలోనే అర్చిస్తారు. సింధులోయ నాగరికత నాటికి శివుడిని పశుపతి రూపంలో ఆరాధించేవారు. ★



# 'మేము మనింటికొస్తాం'

ఒకవైపు జమ్ము-కశ్మీర్ ప్రాంతం అభివృద్ధిలో అంగలు వేస్తూ దూసుకు పోతుండగా మరోవైపు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) ప్రాంతాలు నిరసన ప్రదర్శనలతో అట్టుడికిపోతున్నాయి. గిల్గిత్ బల్టిస్తాన్ వంటి ప్రాంతాలు తమకు స్వయంప్రతిపత్తిని కోరుకుంటుంటే, ఇతర ప్రాంతాలలోనివారు తమను భారతదేశంలోని కశ్మీర్‌లో కలిపేయమని డిమాండ్ చేస్తున్నారు. తమ ప్రాంతాలను ఆక్రమించుకున్న పాకిస్తాన్ తమను ఏరకంగానూ సమానంగా చూడక పోవడం వీరి అసంతృప్తికి కారణం. వారికి ప్రాథమిక హక్కులు కానీ, రాజ్యాంగపరమైన లేదా రాజకీయ హక్కులు కానీ లేకపోవడం. సహజ వనరులతో సుసంపన్నమైన ఈ ప్రాంతంలో ప్రజా జీవితం దయనీయంగా మారిపోవడం. వారికి విద్య, ఉపాధి అవకాశాలు సరే అసలు స్వేచ్ఛ అనేదే మృగ్యం కావడం, భాషాపరంగా, సాంస్కృతికపరంగా అణచి వేతకు గురి కావడం... ఇవన్నీ కూడా అక్కడి ప్రజలలో నిత్య అసంతృప్తి, అశాంతులకు దారితీసి, ఇప్పుడు తమను భారత్‌లో కలిపేయమనే డిమాండ్ వరకూ వెళ్లాయి.

**370 రద్దు తర్వాతే నిజం తెలుసుకున్న పీఓకే**

ఈ క్రమంలోనే జమ్ము-కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని ఎత్తివేయడం, తదనంతరం అక్కడ పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా వస్తూ, అభివృద్ధి పుంజుకోవడంతో, సరి హద్దుకు అటువైపున ఉన్నవారు రెండు ప్రాంతాలలో జరుగుతున్న పరిణామాలను పోల్చుకుని, తమను కూడా భారత్‌లో కలిపేయమనే డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్తును ఉత్పత్తి చేసే ప్రాంతం వారిదే అయినప్పటికీ, రోజుకు 16 గం॥ల విద్యుత్ కోతలను, భారీ విద్యుత్ బిల్లులను కట్టడం వారిని ఆక్రోశింపచేస్తోంది. వారి మానవ హక్కులు, సంస్కృతి, ఆహారం, భాష, వారసత్వం అన్నింటినీ పాక్ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం హననం చేస్తూ వస్తోంది. పీఓకేలోని ముజాఫరా బాద్‌లో 90 శాతం మంది ప్రజలు పంజాబీ మాట్లాడుతున్నారంటే, పీఓకేలో జన సంఖ్య ఎంతగా పరివర్తన చెందిందో అర్థం చేసుకోవచ్చుని మానవ హక్కుల కార్యకర్త ఆరీఫ్ ఆజాకియా వ్యాఖ్యానించారు. యూనివర్సిటీలు కానీ, వైద్య కళాశాలలు కానీ, జాతీయ రహదారులు కానీ, ఉద్యోగావకాశాలు కానీ లేకపోవడం వల్లే పీఓకే వ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని ఆయన వివరించారు.

నిన్నమొన్నటి వరకూ సాధారణ ప్రజల నిరసనలకు దిగగా, పీఓకేకు చెందిన రాజకీయ పార్టీ అవామీ యాక్షన్ కమిటీ (ఏసిసి) కూడా నిరసనలకు, బంద్‌లకు పిలుపునిచ్చి, రంగంలోకి దిగింది. తమ ప్రాంతాన్ని ఆక్రమించినప్పటినుంచీ, అంటే 1947 నుంచీ తమను ద్వితీయ శ్రేణి పౌరులుగాచూస్తున్నారని ఆరోపిస్తూ రాజకీయ కార్యకర్తలు పాకిస్తాన్ ఆర్మీకి వ్యతిరేకంగా బహిరంగ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. పీఓకేలో జరుగుతున్న నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖ రాజకీయ కార్యకర్త తౌకీర్ గిలానీ ప్రకారం, 'పాక్ ప్రభుత్వం ఎప్పుడూ మాకు అండగానే ఉంటామని, మా ప్రజల హక్కుల కోసం ఎప్పుడూ పోరాడతామనే హామీ ఇస్తోంది. పాకిస్తానీ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు స్నేహితులైనవారికి ప్రత్యేకంగా శత్రువులు అవసరం లేదు. కావాలంటే ఆఫ్ఘన్లను అడగవచ్చు, పాలస్తీనియన్లను కూడా అడగవచ్చు, వారు మాపై చేస్తున్న దౌర్జన్యాలు, అకృత్యాల గురించి మమ్మల్ని కూడా అడుగవచ్చంటూ' వ్యాఖ్యానించి, అక్కడి పరిస్థితులకు అద్దంపట్టారు. ముఖ్యంగా, ఖైబర్ పఖ్తూన్ఖ్వాలో పాక్ యంత్రాంగం చేస్తున్న దౌర్జన్యాలను గురించి కూడా గిలానీ ప్రస్తావించడం గమనార్హం.

పాకిస్తాన్ సైన్యానికి వ్యతిరేకంగా పాక్‌లోని సాధారణ ప్రజలలోనే అసంతృప్తి పెరుగుతుండగా, పీఓకేలో మాత్రం ఆగ్రహం వ్యక్తం అవుతోంది. సైన్యం దేశ ప్రధానులను, అధ్యక్షులను కూడా ద్రోహులని ముద్రవేసి జైళ్లలో పెట్టడమే కాదు, ఇప్పుడు రాజకీయ పార్టీలను చీల్చడం, సంస్కృతిని, సంప్రదాయాలను ధ్వంసం చేయడం, ఎక్కడ భూమి కనపడితే అక్కడ కబ్జా చేసే స్థాయికి దిగజారి పోయిందని గిలానీ మండిపడ్డారు. దీనిని ప్రజాస్వామ్యం అంటారా? ఇస్లాం అంటారా? అని ప్రశ్నిస్తూ, మానవాళి చరిత్రలో ఇంతకు మించిన అబద్ధం మరొకటి ఉండ దని ఆయన అన్న మాటలనే పీఓకే ప్రజలు ప్రతిధ్వనిస్తున్నారు. ఎవరి తాత ముత్తాతలు అయితే తమ భూములను ధ్వంసం చేశారో, ఆ వ్యక్తులు తమ ఆర్థిక పరిస్థితులు మెరుగు పరచుకునే యత్నాన్ని కూడా సహించడం లేదని గిలానీ ఆరోపించారు.

తమపై ఇస్లాం వ్యతిరేక, పాక్ వ్యతిరేక ముద్రవేసి తమ మాటలు వినేందుకు కూడా సైన్యం సిద్ధంగా లేకపోవడంతోనే అక్కడి ప్రజలు భారత్‌తో కలిపేయమనే డిమాండ్ చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా పాక్‌కు వ్యతిరేకంగా గళమెత్తుతున్న పీఓకే వాసులు ఇప్పుడు భారత్‌తో తక్షణమే పునఃఅనుసంధానం కావాలని కోరుకుంటున్నారు. తరతరాలుగా పంచుకున్న చారిత్రిక, సాంస్కృతిక సంబంధాలు, వారసత్వం ఈ డిమాండ్ లేదా కోరిక మూలాల్లో ఉంది. ఈ సామాన్య వారసత్వాన్ని గుర్తించి, వేడుక చేసుకోవడం అన్నది పీఓకే వాసులలో ఐక్యతా భావాన్ని పెంపొందించగలదు. తమ భారతీయ గుర్తింపును, అస్తిత్వాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా భారత పురోగతిలో పీఓకే వాసులు భాగస్వాములు కావాలనుకుంటున్నారు.

పాక్‌లో ఆర్థిక పరిస్థితులు కూడా వీరి అప్పీల్‌కు ఒక ప్రధాన కారణంగా భావించవచ్చు. భారత్ గురించిన తప్పుడు సమాచారం, అబద్ధాలతో ఆ ప్రాంత వాసులను మభ్యపెట్టి, లోబరుచుకొని మొన్నటివరకూ పాక్ వారిని పాలించింది. కాగా, ఈ సమాచార తుపానులో వారు కట్టిన అబద్ధాల గోడ కూలిపోయి, భారత్ సాధిస్తున్న అసాధారణ ఆర్థిక, సామాజిక పురోగతి స్పష్టంగా కనిపించడం ప్రారంభమైంది. ఈ ప్రాంత ప్రజలు కూడా భారత్‌లోని జమ్ముకశ్మీర్ ప్రాంతంలో ప్రజలు జీవిస్తున్న నాణ్యమైన జీవితాన్ని కోరుకుంటున్నారు. దీనితో వారికి తాము చేసిన తప్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అంతేకాదు, తాము పాకిస్తానీ సైన్యం చేతుల్లో రాజకీయ పరికరాలు, బలిపశువుల మయ్యామన్న విషయం వారు అర్థం చేసుకుని, ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో పురోగతికి, ఆర్థిక వృద్ధికి ఉత్ప్రేరకం అయ్యి తమ పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించాలని పీఓకే కోరు కుంటోంది. అందుకే, భారత్‌లో తిరిగి చేరతామని పదే పదే కోరుతోంది. దాని గొంతుకను పాకిస్తాన్ అధికారులు నొక్కి వేస్తుండగా, అంతర్జాతీయ మానవహక్కుల పోరాట యోధులమని భావించే వారు విస్మరించారు! భారత ప్రజాస్వామ్యం, సెక్యులరిజం ఎంత బలమైనవో, వాస్తవమో పీఓకే వాసుల డిమాండ్లు బహిర్గతం చేస్తున్నాయి.

– డి. అరుణ

# ఫత్వాలకు, బాలలకు

**"భారతదేశంలో ఇస్లాం యధాతథంగా ఉంది. ఎందుకంటే, ఇస్లాంను భారత్ తన గొప్ప వైఫల్యంగా పరిగణంచి చూస్తోంది. తాను పూర్తిగా మతాంతరీకరించిన ఇతర దేశాలలోలాగా ఇస్లాం, భారతదేశంలో ఎప్పుడూ విశ్రమించలేకపోయింది. ఖురాన్‌లో మూలాలు కలిగిన దాని సైద్ధాంతిక కోరలను పీకివేయడాన్ని హిందువుల నేర్చుకొనే వరకూ అది విశ్రమించదు!"**

చందమల్ చోప్రా అనే వ్యక్తి ఖురాన్‌ను నిషేధించాలని కోరుతూ కలకత్తాలో దాఖలు చేసిన పిటిషన్‌ను, అందులోని అంశాలను, ఆ కేసు సందర్భంలోనూ, అనంతర పరిణామాలను సంకలనం చేసి ప్రముఖ రచయిత సీతారాం గోయల్ 'కలకత్తా ఖురాన్ పిటీషన్' పేరిట పుస్తకాన్ని ప్రచురించారు. ఆ పుస్తకం మూడవ ఎడిషన్‌కు ముందుమాట రాస్తూ గోయెల్ అన్న మాటలివి. 'భారతదేశంలోని హిందూ మేధావులుగానీ, ముఖ్యంగా హిందూ నాయకత్వం కానీ, భారత జాతీయవాదానికి, ఇస్లామిక్ సామ్రాజ్యవాదానికి మధ్య పునరుద్ధరించిన పోటీ విషయంలో ఎటువంటి పాఠాలు నేర్చుకున్న సంకేతాలు కనిపించడం లేదని' ఆయన అభిప్రాయ పడ్డారు. దానికి తోడు, నేడు పాకిస్తాన్ ఆచరిస్తున్న ఇస్లాం అది ఆవిష్కరించిందేం కాదని, అది ఎప్పుడూ భారతదేశం (దక్షిణ ఆసియా లేదా ఇండో-పాక్ ఉపఖండం)లో ఎనిమిదవ శతాబ్దం నుంచే ఉందని పేర్కొన్నారు. అంతేకాదు, దీని గురించి ఆలోచించే వారందరూ కూడా మతోన్మాద, రక్తపిపాసి అయిన ఇస్లాంకు భారత్ ఎప్పుడూ కంచుకోటగా ఉంది, ఉంటుంది అని గుర్తించాలని ఆయన హెచ్చరించారు.

**దేవ్‌బంద్ ఫత్వా**

దాదాపు నాలుగు దశాబ్దాల కింద ఆయన వెలువరించిన ఈ పుస్తకంలోని అభిప్రాయాలు ఇప్పటికీ వర్తిస్తాయనే విషయాన్ని ఇటీవల ఉత్తరప్రదేశ్ లోని సహరాన్‌పూర్‌లో దేవబంద్‌కు చెందిన దారుల్ ఉలూమ్ మదరసా తన తీవ్రవాద మనస్తత్వాన్ని బయటపెట్టుకోవడం ద్వారా రుజువుచేసింది. ఇస్లామిక్ గ్రంథాలలో పేర్కొన్న ఘజ్వా-ఎ-హిందను గుర్తిస్తూ దారుల్ ఉలూమ్ ఫత్వాను జారీ చేసింది. ఘజ్వా-ఎ-హింద్ అంటే భారత్ మీద దాడి, మరొక మాటలో చెప్పాలంటే హిందువులపై దాడి. కనుక వారిపై దాడిచేస్తూ మరణించిన వారిని గొప్ప వీరులుగా కీర్తిస్తారని, ఒకవేళ ఈ పోరాటంలో మరణిస్తే వారు నేరుగా స్వర్గానికి వెడతారని పేర్కొంది. ఇటువంటి వివాదాస్పదమైన ఫత్వాలను జారీ చేయడం దారుల్ ఉలూమ్‌కు కొత్తకాదు. అనేకసార్లు ఇటువంటి ఫత్వాలను జారీచేసి ఆ ఇస్లామిక్ సంస్థ వార్తల్లోకెక్కింది.

భారత ఉపఖండంలో జరుగనున్న ఘజ్వా-ఎ-హింద్‌ను హదీత్ ప్రస్తావిస్తుందా? అందులో మరణించినవాడు గొప్ప అమరుడు, గొప్ప ఘాజీ (యుద్ధ వీరుడు) అయి స్వర్గానికి (జెన్నత్) వెడతాడా, దయచేసి సమాధానమి మ్మంటూ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ, అల్లా సందేశం తెచ్చిన వ్యక్తి తాము భారత్‌పై దాడి చేస్తామని హామీ ఇచ్చారు. అందుకోసం నన్ను నేనే కాదు, నా సంపదను కూడా త్యాగం చేస్తాను. ఒకవేళ నన్ను చంపితే, నేను ఉత్తమ వీరుడిని అవుతాను, ఒకవేళ నేను తిరిగి వస్తే నేను అబు- హురాయ్రా అల్-ముహర్రార్‌ను అవుతానంటూ దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్ సమాధానం ఇచ్చింది. పసి మనసులను విషపూరితం చేయగల ఈ ఫత్వా వెలుగులోకి రావడంతో బాలల హక్కుల కమిషన్ రంగంలోకి దిగింది.




**బాలల హక్కుల జాతీయ కమిషన్ జోక్యం!**

ఈ ఫత్వాకు వ్యతిరేకంగా ఎఫ్‌ఐఆర్ దాఖలు చేయాలని కోరుతూ సహరా న్పూర్ ఎస్‌డిఎం, ఎస్పీలకు బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ చైర్‌పర్సన్ ప్రియాంక్ కనూంగో లేఖ రాశారు. ఈ విషయంలో హోంశాఖకు బదులుగా బాలల హక్కుల కమిషన్ జోక్యం చేసుకోవడం ఏమిటా అని ఆశ్చర్యంగా అనిపించవచ్చు. కానీ, ఈ ప్రశ్నకు సమాధానంగా కనూంగో చెప్పిన మాటలలో వాస్తవాన్ని వింటే, మనకైనా వెన్ను జలదరిస్తుంది. దారుల్ ఉలూం దేవ్‌బంద్‌కు అనుబంధంగా కేవలం భారత్‌లోనే కాదు, బంగ్లాదేశ్ సహా దక్షిణ ఆసియాలో కూడా పెద్ద సంఖ్యలో మదరసాలు నడుస్తున్నాయి. వీటికి పాఠ్యాంశాలను, సైద్ధాంతికమూలాన్ని ఇచ్చేది దేవ్‌బందే. ఈ క్రమంలో ఈ మదరసాలలో చదువు కునే పిల్లలు తమ మాతృదేశానికి వ్యతిరేకంగా ఎంతటి ద్వేషపూరిత మనస్తత్వంతో బయటకు వస్తారో అర్థం చేసుకోవచ్చు. ఇది అనంతర కాలంలో వారి మానసిక, భౌతిక సమస్యలకు కారణమవుతుంది. అంటే ఒకరకంగా, జిహాదీలుగా బయటకు వస్తారన్న మాట! ఈ దుస్థితి నుంచి బాలలను కాపాడడమే బాధ్యతగా భావించిన బాలల హక్కుల కమిషన్ ఈ ఫత్వా జువనైల్ జస్టిస్ యాక్ట్, 2015 లోని సెక్షన్ 75ను ఉల్లంఘిస్తున్నందున వారిపై కేసు నమోదు చేసేందుకు ముందుకు వచ్చింది.

దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్ జనవరి 2022లో, జులై 2023లో కూడా జారీ చేసిన వాటితో సహా పెద్ద సంఖ్యలో ఫత్వాలను కమిషన్ జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లింది. ఈ ఫత్వాలన్నింటినీ దారుల్ ఉలూమ్ తమ వెబ్‌సైట్‌లో ప్రచురిస్తున్నదని, ఇది ప్రజలను పక్కదోవ పట్టించే అవకాశం ఉంది కనుక సంస్థ వెబ్‌సైట్ సహా అటువంటి ఇతర వెబ్‌సైట్‌లు ఏమైనా ఉంటే లోతుగా పరిశీలించి, దర్యాప్తు చేసి తక్షణమే బ్లాక్ చేయవలసిందిగా కమిషన్ గతంలో కోరింది. అయితే, జిల్లా యంత్రాంగం దీనిని గంభీరంగా పరిగణించక పోవడమే కాదు ఈ విషయంలో ఎఫ్‌ఐఆర్‌ను కూడా నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో, వారిపై ఎటువంటి చర్య తీసుకోకపోవడం ద్వారా అటువంటి విషయాంశాలను ప్రజలు చదవడం వల్ల తలెత్తే అవాంఛనీయ పరిణామాలకు జిల్లా యంత్రాంగం కూడా సమానంగా బాధ్యురాలవుతుందనే అభిప్రాయానికి కమిషన్ వచ్చిందని కనూంగో అన్నారు.

**జిహాద్ అంటే ఏమిటి?**

కశ్మీర్ ఉదంతం నుంచి నిన్నటి హల్ద్వానీ, సందేశ్ ఖాలీ ఘటనల వరకూ జరుగుతున్న దాడులను గమనిస్తే ఎవరికైనా వచ్చే అనుమానం ఒక్కటే. ఇస్లాం శాంతిని ప్రబోధిస్తే, ఇటువంటి హింసాత్మక సంఘటనలు ఎందుకు జరుగుతు న్నాయి? సాధారణంగా చర్చలకు వచ్చినప్పుడు ముస్లిం ప్రతినిధులు మతపెద్దలు 'జిహాద్' అంటే పవిత్ర యుద్ధమని, వ్యక్తి తనలోని అంతర్గత శత్రువులపై చేయవలసిన పోరాటమని అంటుంటారు. కానీ, ప్రవక్త సహా అనంతర కాలంలో ఇస్లామిక్ సిద్ధాంతంలో వాడిన

# సంబంధమేమిటి?




'జిహాద్' అన్నది సాధారణ పదం కాదని సీతారాం గోయెల్ అభిప్రాయపడ్డారు. కాఫిర్లను పూర్తిగా మతాంతరీకరించేవరకూ లేదా జిమ్మీలు (ముస్లింల ఆధిపత్యంలో జీవించేందుకు) అయ్యేందుకు అంగీకరించే వరకు లేదా సామూహికంగా హననం చేసి, తమదైన నిజ విశ్వాసాన్ని వ్యాప్తి చేసేందుకు ఒక సంపూర్ణ వ్యవస్థ– అంటే ఉగ్రయుద్ధం అంటూ ఆయన 'జిహాద్' అన్న పదానికి వివరణ ఇవ్వడం గమనార్హం.

**నిషేధం కోసం కలకత్తా పిటిషన్**

ఖురాన్ హింసను ప్రేరేపిస్తుందని, ప్రజాశాంతిని భగ్నం చేస్తుందని, వివిధ మతాలు, సమాజాల మధ్య మతపరమైన శత్రుత్వాన్ని, ద్వేషాన్ని పెంచడమే కాక, ఇతర మతాలను, వారి విశ్వాసాలను అవమాన పరుస్తుంది కనుక దానిని ఐపిసి సెక్షన్లు 153ఎ, 295ఎ కింద నిషేధించాలని చందమల్ చోప్రా తన పిటిషన్‌లో కోరడం నాడు బెంగాల్ సహా దేశ, విదేశాల్లో సంచలనాన్ని రేకెత్తిం చింది. దీనిపై చర్చోపచర్చలు సాగాయి. అంతిమంగా, హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పిచ్చింది. అయితే, అందులో లేవనెత్తిన విషయాలు తప్పనిసరిగా చర్చించ వలసినవి. భారతదేశంలో ఇస్లామిక్ సామ్రాజ్యవాద తోడుదొంగలు కమ్యూనిస్టులు, సోషలిస్టు, నెహ్రూవాద సెక్యులరిస్టులు, గాంధేయవాదులు – వీరంతా కూడా ఇస్లాంను కాపాడేందుకు అన్ని న్యాయపరమైన మర్యాదలను, విధానాలను గాలికొదిలేస్తారు. వారి దృష్టిలో తమ సామాన్య శత్రువు హిందూ సమాజం, సంస్కృతి. వాటికి వ్యతిరేక, శక్తిమంతమైన, సమర్ధవంతమైన ఆయుధంగా వారు ఇస్లాంను చూస్తారని గోయెల్ చేసిన వ్యాఖ్యలు అసమంజసమైనవి కావు.

చందమల్ చోప్రా పశ్చిమబెంగాల్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌కు వ్యతిరేకంగా దేశంలోనే కాదు, పొరుగు దేశమైన పాకిస్తాన్‌లో కూడా సంచలనం నెలకొంది. నాటి పాక్ మైనార్టీ వ్యవహారాలమంత్రి దీనిని మతపరమైన అసహనంగా అభివర్ణిస్తూ ప్రకటన చేయడం, భారత్‌లో, బంగ్లా దేశ్‌లో ముస్లిం మూకల హింసాత్మక ప్రదర్శనలు, పిటిషన్ దాఖలు చేసినవారిపై అబద్ధపు ఆరోపణలు, పత్రికల అసత్యరాతలు, ఒక పథకం ప్రకారం చందమల్‌కు తన వాదనలను సమర్ధించుకునేందుకు తగిన సమయం ఇవ్వకపోవడం చేయడం ద్వారా కోర్టు దానిని డిస్మిస్ చేసి, తీర్పునిచ్చేందుకు వేదికను తయారు చేసుకుంది. తన తీర్పులో కూడా భారత్‌లో సెక్యులరిజం గొప్పతనం, ఇస్లాంలోని లోతైన విషయాలు అంటూ న్యాయమూర్తి ప్రస్తావనలు చేస్తూ కేసును ముగించి, భారత సెక్యులరిజాన్ని కాపాడారు!

**'దేశంలో మతకల్లోలాలు ఎందుకు జరుగుతాయి?'**

సీతారాం గోయెల్ పుస్తకం తొలి ఎడిషన్ 1986లో ప్రచురితం కాగానే, చందమల్‌చోప్రా దాఖలుచేసిన కలకత్తా ఖురాన్ పిటిషన్‌లో 'ఆయత్'లు ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో, ఆ ఆయత్‌లతో ఒక నిరసన పోస్టర్‌ను తీయాలని హిందూ రక్షక్ దళ్ అనే సంస్థ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు ఇంద్రసేన్ శర్మ, కార్యదర్శి రాజ్‌కుమార్ ఆర్యలు నిర్ణయించి, దానిని ప్రచురించారు. 'దేశంలో మతకల్లోలాలు ఎందుకు జరుగుతాయి?' అన్న శీర్షికతో ప్రచురించిన ఆ పోస్టర్‌లో ప్రచురణకర్తలు ఖురాన్‌లోని 24 ఆయత్‌లను ప్రస్తావించారు. ఇతర మతాలను అనుసరించే వారికి వ్యతిరేకంగా పోరాడాలని ఈ ఆయత్‌లు ముసల్మాన్లను ఆదేశిస్తాయి. ఈ ఆయత్ లను ఖురాన్ నుంచి తొలగించనంతవరకూ దేశంలో మతకల్లోలాలను నివారించ లేమని వారు ఆ కరపత్రంలో తమ వ్యాఖ్యను జోడించారు.

కాగా, ఖురాన్‌ను ఏయే సెక్షన్ల కింద నిషేధించాలని కోరుతూ చందమల్ చోప్రా తన పిటిషన్‌లో కోరారో అవే సెక్షన్లైన 153ఎ, 295 ఎ కింద వారిరువురిని అరెస్టు చేసి, నాటి ప్రభుత్వం తన సెక్యులరిజాన్ని బయటపెట్టుకుండే తప్ప తమ ముందున్న ముప్పును గుర్తించడానికి ఇష్టపడలేదు. ఈ కేసు ప్రాముఖ్యతను సంతరించుకోవడానికి కారణం ఇంద్రసేన్‌శర్మ నాడు ఆలిండియా హిందూ మహాసభ ఉపాధ్యక్షుడు కావడం కూడా. ప్రాసిక్యూషన్ తాము పెద్ద చేపను పట్టామనే ఉత్సాహంలో ఉండగా, ఢిల్లీ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జెడ్ ఎస్.లోహత్ వారి భావాలతో ఏకీభవించలేదు. అభియోగాలను మోపి, శిక్షించేందుకు తగిన రుజువులు ప్రాసిక్యూషన్ ఇవ్వనందున వారిని వదిలిపెడుతున్నానని పేర్కొంటూనే, పవిత్ర గ్రంథమైన ఖురాన్ మజీద్‌కు తగిన గౌరవమిస్తున్నానని, కానీ ఆ ఆయత్‌లను సన్నిహితంగా పరిశీలిస్తే, అవి హానికరమైనవని, మహమ్మదన్లకు, దేశంలోని ఇతరవర్గాలకు మధ్య విభేదాలు సృష్టించే అవకాశం కల్పించేవిలా ఉన్నాయని తన తీర్పులో మేజిస్ట్రేట్ వ్యాఖ్యానించారు.

**బహిరంగ చర్చే పరిష్కారం**

ఈ క్రమంలోనే గోయెల్ ఒక విషయాన్ని స్పష్టం చేశారు. మతపరమైన లేదా ఇతరత్రా పుస్తకాలను నిషేధించడమనేది ప్రతికూల ఫలితాలనిస్తుందని తాము నిష్కర్షగా భావిస్తున్నామన్నారు. ముఖ్యంగా, ఖురాన్ విషయానికి వస్తే, ముస్లిమేతరులు పెద్ద సంఖ్యలో దానిని చదవడం ద్వారా అందులో ఉన్న బోధల నాణ్యతను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని కోరుకుంటున్నామని ఆయన అన్న మాటలను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం ఉంది.

తాము కలకత్తా పిటిషన్ పుస్తకాన్ని ప్రచురించడానికి కారణం, మతంగా ఇస్లాంపై బహిరంగ చర్చను ప్రోత్సహించడం; ముఖ్యంగా, ఖురాన్, హదీజ్ అనేవి దైవిక మూలాలు కలిగినవనే వారి వాదనపై చర్చించడం అని ఆయన వివరణ ఇచ్చారు.

భారతదేశంలోని ముస్లింలు తమపై, తమ ప్రవక్తపై బహిరంగ చర్చను నిరోధించేందుకు భారతీయ శిక్షాస్మృతి (ఐపిసి)లోని సెక్షన్లు 153ఎ, 295ఎను అడ్డంగా పెట్టుకుంటారు. ప్రవక్తను, ఇస్లాంలో దైవీసంభూతులుగా భావించే వ్యక్తుల గురించి ఎవరైనా విమర్శనాత్మకంగా ప్రచురించడం అన్నది క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి) సెక్షన్ 95 కింద నిషేధితం. ఇందుకు కారణం, అరిచిగీపెడుతూ, హింసాత్మకంగా నిరసన ప్రదర్శనలు చేయడం ద్వారా వారు తెచ్చే ఒత్తిడే. అయితే, చట్టంలోని ఇవే సెక్షన్లను పవిత్ర గ్రంథమైన ఖురాన్‌ను నిషేధించమని కోరేందుకు ఉపయోగించవచ్చనే విషయాన్ని వారు 1985లో కలకత్తా కోర్టులో ఖురాన్‌కు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు అయ్యే వరకూ గుర్తించలేకపోయారు. అయితే, వారికి కవచ కుండలాల్లా వామపక్షవాదులు, సెక్యులర్, ఉదారవాదులు ఉన్నంతవరకూ భయంలేదని కూడా గ్రహించారు. ★

# 'నంది'కి ప్రత్యామ్నాయం 'గద్దర్' పురస్కారమా!?



కళాకారులలో ఎక్కువ తక్కువలు ఉండవు. ఎవరి ప్రత్యేకత వారిది. కాకపోతే ఒక్కొక్క విభాగంలో కొందరు విశిష్ట సేవలు అందించినవారు ఉంటారు. వారిని సముచిత రీతిన గౌరవించుకోవడం, స్మరించుకోవడం కనీస ధర్మం. అలాంటిదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన 'నంది/సింహ'పురస్కార అంశం. గత ప్రభుత్వం అప్పటి వరకు ఉన్న 'నంది'ని 'సింహం'గా మార్చి, దానినీ పక్కన పెడితే, ప్రస్తుత ప్రభుత్వం 'గద్దర్' పేరును తెరపైకి తెచ్చింది.

సినీ, టివీ రంగస్థల కళాకారుల అత్యున్నత ప్రతిభను గౌరవిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1964లో నంది పురస్కారాలను ప్రవేశపెట్టింది. తెలుగులో ఉత్తమ చిత్రాలను, నటులు, ఇతర కళాకారులును గుర్తించి ఈ పురస్కారంతో సత్కరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తెలుగు భాషలో ఉన్నత సాంకేతిక నైపుణ్యం, సాంస్కృతిక, విద్యా, సామాజిక ఔచిత్యంతో కూడిన కళా సౌందర్య విలువలతో (Aesthetic values) కూడిన చిత్రాల నిర్మాణాన్ని, దేశ సమైక్యత ప్రోత్సహించడం ఈ పురస్కారం ఉద్దేశం. ఉగాదినాడు ప్రజా సమక్షంలో నిర్వహించే కార్యక్రమంలో వీటిని అందచేసేవారు.

ఉత్తమ చిత్రాలు, నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు, పిల్లల సినిమాలు, ఫీచర్ ఫిల్మ్‌లు, జాతీయ సమగ్రతపై ఫీచర్ ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీ ఫిల్మ్‌లు, విద్యా సంబంధిత చిత్రాలు, బాలల చిత్రాలు తెలుగు సినిమాపై పుస్తకాలు/కథనాల విభాగాల్లో ఈ పురస్కారాలను బహూకరించేవారు. ఇవి సాధారణంగా బంగారు, వెండి, కాంస్య నందుల రూపంలో ఉండేవి.

రాష్ట్ర విభజనతో ఏర్పడిన తెలంగాణలో నంది పురస్కారం బదులు 'సింహ' పేరుతో పురస్కారాలు అందచేస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది కానీ కార్యరూపం దాల్చలేదు.

> **ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇటీవల ఎమోషనలై 'నంది'కి సమాంతరంగా 'గద్దర్' పేరిట అవార్డును ప్రకటించారు. సాహిత్యం జానపద కళల పరంగా ఆయన పేరిట పురస్కారం ఎంతో సముచితమైనదే. కానీ సినిమా రంగానికి సంబంధించి ఆయన పేరు నంది అవార్డుకు ప్రత్యామ్నాయం ఎలా అవుతుంది? సినీ, టి.వీ రంగాలకు గద్దర్ అందించిన సేవ ఎంత?**

తెలుగు సినీ, రంగస్థల, టీవీ రంగాలకు సంబంధించి ప్రభుత్వ పురస్కారాలు గగనకుసుమాల య్యాయి. మినీస్టార్లు మొదలు మెగాస్టార్లు, స్టూడియోలు, సాంకేతిక నిపుణులతో భాగ్యనగరం కళకళలాడుతున్నా పురస్కారాల విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం కళాకారులకు కలత కలిగిస్తోంది. తెలుగు సినిమా అంచెలంచెలుగా ఎదుగుతున్నప్పటికి తెలంగాణ ప్రభుత్వం మాత్రం అవార్డులకు ఆమడదూరం ఉండడం శోచనీయం. సినిమా రంగం అనగానే ''తెలంగాణేతరులు'' అనే సంకుచిత మనస్తత్వం ఉండటం ఆశ్చర్యం!! కళామతల్లికి అందరూ ఒక్కటే.. కదా!!

ఇకపోతే పురస్కార చిహ్నం గురించి ఆలోచిస్తే... 'నంది'ని కళకు ప్రతీకగా భావించాలి. వేల సంవత్సరాల క్రితమే వెలువడిన భరతముని 'నాట్యశాస్త్రం'లో నంది ప్రస్తావన ఉంది. 'నంది' అందరివాడు అన్న స్పృహ కలిగి ఉంటే మంచిది. ఆయన (నంది) ఆంధ్రప్రదేశ్ శ్రీకాళహస్తి, ద్రాక్షారామం, శ్రీశైలం తదితర క్షేత్రాల్లోనే కాదు.. చారిత్రాత్మకమైన వేయి స్తంభాల గుడిలో, రామప్ప గుడిలోనూ ఉన్నాడు. చివరికి మేడారంలో కూడా ఉన్నాడు. అవతలి వారు 'ఎద్దు అంటే మనం మొద్దు' అనే వాదాన్ని 'గబ్బిలంలా పట్టుకొనేవారు తెలుగు సంస్కృతికి దూరమై సంకుచితత్వానికి దగ్గరవుతున్నారు. అదే హిందీ భాషా రాష్ట్రాలెన్ని ఉన్నా వారంతా ఒకే సంస్కృతికి కట్టుబడి ఉంటారు.

ఇదిలాఉంటే, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇటీవల ఎమోషనలై 'నంది'కి సమాంతరంగా 'గద్దర్' పేరిట అవార్డును ప్రకటించారు. సాహిత్యం జానపద కళల పరంగా ఆయన పేరిట పురస్కారం ఎంతో సముచితమైనదే. కానీ సినిమా రంగానికి సంబంధించి ఆయన పేరు నంది అవార్డుకు ప్రత్యామ్నాయం ఎలా అవుతుంది? సినీ, టి.వీ రంగాలకు గద్దర్ అందించిన సేవ ఎంత? అని ప్రశ్నించినపుడు ఒక్క 'మాభూమి' వంటి అభ్యుదయ చిత్రాలలో పాటలు రాయడం లేదా పాడడం మినహా ఆయన చేసిందేమి లేదు. తనకు తొలిసారి వచ్చిన నంది పురస్కారాన్నే తిరస్కరించారు. తరువాత రెండవసారి (1996) మాత్రం సమ్మతించి స్వీకరించారు. అసలు గద్దర్ 'ఐడియాలజీ'యే వేరు.

తెలంగాణా ప్రాంతం నుంచి తెలుగు సినిమాకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన మహనీయులున్నారు. నటులు, నిర్మాతలు డాక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి, టి.ఎల్. కాంతారావు, త్యాగరాజు మొదలైన వారు తెలంగాణీయులే. కరీంనగర్ జిల్లా కొత్తపల్లికి చెందిన ప్రముఖ నిర్మాత, దర్శకులు బి.ఎస్.నారాయణ తెలుగు సినీ రంగానికి జాతీయ స్థాయిలో తొలిసారి ఉత్తమ నటి, రెండు జాతీయ పురస్కారాలను అందించిన గొప్ప దర్శకుడు. ఆయన దర్శకత్వం వహించిన 'నిమజ్జనం' ఉత్తమ



**డాక్టర్ వి.వి.రామారావు**
వ్యాఖ్యాత, సినీ విమర్శకుడు, గాయకుడు
9849237663



ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. 1958 నుండి నేటి వరకు సితార్‌పై సంగీతం అందించిన 86 ఏళ్ల పండిట్ మిట్ట జనార్దన్ మన హైదరాబాద్ వారే కదా?

మనకు సినిమాటోగ్రఫీ సమాచార ప్రసార శాఖ, సాంస్కృతిక శాఖ మంత్రి, సంగీత,సాహిత్య అకాడమీలు, వాటికి చైర్మన్లూ ఉన్నారు. కానీ ప్రకటించాల్సిన పురస్కారాలే లేవు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం 'కాళిదాస్ సమ్మాన్', కేంద్ర ప్రభుత్వ 'సరస్వతీ సమ్మాన్ తాన్‌సేన్' అవార్డులు అందిస్తున్న పద్ధతిని మార్గదర్శకంగా భావించవచ్చు. సంగీత, నాటక రంగాలకు చెందిన వారికి తమిళనాడు ప్రభుత్వం ఇచ్చే 'కళై మా మణి'ని పద్మశ్రీ కంటే గొప్పగా భావిస్తారు. మరి మన తెలంగాణకు అలాంటేదైనా, మానుషశక్తికి అతీతమైన దైవీయమై కళాత్మకమైన పేరుతో గల పురస్కారం ఇంతవరకు లేకపోవడం శోచనీయం.

సభలలో జనాలను చూడగానే ఆవేశంతో ప్రకటనలు చేయడం కంటే, నిపుణులు, మేథావులతో కమిటీ వేసి టైటిల్ మొదలు అన్ని అంశాలను రూపొందించి ప్రకటిస్తే హుందాగా ఉంటుంది. ప్రభుత్వాలు మారినా అవార్డు పేరు చిరకీర్తితో ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునః పరిశీలించుకొని, సర్వ జనామోదక టైటిల్‌తోనే అవార్డులను ప్రకటించాలి.

గద్దర్ పేరిట మరో సర్వోన్నత సాహిత్య, సామాజిక పురస్కారాన్ని ప్రకటించి గౌరవించండి. ఆయన పేరిట జానపద, అభ్యుదయ గేయ సాహిత్యంలో హిమశిఖరం వంటి పురస్కారం ఇచ్చినా ఎవరికీ అభ్యంతరం లేదు. విశ్వవిద్యాలయాలలో ఆయనపై బోర్డ్ ఆఫ్ స్టడీస్ పెట్టించి అధ్యయనం, పరిశోధన, చేయించండి.

ఏదిఏమైనా సినీ టీవీ రంగాలవారికి పురస్కారాలను ఇవ్వడంలో జాప్యాన్ని నివారించి, సర్వోన్నతమైన, అందరికీ ఆమోదయోగ్యమై, సంస్కృతిని ప్రతిబింబించే పేరుతో ఇస్తే బాగుంటుంది.. ★

ప్రాంతీయ చిత్రంగా ఎంపిక కావడమే కాక నటి శారదకు జాతీయ స్థాయిలో ఉత్తమనటి పురస్కారంతో పాటు 'ఊర్వశి' అవార్డును తెచ్చిపెట్టింది. ఇది జాతీయస్థాయిలో తెలుగు సినీరంగానికి మొట్టమొదటి సారి వచ్చిన ఉత్తమ నటి అవార్డు. మధుమేహ వ్యాధితో కంటిచూపు కోల్పోయిన బీఎస్ నారాయణ, కరీంనగర్‌లోని రేకుర్తి లయన్స్ కాంతి ఆసుపత్రిపై 'తమసోమా జ్యోతిర్గమయ' (1090) డాక్యుమెంటరీ చిత్రం తీశారు. కరీంనగర్‌లోని కొందరు యువకులతో 'మార్గదర్శి' (1991) అనే చిత్రాన్ని రూపొందించాడు. అంధుడై సినిమా నిర్మించినందుకు నారాయణకు 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' వచ్చింది. ఆ చిత్రం ఉత్తమ జాతీయ సమైక్యతా చిత్రంగా నంది అవార్డును అందుకుంది. దక్షిణ భారత సినీ దర్శకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశాడు. రాజారామ్ డైరెక్టర్స్ కాలనీ ఏర్పాటు చేశాడు. అంత సమున్నతుడి పేరున ఒక పురస్కారమైనా ఉన్నదా? అసలు వీరెవరో ఈనాటి రాజకీయ నేతలకు, తరానికి తెలుసా?

తెలుగు సినిమా హైదరాబాద్‌కు తరలి రావడానికి అక్కినేని నాగేశ్వరరావు, నందమూరి తారకరామారావుతో సమాన కృషి చేసిన వారు డా.ఎం.ప్రభాకరరెడ్డి. ఆ ఇద్దరు మహానటులు హైదరాబాద్‌లో స్టూడియోలు, సినిమా హాళ్లు నిర్మించడమే చేశారు. కానీ ప్రభాకర రెడ్డి పేద సినీ కళాకారుల కోసం తన 10 ఎకరాల పొలాన్ని ఉచితంగా ఇచ్చేశారు.

అలా ఏర్పడిన కాలనీయే ఇప్పుడు చెప్పుకుంటున్న 'చిత్రపురి' కాలనీ. అందుకే దానిని 'ప్రభాకరరెడ్డి' చిత్రపురి కాలనీ అంటారు. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా అన్ని ఎకరాలను దానం చేసిన ఆయన సేవలను ప్రభుత్వం కనీసం అవార్డుల రూపంలోనైనా స్మరించుకోవద్దా? 'చిల్లర దేవుళ్లు' చిత్రానికి దర్శకత్వం వహించిన టి.మాధవరావు, గద్దర్ పాటలు రాసిన 'మా భూమి' చిత్ర దర్శకుడు బి.నరసింగరావు తదితరుల సేవలను

## నందీ పోయే.. సింహం రాలే..

సినీ రంగానికి సంబంధించిన 'నంది' బదులు తెలంగాణ అస్తిత్వానికి చిహ్నంగా 'సింహ' పురస్కారాలు అందిస్తామని 2016లో అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. బహుశః నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఇలవేల్పు యాదగిరి లక్ష్మీ నరసింహస్వామిలో నుంచి 'సింహాన్ని' తీసుకొని ఉంటారు. ఆయన ప్రభుత్వం పురస్కారాలపై విధివిధానాలు రూపొందించి, కేటగిరీలనుబట్టి రూ. 5 వేలు మొదలు రూ.10 వేల వరకు రుసుం నిర్దేశించి దరఖాస్తులను ఆహ్వానించారు. చాలామంది కళాకారులు, సాంకేతిక నిపుణులు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకొన్నారు. ఆ తరువాత ప్రభుత్వం దరఖాస్తుల పరిశీలన కాదు కదా కనీసం అవార్డుల గురించి ప్రకటన కూడా చేయకపోవడం శోచనీయం. అందరి వద్ద వసూలు చేసిన రుసుమును తిరిగి చెల్లించలేదు. కారణాలేవైనా కార్యరూపం దాల్చలేదు. ఆ విధంగా కేసీఆర్ గారి సింహం' గుహలోనే ఉండిపోయింది.



గత ప్రభుత్వ ప్రతిపాదిత 'సింహ పురస్కారం'



ఉమ్మడి రాష్ట్ర నంది పురస్కారం

## వాటిని కోర్టు బయట పరిష్కరించుకుంటే మంచిది

**కా**శీ, మధుర వంటి వివాదాలకు రాజకీయ పక్షాలు కోర్టు బయట పరిష్కారాల కోసం అన్వేషించాలని అజ్మీర్ దర్గా ప్రధాన గురువు జైనుల్ అబేదిన్ పిలుపునిచ్చారు. పరస్పరాంగీకారంతో వివాదాలను పరిష్కరించుకుంటే తద్వారా అన్ని వర్గాల మనసులను గెలుచుకోవచ్చునని, వారి విశ్వాసాన్ని పొందవచ్చునని జైనుల్ అన్నారు. పైగమ్ ఎ మొహబత్ హమ్ సబ్ కా భారత్ పేరిట అఖిల భారత సూఫీ సజాదాన్షిన్ కౌన్సిల్ (రాజస్థాన్ విభాగం) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైనుల్ మాట్లాడారు. ఈ సమావేశానికి రాజస్థాన్‌లో ఉన్న దాదాపు అన్ని దర్గాల అధిపతులు హాజరయ్యారు. జైనుల్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పలు అంశాలను పేర్కొన్నారు.

ప్రపంచంలో శాంతిని నెలకొల్పడానికి భారత్ సానుకూల పాత్రను పోషిస్తున్నదని, అందుకు కారణం వసుధైవ కుటుంబకం అన్న భారతీయ సిద్ధాంతమని జైనుల్ వ్యాఖ్యానించారు. అదే విధంగా దేశంలో ఉన్న అంతరంగ సమస్యల పరిష్కారానికి కూడా శాంతియుతంగా కోర్టు బయట పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తారని జైనుల్ ఆశాభావం వ్యక్తం చేశారు. పౌరసత్వ సవరణ చట్టం విషయంలో ముస్లింలను తప్పుతోవ పట్టించారని కూడా ఆయన ఆరోపించారు. ఆ చట్టాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత అందులోని ఏ అంశమూ భారతీయ ముస్లింలకు వ్యతిరేకం కాదన్న విషయం అర్థమయిందని ఆయన చెప్పారు. ఆ చట్టం వల్ల ఆఫ్గనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో హింసకు గురి అవుతున్న మైనారిటీలకు రక్షణ దక్కుతుందని జైనుల్ వెల్లడించారు. సీఏఏ భారతదేశంలోని ఏ ఒక్క పౌరుడి



## థాయ్‌లాండ్ అయోధ్య-అయుత్తాయ

**భా**రతదేశంలో రాముడు పుట్టిన నేల అయోధ్యకు గుర్తుగా థాయ్‌లాండ్ దేశంలో ఒక ప్రాంతానికి ఆ పేరే పెట్టుకున్నారు. అదే అయుత్తాయ. ఈ ప్రాంతాన్ని బిహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఇటీవల దర్శించారు. బుద్ధుని అవశేషాలను థాయ్‌లాండ్‌కు అప్పగించడానికి ఆయన నాయకత్వంలోనే 22 మంది సభ్యుల బృందం అక్కడకు వెళ్లింది. ఈ బృందం 23 రోజులు అక్కడ పర్యటిస్తుంది. అయుత్తాయ పట్టణాన్ని 1350లో నిర్మించారు. ఇది సయామీ రాజ్యానికి రెండో రాజధాని. మొదటి రాజధాని సుఖోథాయ్.

అయుత్తాయ 14 శతాబ్దం నుంచి 18వ శతాబ్దం వరకు వైభవ దశను అనుభవించింది. ఆ నాలుగు వందల ఏళ్లు కూడా అది ప్రపంచంలోనే అత్యంత వైవిధ్య జాతుల జీవన కేంద్రంగా, నగర జీవితానికి కేంద్రంగా, వాణిజ్య వ్యాపార కూడలిగా కూడా అలరారింది. అలాగే దౌత్య వ్యవహారాలకు ఇది నిలయంగా ఉండేది. అయుత్తాయకు మరొక ప్రత్యేకత, అది నిర్మించిన ప్రదేశం వ్యూహాత్మకమైనది. దీని చుట్టూ ఉండే మూడు నదులు సముద్ర ప్రయాణానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. అక్కడ సముద్రంలో అలలు తీవ్రంగా ఉంటాయి. అందుకే యుద్ధ నౌకల ద్వారా ఈ పట్టణాన్ని సమీపించడం లేదా దాడికి పాల్పడడం సాధ్యమయ్యేది కాదు. అయితే ఈ పట్టణం 1767లో బర్మా దాడికి గురైంది. ఇక్కడి ప్రజలను తరిమివేసింది. తరువాత ఈ పట్టణాన్ని ఎవరూ పునరుద్ధరించలేదు. అప్పటి నుంచి ఇదొక పురావస్తు అద్భుతంగానే మిగిలి ఉంది. ★

## జాతీయ పతాకాన్ని అవమానిస్తే...



ఒక దేశ జాతీయపతాకాన్ని అవమానించడం అనాగరికం. ఈ సంగతి పాశ్చాత్య దేశాలు ఇప్పుడు బాగా పట్టించుకుంటున్నాయి. ఫ్రాన్స్ ఇటీవల మహజబ్ మహజౌబీ అనే ముస్లిం మత గురువును 12 గంటలలోగా దేశం నుంచి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఫ్రాన్స్ జాతీయ పతాకాన్ని ఇతడు సైతాన్ అని ఒక మీడియా పోస్ట్‌లో వ్యాఖ్యానించాడు. అల్లాకు సంబంధించినంత వరకు ఆ పతాకానికి ఎలాంటి విలువా లేదన్నాడు. ఇతడు ట్యునీషియా దేశీయుడు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో బగ్నోల్స్ సర్ సెజె (దక్షిణ ప్రాంతం) ఉంటున్నాడు. అతడిని దేశం విడిచిపోవలసిందిగా ఆదేశించామని ఫ్రాన్స్ అంతరంగిక వ్యవహారాల మంత్రి గెరాల్డ్ దార్మానిన్ ఫిబ్రవరి 22న ప్రకటించారు. అదే రోజు (శుక్రవారం) జెండాను పట్టుకుని దూషించాడు. మరునాడే అరెస్టు చేశారు. ఇతడు అతివాద భావాలు ఉన్న మత గురువు కాబట్టి ఈ చర్య తీసుకున్నామని మంత్రి చెప్పారు. తనకు జాతీయ పతాకాన్ని అవమానించే ఉద్దేశం ఏమాత్రం లేదంటూ, కాస్త నాలుక మడత పడింది అంతే తప్ప, ఆ వ్యాఖ్యలో దోషమేమీ లేదని కూడా అంటున్నాడితడు. మహజౌబ్ బొత్తిగా అనాగరికుడనీ, అసహనం కలవాడనీ, ఇస్లాంను హింస కోసం ఉపయోగించుకుంటున్నాడనీ కూడా ఫ్రాన్స్ ఆరోపించింది. 1980 నుంచి ఫ్రాన్స్‌లో ఉంటున్నప్పటికీ, వివాహం చేసుకుని ఐదుగురు పిల్లలకు తండ్రి అయినప్పటికి ఇతడికి ఫ్రాన్స్ మీద గౌరవం లేదు. అతడి సంతానమంతా ఫ్రాన్స్ పౌరసత్వం ఉన్నవారే. ఈ అతివాద మత గురువు గతంలో కూడా కొన్ని వివాదాస్పద వ్యాఖ్యాలు చేశాడు. ఇతడి దృష్టిలో యూదులను బతకనివ్వ కూడదు. పాశ్చాత్య సమాజాలను నాశనం చేయాలి. ఇతడి న్యాయవాదులు పై కోర్టులో అప్పీలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నా, అధికారులు మాత్రం ఇతడిని ట్యునిస్ విమానం ఎక్కించేశారు. విమానం ఎక్కించేసినంత మాత్రాన నేను ఊరుకోను, మళ్లీ ఫ్రాన్స్ రావడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడితడు. ★



పౌరసత్వాన్ని హరించదని కూడా తమకు అర్థమయిందని జైనుల్ అన్నారు. ★

## ఐక్యమవుతున్న హిందూ సమాజం

జనవరి 22న దేశమంతా భారతీయులు అయోధ్య ప్రాణప్రతిష్ఠ ఉత్సవం జరుపుకుంటూ ఉంటే కొన్ని చోట్ల ముస్లిం మతోన్మాదులు రెచ్చిపోయారు. ముంబైలోని మీరారోడ్‌లో జరిగిన దుర్ఘటన కూడా అలాంటిదే. హిందువుల ఊరేగింపు మీద కొందరు దాడికి దిగారు.



ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలు తీసుకుంది. అది వేరే విషయం. నాడు కొందరు ప్రదర్శించిన మతోన్మాదానికి సమాధానంగా మా ఐక్యతను ప్రదర్శించదలుచుకున్నాం అని ఎంబీఏ విద్యార్థి నిఖిల్ చెప్పాడు. ఫిబ్రవరి 25న జరిగిన ఈ ఊరేగింపులో 7,000 మందివరకు పాల్గొన్నారని అంచనా. వీరిలో ఇరవై, ముప్పయ్ ఏళ్ల యువతరమే ఎక్కువ. సకల హిందూ సమాజ్ ఈ కార్యక్రమం నిర్వహించింది. పాల్గొన్న వారంతా కాషాయజెండాలు పట్టుకున్నారు. తెలంగాణ బీజేపీ ఎంఎల్ఏ టి. రాజాసింగ్ కూడా ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. జనవరి 21న మీరారోడ్‌లో ఊరేగింపు జరిపినప్పుడు వినోద్ జైస్వాల్ అనే యువకుడిని కొందరు ముస్లింలు కత్తితో పొడిచారు. హిందువులను లక్ష్యంగా చేసుకుంటున్న ముస్లిం మతోన్మాదుల పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలని రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. ★

## జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక 'నవలల పోటీ- 2023' ఫలితాలు



తెలుగు నవలా సాహిత్యానికి విశేషమైన చరిత్ర ఉంది. ఎన్నో విశిష్ట నవలలు మన భాషలో వెలువడినాయి. వెలువడుతున్నాయి. ఈ సంప్రదాయాన్ని కొనసాగించడమే జాగృతి ధ్యేయం. ప్రతి సంవత్సరం వలెనే ఈ పోటీకి కూడా మంచి స్పందన వచ్చింది. పోటీలో పాల్గొన్న రచయితలందరికీ కృతజ్ఞతలు. మేం ప్రకటించినట్టే రెండు నవలలను పురస్కారం కోసం న్యాయమూర్తులు ఎంపిక చేశారు.



### ప్రథమ బహుమతి (రూ.25,000)

**జన్మ**

సంబరాజు లీల (లట్టుపల్లి)



### ద్వితీయ బహుమతి (రూ.20,000)

**తూర్పు-పడమర**

గన్నవరపు నరసింహమూర్తి

అనివార్య కారణాలతో ఫలితాలు ప్రకటన ఆలస్యమైంది. దీనిని రచయితలు అర్థం చేసుకోవాలని కోరుతున్నాం. విజేతలకు మా అభినందనలు. ఇకపై నిర్వహించే పోటీలకు కూడా ఇదే విధమైన స్పందన ఉంటుందని ఆశిస్తున్నాం.

ప్రథమ బహుమతి నవల ధారావాహిక త్వరలో..

– అసోసియేట్ ఎడిటర్



# బాలక్‌రామ్‌కు

రాముడంటే మర్యాదా పురుషోత్తముడు. ఆధ్యాత్మిక జీవనానికి ఆయువుపట్టు. సాంస్కృతిక చైతన్యం. అన్నింటికి మించి భారతీయ ఆత్మ. ఈ సంవత్సరం జనవరి 22న అయోధ్యలో జరిగిన ప్రాణప్రతిష్ఠ మనం మరచిపోతున్న విలువలను గుర్తు చేసింది. ఆలయానికీ, నాగరికతకూ ఉన్న బంధాన్ని పునర్ నిర్వచించింది. ధార్మిక దృష్టికీ మూల విరాట్టుకూ ఉన్న అలౌకిక బంధాన్ని గుర్తు చేసింది. అలాగే మన కళలు, సంగీతం పరమార్థాన్ని గుర్తు చేసే పని కూడ ఇప్పుడు అక్కడ మొదలయింది. అందులో భాగమే జనవరి 26న మొదలైన రాగసేవ. ఇది యాభయ్ రోజుల పాటు సాగి, మార్చి 10న ముగుస్తుంది. ఏమిటీ రాగసేవ? భజనలు, సంకీర్తన, నృత్యం, నాట్యం సాక్షాత్తు దేవుని ఎదుట ప్రదర్శించడమే రాగసేవ. రాగసేవతో ఆలయ ప్రాంగణం చైతన్యవంతమవుతుంది. దీనినే భారతదేశ దక్షిణభాగంలో మండలపూజ అని పిలుచుకుంటారు.

రాగసేవకు వెయ్యేళ్ల చరిత్ర ఉంది. భారతీయుల దృష్టిపథం నుంచి తప్పుకుంటున్న భక్తిమార్గాలలో ఇదొకటి. అయినా ఇంకా కొన్నిచోట్ల భక్తులు దీనిని కాపాడుకుంటున్నారు. రాజస్తాన్‌లోని నాథ్‌ద్వారా ఆలయం, మధురలోని ద్వారకాధీశ్ ఆలయం, పుష్టిమార్గీయ స్వామి వల్లభాచార్య మఠాలు రాగసేవను నిర్వహించు కుంటున్నాయి. కొందరు కవులు దైవసన్నిధిలో పాడడం వరంగా భావించేవారు. సూరదాస్, నందదాస్, కుంభన్‌దాస్, స్వామి హరిదాస్ విష్ణువు, కృష్ణభగవానుడి మూర్తుల ముందు పాడేవారు. రాగసేవలో లేదా మండల పూజలో సంగీత విద్వాంసులు గానం చేస్తారు. నర్తకులు నృత్యం చేస్తారు. ఇదంతా గర్భగుడి ముందే జరుగుతుంది. ఇప్పటికీ వైతీశ్వరన్ ఆలయం, లింగరాజ్ ఆలయం, మీనాక్షి ఆలయం, తిరుపతి వెంకన్న ఆలయాలలో ఈ సంప్రదాయం ఉంది.

ఇదే సంప్రదాయాన్ని ఇప్పుడు అయోధ్య నూతన రామమందిరంలో ప్రారంభించారు. ప్రముఖ కవి, రచయిత యతీంద్ర మిశ్రా రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తరపున ఈ బాధ్యత నిర్వహిస్తున్నారు. ఈ సేవలో భారత ఉత్తర, దక్షిణ ప్రాంతాల కళాకారులందరికీ అవకాశం కల్పిస్తున్నారు. రాగసేవ అంటే భారతదేశంలో పురాతనకాలం నుంచి వస్తున్న 'నవ విధ భక్తి' పరంపరలో భాగమేనని మిశ్రా చెప్పారు. సంగీతం, నృత్యం అందులో భాగం. పరమాత్మ కోసం చేసే ఈ కళాసేవ కారణంగా ప్రాంగణం, భక్తుల హృదయాలు ఆధ్యాత్మిక చైతన్యంతో





# రాగసేవ

నిండిపోతాయి. ఈ సంప్రదాయం అయోధ్యలో కూడా ఒకనాడు విలసిల్లింది. కలేవా సంప్రదాయం పేరుతో అయోధ్యలోని రామ మందిరాలలో, కనకభవన్‌లో భజనలు, కీర్తనలు ఆలపించేవారు. మూలవిరాట్టుకు మంగళ హారతి సమర్పించేటప్పుడు వీటిని ప్రదర్శించడం సంప్రదాయం.

రాముడంటేనే భారతదేశమంతటా పూజించే దైవం. సాంస్కృతిక ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీక. కాబట్టే దేశం నలుమూలల నుంచి అయోధ్య రాగసేవకు కళాకారులను రప్పిస్తున్నారు. వీరిలో పద్మ పురస్కారాలు, సంగీత నాటక అకాడమి పురస్కారాలు పొందిన వారు కూడా ఉన్నారు. సంప్రదాయ సంగీతం, నృత్యమే కాకుండా జానపద శైలికి కూడా ఈ సేవలో చోటు కల్పించారు. యాభయ్ రోజులకు యాభయ్ మంది కళాకారులను ఎంపిక చేశారు. అయోధ్య కేంద్రంగా విలసిల్లిన జానపద సంగీతంతో ఈ కార్యక్రమం ఆరంభించారు. ఆ భజన్‌లను మాలిని అవస్థి, అనూప్ జలోటా, సురేశ్ వాడేకర్, అనురాధా పోడ్వాల్, శేఖర్‌సేన్, సునందా శర్మ, బావుల్ గాయకుడు పురందర్‌దాస్ ఆలపించారు. ఇంకా హిందుస్తానీ సంప్రదాయ సంగీత కార్యక్రమం నిర్వహించడానికి గాత్ర నిపుణులు అశ్విని భిడే దేశపాండే, పండిట్ సజన్ మిశ్రా వేణుగాన నిపుణుడు రోణు మజుందార్ పాల్గొన్నారు. హవేలీ సంగీత సంప్రదాయ నిపుణుడు చంద్రప్రకాశ్ (రాజస్తాన్) ఇందులో పాడారు.

కర్ణాటక సంగీత కళాకారులు అరుణా సాయిరామ్, రంజనీ గాయత్రి ఎంపికయ్యారు. వీరి పాటలకు ప్రఖ్యాత భరతనాట్య కళాకారులు హేమమాలిని, వైజయంతి మాల, కూచిపూడి కళాకారులు స్వప్న సుందరి, జానపద నృత్యం కోసం వేదాంతం రామలింగంశాస్త్రి, ఒడెస్సీ నర్తకులు సుజాతా మహాపాత్రా ఎంపికయ్యారు. కాలమండలం జిష్ణుప్రతాప్ కేరళ కొడియాట్టం ప్రదర్శన ఇస్తారు.

ఏ సంప్రదాయమైనా, ఏ కళారూపమైనా అందులో ఉండేది రామాయణ ఇతివృత్తమే. ఆ పురాణ గాథలే ప్రదర్శిస్తారు, ఆలపిస్తారు. బాలుడిగా రాముని లీలలు, ఆయన ధర్మ నిష్ఠ, పాలకునిగా ఆయన ప్రతిభ వంటివి ఉన్నాయి. హేమమాలిని ప్రదర్శించిన రామలల్లా ఇలాంటిదే. శ్రీమద్ దశరథ్ నందన్ రామ్, రఘుపతి రాఘవ రాజారామ్, శ్రీరామచంద్ర కృపలు అలాంటివే. సీతా హరణ్, రావణ వధ, రామ పట్టాభిషేకం అవే అంశంతో సాగాయి.

– జాగృతి డెస్క్

**తెలంగాణలో గడిచిన పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఒక్కొక్కటిగా బయటకు వస్తోంది. నిబంధనలు అమలు చేయకుండా, మార్గదర్శకాలను పాటించకుండా, చివరకు న్యాయస్థానం ఆదేశాలు కూడా బేఖాతరు చేసి ఇష్టారాజ్యం పాలన సాగించిన వ్యవహారం చర్చనీయాంశమవుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా అనేక లొసుగులు బయటపడుతున్నాయి. ముఖ్యంగా ఆర్థికపరమైన అంశాలకు సంబంధించి, నిధుల విషయంలో ఏ మాత్రం జవాబుదారీతనం లేకుండా వ్యవహరించిన తీరుకు సంబంధించిన గుట్టు అంతా బయటకు వస్తోంది. టీఎస్ బీపాస్ పేరుతో తెచ్చిన పోర్టల్ విషయంలోనూ అంతా లోగుట్టుగానే సాగిన వ్యవహారం బట్టబయలయ్యింది.**

# బీపాస్: 'బైపాస్'..వందలాది ఫైళ్లు

తెలంగాణలో భవన నిర్మాణాల అనుమతుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ బీపాస్ పేరుతో ఓ పోర్టల్‌ను అమలులోకి తెచ్చింది. అవసరార్థులు ఆ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించారు. నిర్ణీత ఫీజులు కూడా చెల్లించారు. కానీ, బీపాస్ పోర్టల్ కాస్తా.. బైపాస్‌లాగా మారిపోయింది. వాస్తవానికి భవన నిర్మాణాలకు పారదర్శకంగా అనుమతులు ఇచ్చేలా, ఆన్‌లైన్‌లోనే అనుమతులు వచ్చేలా ఆ ప్రభుత్వం టీఎస్ బీపాస్‌ను అమలులోకి తెచ్చింది. కానీ, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకున్నప్పటికీ.. అనుమతులు మాత్రం అధికారులు ఆఫ్‌లైన్‌లోనే ఇచ్చేసిన బండారం బయటపడిండి. టీఎస్‌బీపాస్ పోర్టల్‌లో సరైన పత్రాలు అప్‌లోడ్ చేయకున్నా అనుమతులు ఇచ్చిన విషయం బయటకు వచ్చింది. కానీ, ఆన్‌లైన్‌లో ఆ



శివబాలకృష్ణ

ఫైళ్లు నమోదు కాలేదు. అంతేకాదు.. పర్మిషన్లు ఇచ్చినవ్పటికీ.. ఆఫ్‌లైన్‌లోనూ ఆ ఫైళ్లు భద్రపరచలేదు. ఈ దందాలో పేరున్న రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు, బహుళ అంతస్తులకు సంబంధించిన ఫైళ్లే ఎక్కువగా ఉన్నాయి. వీటన్నింటికీ అక్రమంగా అనుమతులు ఇచ్చినట్లే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో, కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. విజిలెన్స్ విచారణకు అనుమతించింది. అయితే, ఈ దందాలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాత్ర ఉన్న హెచ్ఎండీఏ, గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు వేగవంతంగా, పారదర్శకంగా ఆన్‌లైన్‌లోనే ఇచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఈ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. తద్వారా సత్వరమే నిర్మాణ అనుమతులు పొందడంతోపాటు దరఖాస్తు ఏ అధికారి వద్ద ఉందో ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం కల్పించామని; 21 రోజుల్లో అనుమతులు వస్తాయని, అలా నిర్ణీత సమయాన్ని దాటి దరఖాస్తు ఆగితే.. ఆ అధికారికి జరిమానా విధించేలా కూడా చట్టాన్ని రూపొందించామనీ అప్పటి ప్రభుత్వం వెల్లడించింది. ప్రకటించి నట్లుగానే.. అలక్ష్యం వహించిన కొన్ని కేసుల్లో అప్పట్లో కొందరు అధికారులకు జరిమానాలు కూడా విధించారు. ముఖ్యంగా 100 నుంచి 500 చదరపు గజాలలోపు స్థలంలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించని అధికారులపై ఈ జరిమానాలు విధించారు. అయితే, ఏడు అంతస్తుల నుంచి 58 అంతస్తుల వరకు భవన నిర్మాణ అనుమతులు పొందిన ఫైళ్లను మాత్రం అత్యధికం ఆఫ్‌లైన్‌లోకి మార్చేశారు. దరఖాస్తులు చేసిన దగ్గర్నుంచి అనుమతులు ఇచ్చే దాకా అన్నింటినీ ఈ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా అవకతవకలను అరికట్టవచ్చన్నది అసలు లక్ష్యం. కానీ, నిబంధనల ఉల్లంఘనకు అలవాటుపడిన కొందరు.. టీఎస్ బీపాస్‌ను బైపాస్ చేసి ఆఫ్‌లైన్‌లో అనుమతులు పొందారు. ఈ వ్యవహారానికి అధికారులు, సిబ్బంది సహకరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా ఫైళ్లను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా మాయం చేశారు. వందలాది దరఖాస్తులను, ప్రధానంగా బహుళ అంతస్తుల భవనాల దరఖాస్తులన్నింటినీ ఆఫ్‌లైన్‌లోకి మార్చేసి, అనుమతులిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. బడా రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లకు చెందిన కీలక ఫైళ్లు ఇలా మాయమయ్యాయి. ఈ వ్యవహారం తెలియడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసిన తర్వాత రెవెన్యూపరమైన అంశాలను పరిశీలించే తహశీల్దార్ స్థాయిలోనే ఫైళ్లను ఆఫ్‌లైన్‌లోకి మార్చేశారన్న ఆరోపణలున్నాయి. టీఎస్ బీపాస్ అమలులోకి రాకముందు మాదిరిగానే దరఖాస్తులను ఇష్టారీతిన క్లియర్ చేశారు. ఆఫ్‌లైన్ కావడంతో సరైన పత్రాలు లేకపోయినా నిబంధనల్ని ఉల్లంఘిస్తూ ఉన్నతాధికారులు సంబంధిత ఫైళ్లను తెప్పించుకున్నారు. సరైన పత్రాల్లేవని కిందిస్థాయి అధికారులుఫైలును నిలిపివేసినా, అప్పటి హెచ్ఎండీఏ డైరెక్టర్ శివబాలకృష్ణ తమకు పంపించాలంటూ ఆదేశాలిచ్చారని కొందరు కిందిస్థాయి అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. అంతేకాదు.. మంత్రి చెప్పారంటూ ఆగమేఘాల మీద

సుజాత గోపగోని, 6302164068




# మాయం

ఆ ఫైళ్లకు అనుమతులిచ్చినట్లు చెప్పుకుంటున్నారు. శివబాలకృష్ణ ఇటీవల ఏసీబీ దాడుల్లో దొరికి, అక్రమాస్తుల కేసులో చిక్కుకొని రిమాండ్‌లో ఉన్న విషయం అందరికీ తెలిసిందే.

అన్నిరంగాల్లో మాదిరిగానే, ప్రభుత్వ పాలనలోనూ, పాలనా వ్యవహారంలోనూ మార్పులు వచ్చేశాయి. సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. అందుకే ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అనుమతుల ప్రక్రియకు సంబంధించి ప్రత్యేకంగా పోర్టల్‌ను రూపొందించింది. కానీ, కొందరు అధికారులు మాత్రం ఆ ఆన్‌లైన్ పద్ధతిని మళ్లీ పాత పద్ధతిలోకి అంటే ఆఫ్‌లైన్‌లోకి మార్చేశారు. ఒకవేళ అవసరాన్ని బట్టి, పరిస్థితులను బట్టి ఆఫ్‌లైన్‌లో అప్పటికప్పుడు అనుమతులు ఇచ్చినప్పటికీ.. తిరిగి ఆ ఫైళ్లకు సంబంధించిన డాక్యుమెంట్లు అన్నింటినీ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తే రికార్డు చెక్కుచెదరకుండా ఉండే అవకాశం ఉంటుంది. కానీ, ఆఫ్‌లైన్‌లో అనుమతులిచ్చిన ఏ ఒక్క దరఖాస్తునూ ఆన్‌లైన్‌లోకి మార్చలేదని పోర్టల్‌ను పరిశీలిస్తే అర్థమవుతోంది.

ఇటీవల వరుసగా హెచ్ఎండీఏలో ఏసీబీ సోదాలు, వివిధ భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్లు, చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ అనుమతులపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే వివిధ రకాల అనుమతులపై ఏ రోజుకారోజు నివేదికలు అడుగుతోంది. కానీ, చాలావరకు ఫైళ్లు హెచ్ఎండీఏలో మాయమైనట్లు చెబుతున్నారు. అయితే ఇటీవల ఏసీబీ సోదాల్లో శివబాలకృష్ణ పనిచేసిన మాసబ్‌ట్యాంక్‌లోని రెరా ఆఫీసులో పలు హెచ్ఎండీఏ ఫైళ్లు బయటపడినట్లు సమాచారం. ఈ క్రమంలో కొన్ని ఫైళ్లను మాత్రం అధికారులే మాయం చేశారన్న ఆరోపణలున్నాయి. శివబాలకృష్ణ చేసిన తప్పిదాల మకిలి తమకు కూడా అంటుకుంటుందన్న ఉద్దేశంతో.. కొందరు అధికారులు ఇటీవల ప్రభుత్వం అడిగిన నివేదికల్లో సమాచారం లేదని చెప్పినట్లు తెలిసింది. సంబంధిత ఫైళ్లను తాము అప్పట్లోనే డైరెక్టర్ శివబాలకృష్ణకు పంపామని, ఆ తర్వాత సంబంధిత ఫైళ్లు తిరిగి వెనక్కి రాలేదని బదులిచ్చినట్లు సమాచారం.

మరోవైపు.. పేరున్న, విలువైన ఐటీ కారిడార్‌లో భారీ ప్రాజెక్టులు చేపడుతున్న పలు సంస్థలు.. తాము చేసిన దరఖాస్తులకు సంబంధించిన అనుమతులన్నీ ఆఫ్‌లైన్‌లోనే పొందాయి. కానీ, ఆయా సంస్థల ఫైళ్లు పునఃపరిశీలించాలంటే మాత్రం హెచ్ఎండీఏ ఫైళ్ల భాండాగారంలో దొరకడం లేదు.

అంతేకాదు.. 111 జీవో పరిధిలోని వట్టినాగులపల్లికి సంబంధించిన ఫైళ్లు కూడా ఇలాగే మాయమైనట్లు చెబుతున్నారు. వట్టినాగులపల్లిలోని 100 నుంచి 200 ఎకరాల భూములను బయో కన్జర్వేషన్ జోన్ నుంచి మల్టీపర్పస్ జోన్‌లోకి మార్చేందుకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఆగమేఘాల మీద చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ అనుమతులు ఇచ్చింది. ఈపీటీఆర్ఐ నివేదిక ఆధారంగా ఆ మార్పు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఈపీటీఆర్ఐ నివేదికను హెచ్ఎండీఏలోని ఏ ప్లానింగ్ అధికారి కూడా చూడలేదని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంబంధిత ఫైళ్లు రావడంతో జీ హుజూర్.. అంటూ కిందిస్థాయి అధికారులు ఉన్నత స్థాయికి పంపారు. సంబంధిత శాఖ మంత్రి ఆమోదంతో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ చేశారు. కానీ, సంబంధిత ఫైళ్లు, ఈపీటీఆర్ఐ నివేదికలన్నీ మాయమైనట్లు తెలుస్తోంది. ఈ తతంగాలపై కాంగ్రెస్ ప్రభుత్వం కన్నెర్ర చేస్తోంది. పాలనావ్యవస్థను గాడిలో పెట్టాల్సిన ప్రభుత్వ పెద్దలే ఇష్టారీతిన ప్రభుత్వ పాలనను వ్యాపారంగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ మొత్తం వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మరి.. విజిలెన్స్ విచారణ తర్వాత ఏమేం భయంకర వాస్తవాలు బయటకు వస్తాయో, లేదంటే.. ఒత్తిళ్లకు తలొగ్గి ఏమీ లేదని తేలుస్తారో చూడాలి.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**



కథ

# జంగి

ఉదయం పది దాటింది. పిల్లలు బడికి, పెద్దలు పనికి చేరిపోయారు.

కోళ్లు పిల్లలను వెంటేసుకుని పురుగూ, పుట్రా వేటకై పెంటల మీద పడ్డాయి. వీధి కుక్కలు చట్టి మెతుకుల కోసం కాచుకొని తిరుగుతున్నాయి. గూట్లో ఉన్న చిట్టి పిట్టలకు ఆహారం వెతుకుతూ, చెట్టూ పుట్టా గాలిస్తున్నాయి తల్లి పిట్టలు. సూర్యుడు ఎర్రగా నిగనిగలాడుతూ తూర్పున మండుతున్నాడు. బర్రెలన్నీ మూగబోయి ఊరి బయట దొడ్డిలో నిలబడ్డాయి. అంతలోనే దొడ్డిని మూసి ఉన్న పలగడి తెరచి 'సా... త్ర్వ... స్ర్వే...' అంటూ నాగయ్య కట్టెతో అదిలించడంతో బర్రెలన్నీ ఆ చిన్న వలగడి ద్వారం నుండి బయటకు నడిచాయి. ప్రతిరోజూ అదే సమయానికి బయల్దేరుతుందా జంగిడి. గ్రామంలో ఉన్న అందరూ తెల్లవారక ముందే పాలు పిండి, తర్వాత వారి వారి బర్రెలను ఆ పెద్ద దొడ్డిలోకి చేరుస్తారు. వాటి సంఖ్య ముప్పైకి పైనే ఉంది.

చద్ది కట్టుకున్న డబ్బాను ఒక తువాలులో మూట గట్టుకొని నాగయ్య భుజానికి వేలాడేసుకున్నాడు. మాసి మాయని తెల్లని ముతక అంగీ, మోకాళ్ల మీదికి కట్టిన పలచని పంచె. అరవై ఏళ్లపై వయస్సులో పదవీ విరమణ అనే పదం తెలియకుండా రోజూ ఉదయాన్నే జంగిడితో బయల్దేరడమే ఆయన పని. రోడ్డు పక్క వెంబడి బర్రెలు నడుస్తుంటే, వాటి వెనకే నాగయ్య నడిచాడు. అంతలోనే నాగయ్యకు జత కలిశాడు లింగయ్య.

"ఇయ్యాల ఆలస్యమాయనేం లింగా??" అడిగాడు నాగయ్య.

"ఈ కండ్లు మసకలాయే. సరిగ్గా గనపడక ఏ పని జేనా సూసి సూసి జెయ్యవలసొస్తుంది నాగయ్య. ఎవరికి జెప్పుకోవాలే నా గోస. పా.. పా.. ఎండ మాడును దంచుతుంది" అంటూ వేగం పెంచాడు లింగయ్య.

లింగయ్యది కూడా నాగయ్య వయస్సే. అదే పంచె కట్టు, అదే ముతక అంగీ ఇద్దరి తీరు ఒకేలా ఉంది. కానీ నాగయ్య సన్నగా పొట్టిగా ఉన్నాడు. లింగయ్య నాగయ్య కన్నా ఎత్తుగా, బలిష్టంగా, నల్లగా ఉన్నాడు. ఇద్దరూ వారికి పదేళ్లున్నప్పటి నుండీ ఆ ఊరి జంగిడిని మేపే పనిలోనే ఉన్నారు. అప్పట్లో బర్రెకు సంవత్సరానికి కొంత ధాన్యం అనే లెక్కతో ఆ జంగిడిని మేతకు తీసుకు వెళ్లే వారు. ఇప్పుడు ధాన్యానికి బదులుగా ధనం ఇస్తున్నారు. లోకం విలువతో పోల్చి చూస్తే అవి ఎక్కువేం కాదు. కానీ ఇచ్చే కొన్ని డబ్బులే తీసుకొని జంగిడిని మేతకు తీసుకెళ్తున్నారు.

రోడ్డు మీద వచ్చే వాహనాలకు ఇబ్బంది కలగకుండా మంద పక్కన లింగయ్య వెళ్తుంటే, మంద వెనక నాగయ్య వెళ్తున్నాడు. 'త్ర్వ... హెయ్...' అంటూ, ఇద్దరూ కట్టెలతో ఆదిలిస్తూ రోడ్డు పక్కన ఉన్న ఓ మట్టి బాటలోకి జంగిడిని మళ్ళించారు.

తర్వాత ఓ పెద్ద గడ్డి మైదానంలోకి వాటిని చేర్చారు. అదంతా వ్యవసాయానికి వీలు లేని ప్రాంతం. ఆ గడ్డిలో బర్రెలన్నీ నిదానంగా మేయడం మొదలు పెట్టాక, ఇద్దరూ ఆ పక్కనే ఉన్న ఓ పెద్ద మోదుగు చెట్టు కింద కూర్చొని, ఊర్లో జరుగుతున్న విషయాలేవో మాట్లాడుకుంటూ ఉన్నారు. ఆ మోదుగు చెట్టు పక్కనుండే ఓ చిన్న పిల్ల కాలువలో ప్రవహిస్తున్న నీళ్ల శబ్దంతో, కొంత దూరంలో రోడ్డుపై నుండి వెళ్తున్న వాహనాల శబ్దం శ్రుతి కలిపింది.



సూర్యుడి వేడి మోదుగు నీడను కదవలేకపోయింది. అదే సమయంలో చిన్నగా వీస్తున్న పిల్లగాలికి ముచ్చట్ల మధ్యలోనే కునుకులోకి జారుకున్నాడు నాగయ్య. లింగయ్య మాత్రం ఏదో ఆలోచిస్తూ అలాగే కూర్చున్నాడు. అంతలోనే పెద్దగా హారన్ శబ్దం!! ఏ బస్సో, లారీయో? నాగయ్య నిద్ర తేరుకొని చూశాడు. లింగయ్య నడుస్తూ రోడ్డు వైపు వెళ్లడం కనిపించింది. మళ్లీ కళ్లు మూసుకున్నాడు.

లింగయ్య రోడ్డు పైకి చేరేటప్పటికి రోడ్డు మీద కొన్ని వాహనాలు అగి ఉన్నాయి. ఏం జరిగిందా? అని లింగయ్య దగ్గరికి వెళ్లి చూస్తుండగా ఓ కారు మెల్లగా రోడ్డు దిగి మిగిలిన వాహనాలకు దారి ఇవ్వడం కనిపించింది. మిగిలిన వాహనాలన్నీ వెళ్లిపోయాయి. అప్పుడు అక్కడ ఆగిన కారులో నుండి ఒక ముసలాయన దిగి లింగయ్య వైపే చూశాడు. మసక కళ్లతో ఆయనను పరికించి చూశాడు లింగయ్య. ఆయన వయస్సు లింగయ్య వయస్సు కన్నా పైనే ఉంటుంది. సాదా అంగీ, వదులుగా ఉన్న ప్యాంటు, మంచి కళ్లద్దాలు, నున్నటి నెత్తి, కాళ్లకు బూట్లు, చేతికి గడియారం బాగా ఉన్న వాడే అనుకొని,

"ఏందయ్యా... రోడ్డు మధ్యల బండినట్ల నిలబెడి తిరి? ఎనక నుండి ఆ లారీ తగిలితే ఏమైతుండే?" అడుగుతూ దగ్గరికి చేరాడు లింగయ్య.

"నేను ఆపకపోతే, ఒక కుందేలు పిల్ల రక్తంతో ఈ రోడ్డు మీద పడి ఉండేది పెద్దమనిషి" అన్నాడా పెద్దాయన.

"ఏ ఊరయ్యా మీది? ఒక్కరే ఉన్నట్టున్నరు!" అని లింగయ్య అడుగుతుంటే, కారులో నుండి కెమెరా తీసుకుంటూ, "మాది హైదరాబాద్" అన్నాడాయన.

"ఏదైనా పని మీద వచ్చింద్రా ఇంత దూరం?"

"ఏ పనీ పాట లేక వచ్చానయ్యా!"




రంజిత్ గన్నోజు

"అదెట్ల?"

"పద. ఫోటోలు తీసు కుంటూ మాట్లాడుకుందాం" అని రోడ్డు మీది నుండి దూరంగా కనిపించిన అంగిడి వైపు నడిచాడాయన. లింగయ్య కూడా వెనకే నడిచాడు. ఇద్దరి నడకల్లోనూ నిదానముంది. ఎంతో దూరం ప్రయాణం చేసిన జీవితపు భావముంది. ఇద్దరి ప్రయాణాలు వేరే., కానీ ప్రస్తుతం నడుస్తుంది మాత్రం ఒకే దారిలో! అంతలోనే వాళ్ళకి ఎదురొచ్చిన నాగయ్య,

"ఏమైంది లింగ, ఏందా చప్పుడు? ఏవన్నా గుద్దుకున్నయా ఏంది?" అని ఆ కెమెరా పెద్దాయన వైపు తదేకంగా చూస్తూ అన్నాడు.

లింగయ్య నుండి సమాధానం రాక ముందే, "మీరిద్దరేనా ఈ పశువుల కాపరులు?" అడిగాడు కెమెరా పెద్దాయన.

"అవునయ్యా" అంటూ తలూపాడు నాగయ్య.

"అయితే నన్ను గుర్తుపట్టలేదా మీరు?"

నాగయ్య, లింగయ్య ఆయోమయంగా ఒకరి ముఖాన్ని ఒకరు చూసుకున్నారు.

"సుమారు నలభై సంవత్సరాల క్రితం, మిమ్మల్ని ఇక్కడే నేను ఫోటో తీశా. అప్పుడు ఈ మందలో బర్రెలు సూటాయాభైకి పైనే ఉన్నాయి. ఇప్పుడు ఓ ముప్పై ఉన్నట్టున్నాయి. అంతేనా నాగయ్య, లింగయ్య" అన్నాడు కెమెరా పెద్దాయన.

"అర్రే, మీరా..! ఇన్నేండ్లకు మళ్లా కనబడ్డరు!! నేను అప్పటి సంది గుర్తుబట్టనే లేదు" ఆశ్చర్యంగా అన్నాడు లింగయ్య.

"అవును లింగ. నేను గూడ గుర్తుబట్టలేదు" అని నాగయ్య అంటూ ఉండగానే,

"మీరు మళ్లీ కనబడతారని ఊహించనేలేదు. అదీ కాక మీరు కాపరితనం మానలేదు. నేను కెమెరా వ్యాపకం మానలేదు" అని నవ్వేసి, "సరే నిలబడండి, ఒక ఫోటో తీస్తా మీ ఇద్దరినీ" అన్నాడు కెమెరా పెద్దాయన. వెంటనే ఇద్దరూ పక్క పక్కన నిలబడ్డారు. వాళ్లకి ఫోటోలు ఎలా దిగాలో తెలియదు. వెనక జంగిడిలోని బర్రెలు ప్రకృతిలో మమేకమై ఎలా నిలబడ్డాయో, ఆ వెనక చెట్లు, చిన్న చిన్న కొండలు ప్రసన్నంగా ఎలా ఉన్నాయో, ఏదీ పట్టక పైన ఎగురుతూ వెళ్తున్న కొంగల గుంపు ఎంత నిర్మలంగా ఉందో... వారి స్నేహం అంతే సహజంగా, అంతే అందంగా కెమెరాలోకి చేరిపోయింది.

"ఫోటోలో పడ్డారయ్యా ఇద్దరూ" అన్నాడు కెమెరా పెద్దాయన.

"ఏదీ... చూపండి!" నాగయ్య, లింగయ్య ఒకేసారి అడిగారు.

"తొందర పడకండి. అప్పుడు తీసిన ఫోటో, ఈ ఫోటో కలిపి చూద్దురు. మళ్ళీ తొందరలోనే రెండూ తీసుకొని వస్తా"

"అట్లనే గానీ, అన్నం దింటరా" ఆప్యాయంగా అడిగాడు లింగయ్య.

"మన సద్ది ఆయనకు గొంతు దిగదు" అని లింగయ్యకు చెప్తూ, "ఈడ నుండి పది కిలోమీటర్లు పోతే, హోటళ్లుంటవి. అడ బాగుంటది. మీరు అడికి పోయి తినండి" అని కెమెరా పెద్దాయన వైపు చూసి అన్నాడు నాగయ్య.

"అయితే మీరు కూడా రండి. ముగ్గురం వెళ్లి అక్కడే తిందాం"

"అయ్యో. మాకు మా సద్ది ఉన్నదయ్యా!" అన్నాడు లింగయ్య.

"అయితే అందులోదే నాకూ కొంచెం పెట్టండి" అని కెమెరా పెద్దాయన అనగానే, అక్కడే ఉన్న మోదుగు చెట్టు ఆకులు తెంచి విస్తరి కుట్టాడు నాగయ్య. దానిని పిల్ల కాలువలో కడుక్కొని వచ్చి, అందులో వారిద్దరి చద్ది డబ్బాలలో ఉన్న అన్నం, పచ్చడి, కారం పెట్టారు. ముగ్గురూ కబుర్లు చెప్పు కుంటూ తినేశారు. సంతోషంగా కెమెరా పెద్దాయన వెళ్లిపోయాడు.

మూడు రోజుల తర్వాత...

కారు వచ్చి ముందు ఆగిన చోటే ఆగింది. కానీ ఈసారి కెమెరా పెద్దాయనతో పాటు వాళ్ల మనవడు కారు నడుపుతూ వచ్చాడు. పెద్దాయన చేతిలో అందమైన పూల తీగల అచ్చుతో ఉన్న కాగితపు కవరుంది. అది తీసుకొని వేగంగా జంగిడి ఉండే చోటుకు నడిచాడు పెద్దాయన. వెంటే ఆయన మనవడు కూడా వెళ్లాడు. ముందులాగే బర్రెలు గడ్డి మేస్తూ ఉన్నాయి. నాగయ్య మోదుగు చెట్టు కింద కూర్చొని ఉన్నాడు.

"ఓ నాగయ్యా... ఇదిగో మీ ఫొటోలు తీసుకొచ్చా" దూరం నుండే కేక వేశాడు కెమెరా పెద్దాయన. అది విన్న నాగయ్య లేచి నిలబడ్డాడు. పెద్దాయన వేగంగా దగ్గరికి వెళ్లి తను తెచ్చిన ఫోటోల కవరు నాగయ్య చేతికిచ్చాడు. నాగయ్య ఆ కవరు తెరిచి ఫోటోలు చూశాడు. ఒకటి అప్పటి బ్లాక్ అండ్ వైట్ ఫోటో, ఇంకోటి మొన్న తీసిన కలర్ ఫోటో బ్లాక్ అండ్ వైట్ ఫోటోలో చాలా బర్రెల ముందు ఓ ఇరవై ఏళ్ల ఈడున్న నాగయ్య, లింగయ్య. కలర్ ఫోటోలో కొన్నే బర్రెల ముందు అరవై ఏళ్ల ముసలి వాళ్లుగా ఉన్నారు. కానీ వారి మధ్య స్నేహం మారలేదు. నాగయ్య కళ్లల్లో ఒక్కసారిగా ఆ అరవై ఏళ్ల జీవితం కదలాడింది. అతడి గుండె కదిలింది. కళ్లు చెమర్చాయి. అదంతా తన్మయత్వంతో గమనించిన కెమెరా పెద్దాయన ఆ అపూర్వ నిశ్శబ్దాన్ని నడలిస్తూ,

"లింగయ్య ఎక్కడున్నాడు నాగయ్యా?" అని అడిగాడు.

"అగో, ఆ కాలువ గట్టు అవతల ఉన్నడు. పోదం పాండి" అని కళ్లు తుడుచుకొని ముందుకు నడిచాడు నాగయ్య. కెమెరా పెద్దాయన, ఆయన మనవడు వెనకే నడిచారు. బర్రెలను దాటి కొంత ముందుకు వెళ్లాక అక్కడ ఇంకా తడారని ఎర్రమట్టి దిబ్బ దగ్గరికి వెళ్లి ఆగి, ఫోటోలు రెండూ దాని మీద పెట్టాడు! కెమెరా పెద్దాయనకు విషయం అర్థం అయ్యింది.

"ఎప్పుడు జరిగింది నాగయ్యా? ఏమయ్యింది?" అడిగాడు కెమెరా పెద్దాయన.

"మీరు వచ్చి పోయిన తెల్లారేనయ్యా. రెండేండ్ల సంది వానికి కంటి సూపు తగ్గింది. నిన్న మొన్న అంగ అస్సలే కనిపించకుండయ్యింది. కండ్లద్దాలకని



దావఖానకు తిరిగిండు గానీ ఆపరేషన్ జేస్తే గానీ అద్దాలు గూడ కుదరవని జెప్పిండ్రు. ఆపరేషన్‌కు పైసలెక్కడివి? కానీ ఏదో క్యాంపు పద్దప్పుడు పైసలు లేకుండా ఆపరేషన్ జేస్తమని ఆ దావఖాన వాళ్లే జెప్పిండ్రు" దీన స్వరంతో పలికాడు నాగయ్య.

"మరి క్యాంప్ పెట్టలేదా?" అడిగాడు కెమెరా పెద్దాయన.

"వచ్చే నెల ఉంటదన్నరు. ఇంతలనే ఇట్లాయే!"

"అసలు ఏమయ్యింది?"

"మాపటి పూట ఇంటికాడ కట్టెలు గొడుతుంటే గొడ్డలి దెబ్బ కుడి కాలు మీద పడ్డది. బాగనే తెగింది. నొప్పికి ఓర్చుకోలేక అడనే పొదల చాటున కింద పడ్డాడంట. పడంగనే నడుములో కట్టె దిగింది. అప్పుడాడ ఎవ్వరు లేకుండే! వానికి లేవ చేత గాలే, మతి దప్పింది. రక్తం మొత్తం పోయింది. దావఖానకు తీస్కపోయే సరికే పాణం లేదు" అని అక్కడే కూలబడి, ఆ ఫోటోల్లోని లింగయ్యను తదేకంగా చూశాడు. కెమెరా పెద్దాయన నోట మాట రాలేదు. కాసేపు బాధతో అక్కడే నిలబడి, నాగయ్య భుజం తట్టి, ఏం మాట్లాడాలో తెలియక తిరిగి మనవడితో కలిసి వెనక్కి నడిచాడు.

కారు హైదరాబాద్ వైపు సాగింది. మనవడు కారు నడుపుతుంటే, కెమెరా పెద్దాయన పక్క సీటులో దిగులుతో కూర్చొని నిశ్శబ్దంగా బయటికి చూశాడు.

"ఏంటి తాతయ్యా? అలా ఉన్నారు! వెళ్లిపోయిన ఆ పెద్దాయనని తిరిగి తేలేం కదా"

"అవునురా తేలేము. కానీ వాళ్లని మొదటిసారి కలిసిన రోజుకి, మొన్న కలిసినప్పటికి తేడా ఏముందా? అని ఆలోచిస్తుంటే ప్రాణం అదిరిపోతుంది"

"ఎందుకంతగా ఆలోచిస్తున్నారు తాతయ్య. మీకు ముందే హార్ట్ సర్జరీ కూడా అయ్యింది. ప్రశాంతంగా ఉండండి"

"నాకు హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు ఓ పెద్ద హాస్పిటల్ లో సర్జరీ జరిగింది. మరోసారి వచ్చినా ఇంకా పెద్ద హాస్పిటల్ కి వెళ్లొచ్చన్న ధైర్యం ఉంది. కానీ లింగయ్య కళ్లకు ఆపరేషన్ చేయించుకోలేక పోయాడు. కళ్లు కనిపించకున్నా తన పని మానలేదు. తీరా చచ్చిపోయాడు"

"అవును తాతయ్య. తలుచుకుంటూ ఉంటే బాధగా ఉంది"

"నేను మొదటి ఫోటో తీసిన రోజు వాళ్లు ఎలా ఉన్నారో, మొన్న కలిసినప్పుడు కూడా అలాగే ఉన్నారు. వాళ్లకీ లోకంతో సంబంధం లేదు. డబ్బుతో అవసరం లేదు. ఏదో సాధించాలన్న తపన లేదు. చివరికి వాళ్లకేమైనా అయితే దానితో ఇబ్బంది పడుతూ బ్రతకడానికి అలవాటు పడతారు. కానీ దానిని బూతద్దం పెట్టి చూడరు"

"అయితే, అన్నిటికన్నీ ఉన్న మన ఆలోచన సరైందా లేక ఏమీ లేకున్నా బ్రతికేస్తున్న వారి ఆలోచన సరైందా?"

"నేను ముంబాయ్ లో ఉద్యోగం చేశా. అమెరికా వెళ్లొచ్చా. తర్వాత ఢిల్లీలో ఉద్యోగం, ఆ తర్వాత రిటైర్మెంట్. వాటితో పాటు నేను చాలా మారా. ఈ నా జీవిత ప్రయాణం నాకు ఎంతో నేర్పించింది. నలభై ఏళ్ల క్రితం నాతో ఉన్న కెమెరా ధర ఐదు వందలు. నాకు ఫోటోగ్రఫీ మీదున్న వ్యామోహాన్ని చూసి, నేను డిగ్రీ ఫస్ట్ క్లాస్‌లో పాసైనప్పుడు మా నాన్న కొనిచ్చాడు. ఇప్పుడు నాతో ఉన్న కెమెరా ధర లక్షల్లో ఉంటుంది. నేను అప్పటి నుండీ ఇప్పటి దాకా ఎప్పటికప్పుడు మారుతూనే ఉన్నా. కానీ వాళ్లు అదే జంగిడితో ఇన్నేళ్లు ప్రయాణం చేస్తూ ఉన్నారు. మనిషి సాంకేతికతతో తయారు చేసిన ఒక కెమెరా శ్రేష్ఠత పెరుగుతూ వచ్చింది. దానితో పాటు ధర కూడా పెరిగింది. వాటిని కొనుక్కునే స్తోమత నాతో ఉంది. కానీ తగ్గుతున్న కంటి చూపుకు ఆపరేషన్ చేసే సాంకేతికత ఉన్నప్పటికీ, ఆ స్థాయిని అందుకోలేని విధంగా నలభై యాభై ఏళ్లుగా ఇలాంటి వ్యక్తులు ఒకేలా ఉన్నారు. వారి ఆదాయం పెద్దగా మారింది లేదు. అందుకే మనుషుల ఆలోచనతో పాటు బ్రతికే విధానంలో కూడా మార్పు రావాలేమో రా!!"

"అంటే తప్పు వాళ్లదేనా తాతయ్యా!"

"కాదురా., వ్యవసాయం నడవాలి. పశుసంపద ఎప్పుడూ తగ్గొద్దు. అలాగని సాంకేతికత ప్రభావం వాటి మీద చెడుగా పడకుండా ఉండాలి. అప్పుడే ప్రకృతి సమతుల్యంగా ఉంటుంది. ఆ విధంగా సమాజం సర్దుకుంటూ ఉండాలి. నూటాయాభై బర్రెలున్న జంగిడి, ముప్పై బర్రెలతో చిన్నదై పోయింది. అంటే పశు సంపద ముందులా లేదు. అదే సాంకేతికతను చూస్తే ఇప్పుడెలా ఉందో చెప్పక్కర్లేదు. సాంకేతికతతో ముందుకు వెళ్తున్న ఈ కాలం మనుషులతో పోల్చి చూస్తే, ఆ బర్రెలతో మమేకమై, జంగిడి జీవితం గడిపిన వాళ్లిద్దరూ మాత్రం కచ్చితంగా ప్రత్యేకమే అనిపిస్తుంది రా!" అని ముగించాడు కెమెరా పెద్దాయన.

వచ్చేవారం కథ..

బఫూన్ - పుట్టగంటి గోపీకృష్ణ











శ్రీశైల మహాక్షేత్రంలో పునర్ నిర్మితమైన శివాజీ గోపురానికి ఫిబ్రవరి 21వ తేదీన మహాకుంభాభిషేకం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.  కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి కలశ ప్రతిష్ఠ చేశారు. హిందూ జీవనానికి సరికొత్త చైతన్యాన్ని తీసుకువచ్చిన ఛత్రపతి శివాజీ మహరాజ్ స్ఫూర్తి కేంద్రాన్ని 23న శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి సందర్శించారు. ఈ కార్యక్రమ చిత్రమాలిక.

# ‘హిందూ ఐక్యతకే సంఘ్ ఆవిర్భావం’

సమాజాన్ని ఐక్యం చేసేందుకే ఆర్‌ఎస్ఎస్ ఆవిర్భవించిందని పరమపూజ్య సర్ సంఘ్‌చాలక్ మోహన్‌జీ భాగవత్ అన్నారు. భాగ్యనగర్‌లో 17 ఫిబ్రవరి 2024న గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌ఎస్ఎస్ ఐటి మిలన్స్ పరివార్ సమ్మేళన్‌లో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

గతంలో బ్రిటిషు సహా ఏడు విదేశీ శక్తులు



మనపై అనేక దాడులు చేసి, మనల్ని బానిసలుగా చేశారని మోహన్‌జీ అన్నారు. మనలో ఉన్న అనైక్యతే దానికి దోహదం చేసిందన్నారు. అన్నింటినీ అధిగమించగల హిందుత్వ ఆధారంగా హిందూ సమాజాన్ని జాగృతం చేసి, వ్యవస్థీకరించేందుకే డా॥ హెడ్గేవార్ ఆర్‌ఎస్ఎస్‌ను ప్రారంభించారన్నారు.

జనవరి 22న అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ సందర్భాన్ని కులం, భాష, ప్రాంతం, రాజకీయ అనుబంధాలు వంటి అన్ని విభజనలను అధిగమించి ఉత్సవంగా జరుపుకున్నప్పుడు, హిందుత్వం వీటన్నింటినీ ఎలా అధిగమించగలదో మనకు ఒక సింహావలోకనం.

మనం నాగరికతలో వైవిధ్యాన్ని ఆమోదిస్తాం. ఇంతటి వైవిధ్యం, భిన్నత్వాలు ఉన్నప్పటికీ మన మంతా ఐక్యంగా ఉన్నాం, ఉంటాం కూడా. ఎందుకంటే, మనం హిందువులం కనుక. భిన్నత్వాన్ని ఆమోదించమని మన సంస్కృతి మనకు బోధిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం, త్యాగం, స్వీయ నియంత్రణ, కృతజ్ఞతా భావన, స్ఫూర్తి హిందూత్వ లక్షణాలు.

హిందూ దృష్టికోణంలో సమాజంలోని ప్రాథమిక యూనిట్ వ్యక్తి కాదు కుటుంబం. కనుక ‘వ్యక్తి వాదాన్ని’ వదిలి, అందరితో కలిసి సామరస్యంగా జీవించాలని మోహన్‌జీ విజ్ఞప్తి చేశారు.

భౌతికపరమైన విజయానికి మనం కృషి చేయవలసి ఉన్నప్పటికీ, అది అందరూ కోరుకునే శాశ్వతమైన ఆనందాన్ని అందించదు. నిజమైన ఆనందం అనేది కేవలం మన భౌతిక కోరికలను తీర్చుకున్నప్పుడు కాదు, మన చుట్టూ ఉన్న ప్రజల సంక్షేమంకోసం ఆ సంపదను వినియోగించినప్పుడే కలుగుతుంది.

స్త్రీ, పురుషుల మధ్య ఎవరు గొప్ప వారు అన్న వాదన అర్థరహితం, వారి ద్దరూ కూడా ఒకరి కొకరు పూరకం అని ఆయన స్పష్టంచేశారు. అనంతరం ‘మాతృ శక్తి’ని ‘సేవికాసమితి’తో కలిసి దేశ నిర్మాణ ప్రక్రియలో తమ తోడ్పాటును అందించమని సూచించారు. పిల్లలకు విద్యను గరిపే బాధ్యతను కేవలం పాఠశాలలకు మాత్రమే వదలవద్దని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. దేశం, సంస్కృతి పట్ల పిల్లల దృక్పథాన్ని మలచ దంలో కుటుంబం, సమాజం కీలక పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు. ఇంట్లో పిల్లలతో తప్పనిసరిగా మాతృభాషలోనే సంభాషించడం అలవాటు చేసుకోవాలని కోరారు. మనం ఈ మొత్తం ప్రపంచాన్ని కుటుంబంగా పరిగణిస్తాం కాబట్టి, ప్రపంచానికి సంతోషం, సంతృప్తులకు మార్గాన్ని భారతదేశమే చూపిస్తుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అథిగా హాజరైన కోఫాక్స్ ఇండియా ఎండి,జనరల్ మేనేజర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలలో, ముఖ్యంగా ఆర్థిక రంగం సహా అన్నిరంగాలలో భారత్ సాధించిన పురోగతిని కొనియాడారు. దేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చేందుకు కావలసిన అన్ని అంశాలూ ఇక్కడి ప్రజలలో ఉన్నాయని ఆయన అన్నారు. సామాజిక జీవితానికి సంబంధించిన అన్ని రంగాలలోనూ ఆర్‌ఎస్ఎస్, దాని అనుబంధసంస్థలు చేస్తున్న పనిని ఆయన కొనియాడారు.

పరివార్ సమ్మేళన్‌లో ఐటి మిలన్ స్వయం సేవకులు, బాలగోకులం శిక్షకులు తమ కుటుంబాలతో కలిసి పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సంఘచాలక్ నాగరాజ్, తెలంగాణ ప్రాంత సంఘచాలక్ సుందర్‌రెడ్డీ, సంభాగ్ సంఘ చాలక్ డా॥ కృష్ణ ప్రసాద్ కూడా పాల్గొన్నారు.

పురుషులు, 548మంది మహిళలు, 505 మొత్తం 1053 మంది పిల్లలు ఈ పరివార సమ్మేళనంలో పాలుపంచుకున్నారు. ★




విశ్వహిందూపరిషత్ అఖిల భారతీయ సంయుక్త మహామంత్రి కోటేశ్వర శర్మ, సత్సంగ్‌టోలి రాఘవులు, చెన్నై క్షేత్ర సంఘటన మంత్రి ఆకారపు కేశవరాజులకు అయోధ్య ప్రత్యేక సంచికను అయోధ్యలో ఫిబ్రవరి 21న అందిస్తున్న జాగృతి ప్రకాశన్ ట్రస్ట్ కార్యదర్శి పి.రాఘవేంద్ర.

# కదిరిలో సేవాభారతి సీతారాముల కళ్యాణం

**కదిరి :** సత్యసాయి జిల్లా కదిరి చుట్టుప్రక్కల 11 మండలాలకు సంబంధించిన 350 గ్రామాలలో గత 10 సంవత్సరాలుగా సేవాభారతి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. పేదరికాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ గ్రామాలలోని పాఠశాల విద్యార్థులకు ఉచిత బోధన తరగతులు, హోమియో చికిత్స కేంద్రాలు మొదలైనవి నిరంతరం నిర్వహిస్తున్నారు. వీటితోపాటు ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యం ద్వారా నైతిక విలువలను పెంపొందించడానికి ప్రతి గ్రామంలో భజనమండలి ఏర్పాటుచేసి వారానికి ఒకరోజు మందిరం కేంద్రంగా భజన జరిగే ఏర్పాటు సేవాభారతి ద్వారా నిర్మాణం కావడం విశేషం. 11మండల కేంద్రాలలో రైతు ఉత్పత్తి దారుల సంఘాన్ని ఏర్పరచి తద్వారా రైతులకు ఆర్థిక స్వావలంబనను సేవాభారతి కలిగిస్తున్నది. పై కార్యక్రమాలతోపాటుగా నెలకొకసారి గ్రామాల ప్రజలందరికీ ప్రముఖ వైద్యులతో శిబిరాన్ని కదిరిలో నిర్వహిస్తున్నారు. 8 సంవత్సరాల క్రితం కరవు ఏర్పడిన సందర్భంగా సేవాభారతి ద్వారా సుమారు 50 గ్రామాలకు పశుగ్రాసాన్ని అందించడంతోపాటు ట్యాంకర్స్ ద్వారా త్రాగునీటిని అందించింది. అలాగే ఈ మండలాలలోని గ్రామాల ప్రజలందరినీ ఒకచోట కలవడం ద్వారా పేద, ధనిక, కుల అంతరాలను తగ్గించి సమరసతను ఏర్పాటుచేసే దిశగా సంవత్సరంలో ఒకసారి కదిరి కేంద్రంలో రుద్రాభిషేకం, శివపార్వతి, కదిరి నరసింహస్వామి, శ్రీనివాస కళ్యాణోత్సవాలను ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క పేరుతో సేవాభారతి నిర్వహిస్తున్నది.

ఈ సంవత్సరం 20వ తేదీన టిటీడీ పురోహితుల ద్వారా శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఇందులో 280 గ్రామాల నుంచి ఆనందోత్సవాలతో ఆబాలగోపాలం పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు మార్గదర్శనం చేస్తూ సీతారాముల కళ్యాణాన్ని తిలకిస్తేనే ఇంటింటా సౌభాగ్యమని అన్నారు. శ్రీరాముడు మానవ రూపంలో ఉన్న మహావిష్ణువు, సీతాదేవి లక్ష్మీ స్వరూపిణి అన్నారు. సీతారాములు మనకు ఎప్పటికీ ఆదర్శమని పేర్కొన్నారు.






ఈ కార్యక్రమంలో టీటీడీ ఈ.ఓ. ధర్మారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, ప్రాంత సహకార్యవాహ యుగంధర్, ప్రాంత ప్రచారక్ ఆదిత్య, ప్రాంత సేవాప్రముఖ్ కేశవయ్య తదితరులు పాల్గొన్నారు. ★

# తెలంగాణలో నారీశక్తి సమ్మేళనాలు



**భాగ్యనగర్:** బండ్లగూడలోని కేకే కన్వెన్షన్‌లో ఫిబ్రవరి 25న జరిగిన మహిళా శక్తి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి, విశిష్ట అతిథి తథాస్తు కౌన్సిలింగ్ & ట్రైనింగ్ కన్సల్టెన్సీ వ్యవస్థాపకులు వనజారవి, వక్తగా సాహిత్యరత్న దేవరకొండ లలిత శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. సుమారు 1250 మంది హాజరయ్యారు.





**వరంగల్:** భద్రకాళి ఆలయం సమీపంలోని కీర్తి గార్డెన్స్‌లో ఫిబ్రవరి 25న ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ ఇందిర అధ్యక్షతన మహిళా శక్తి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ బోయినపల్లి రాధ, అతిథిగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవాహిక సిరిపల్ల వరలక్ష్మి వక్తగా భారతీయం సత్యవాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో 800 మంది ఉపస్థితులైనారు.

# బాల జాగృతి

## తెలుసుకుందాం
# లక్ష్మీనరసింహస్వామి ఆలయం - మంగళగిరి



ఏపీలోని గుంటూరు జిల్లా మంగళగిరిలో వెలసిన ఆలయమిది. దక్షిణ భారతదేశంలోనే ఎత్తైన గోపురాలలో ఒకటైన ఈ దేవాలయ గోపురాన్ని 153 అడుగుల (47 మీటర్లు) ఎత్తు, 49 అడుగుల (15 మీటర్ల) వెడల్పుతో పదకొండు అంతస్తులతో నిర్మించారు. దీనిని పాండవ అగ్రజుడు యుధిష్ఠిరుడు స్థాపించాడని చరిత్రను బట్టి తెలుస్తోంది. ఈ ఆలయ చరిత్ర గురించి బ్రహ్మ వైవర్త పురాణంలోనూ పేర్కొన్నారు.

## కథ
# గెలుపు గర్వం



ఒక గడ్డి మైదానంలో రెండు కోడిపుంజులు నివాసముండేవి.

ఒకరోజు అవి ఆ మైదానానికి యజమానిగా ఏదో ఒకటి మాత్రమే ఉండాలనుకున్నాయి. ఎవరు యజమానిగా ఉండాలో బల పరీక్ష ద్వారా తేల్చుకోవాలనుకున్నాయి.

రెండు పుంజులూ పోటీకి ఏర్పాట్లు చేసుకున్నాయి. ఒక మంచి ముహూర్తం చూసి యుద్ధానికి సన్నద్ధమయ్యాయి. ఆ పోటీలో గెలిచిన పుంజు యజమాని హోదాని పొందుతుంది.

పోరు మొదలైంది.. ఆ రెండు పుంజులలో ఒకటి అత్యంత బలమైనది. కాగా మరోటి కొంత బలహీనమైనది.

కొద్దిసేపటి తరువాత బలమైన పుంజును ఎదిరించలేని బలహీనమైన పుంజు ఓడిపోయానని ఒప్పేసుకుంది.

అంతే.. గెలిచిన కోడిపుంజుకు సంతోషంతో పాటు గర్వం కూడా కలిగింది.

"చూసావా మిత్రమా, ఇప్పుడిక ఈ మైదానానికి నేనే రాజును. నువ్వు నా బానిసవు. ఈ రోజు నుండి నేను చెప్పినట్టు నువ్వు వినాలి" అని పకపకా నవ్వింది. ఆ కోడిపుంజు అంతటితో ఊరుకోలేదు. తన విజయాన్ని అందరూ గుర్తించాలనీ,

## పద్యం

ఆజ్ఞ యొనర్చెడి వృత్తుల
లో జ్ఞానము గలిగి మెలఁగు లోకులు మెచ్చన్,
ప్రాజ్ఞతను గలిగి యున్నన్,
ప్రాజ్ఞులలోఁబ్రాజ్ఞుఁడవుగ ప్రబలు కుమారా!

భావం : ఓ కుమారా! ఇతరులకు ఉత్తర్వు చేయునట్టి పనులలో వివేకము కలిగి నడుచుకొనుము. లోకమునందలి వారెల్లరునూ మెచ్చుకొనునట్లుగా వివేకము కలిగి ఉంటె నిన్ను బుద్ధిమంతులలో బుద్ధిమంతుడువుగ ఎంచుతారు.

## శ్లోకం

'యథాచిత్తం తథావాచో'

'యథాచిత్తం తథావాచో
యథావాచః తథా క్రియాః
చిత్తేవాచి క్రియాయాం చ
సాధునా మేక రూపతా'

భావం : మనసులో అనుకున్నది పైకి చెబుతారు. చెప్పేది చేస్తారు. ఇది మంచి వారి లక్షణం. అలాంటి వారి మనస్సు,వాక్కు, కర్మ....మూడూ ఏకతాటిపై నడుస్తాయి.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఉత్కల్ తీరం | కేరళ |
| కొంకణ్ | తమిళనాడు |
| కోరమండల | ఏపీ |
| కోస్తా | పశ్చిమ బెంగాల్ |
| మలబారు | మహారాష్ట్ర |
| వంగా | ఒడిశా |

సమాధానాలు : ఉత్కల్ తీరం–ఒడిషా; కొంకణ్–మహారాష్ట్ర; కోరమండల –తమిళనాడు; కోస్తా–ఏపీ; మలబారు–కేరళ; వంగా–పశ్చిమ బెంగాల్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### రవిశంకర్ వ్యాస్



గుజరాత్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక కార్యకర్త, గాంధేయవాది. రవిశంకర్ మహారాజ్‌గా ప్రసిద్ధి పొందారు. ఫిబ్రవరి 25, 1884న జన్మించారు. 1915లో మహాత్మా గాంధీజీని కలిసి స్వాతంత్ర్య సమరంలో చేరారు. బార్డోలి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం, 1930లో ఉప్పు సత్యాగ్రహంలో గాంధీజీతో కలిసి పనిచేసి రెండేళ్లపాటు జైలు శిక్ష కూడా అనుభవించారు. జూలై 1, 1984న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. దక్షిణ మధ్య రైల్వే (సౌత్ సెంట్రల్ రైల్వే) ప్రధాన కార్యాలయం ఎక్కడుంది?
2. ఏ దేశ పార్లమెంట్‌ను 'డైట్' అని పిలుస్తారు?
3. 'గోల్డెన్ గర్ల్' మన దేశానికి చెందిన ఏ ప్రముఖ క్రీడాకారిణి 'ఆత్మకథ'?

జవాబులు : 1. సికింద్రాబాద్ 2. జపాన్ 3. పి.టి. ఉష



ఓటమిపాలైన పుంజు అవమానపడాలనీ గంతులేస్తూ గట్టిగా అరవసాగింది.

ఓడిపోయిన కోడిపుంజు తలవంచుకుని నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది.

ఆకాశంలో చాలా దూరంగా ఆహారం కోసం అన్వేషిస్తున్న ఒక రాబందుయకు కోడిపుంజు కేరింతలు వినబడ్డాయి.

గద్ద రివ్వున ఎగురుతూ కిందకు వచ్చింది. మితిమీరిన సంతోషంలో జరగబోయే ప్రమాదాన్ని పసిగట్ట లేకపోయిందా కోడిపుంజు.

ఇంకేముంది గద్ద దాన్ని ఎత్తుకుపోయి చంపి తినేసింది.

ఓడిపోయిన కోడిపుంజే ఆ మైదానానికి యజమాని అయింది. ★

## మెదడుకు మేత

కొమ్ములుంటాయి కానీ ఎద్దు కాదు. అంబారీ ఉంటుంది కానీ ఏనుగు కాదు?

జవాబు : నత్త

## మంచిమాట

కనిపించేదాన్ని చూడటానికి కళ్లు చాలు.. కనిపించనిదాన్ని చూడటానికి వివేకం కావాలి!



# వారఫలాలు

04 -10 మార్చి 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. అనుకున్న కాంట్రాక్టులు దక్కించుకుంటారు. విద్యార్థులకు కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది. తీర్థయాత్రలు చేస్తారు. గృహం, వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండిలాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. రచయితలు, కళాకారులకు నూతన అవకాశాలు. 4,5 తేదీల్లో బంధువులతో వివాదాలు. అనారోగ్యం. విష్ణుధ్యానం చేయండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

నూతన వ్యక్తుల పరిచయాలు. ఆధ్యాత్మిక భావాలు పెరుగుతాయి. పలుకుబడి కలిగిన వారితో ఉత్తరప్రత్యుత్తరాలు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. వాహనయోగం. వ్యాపారాలలో కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. పారిశ్రామికవర్గాలు, క్రీడాకారులకు ఆకస్మిక విదేశీయానం. 7,8 తేదీల్లో ఖర్చులు. ఇంటాబయటా ఒత్తిళ్లు. నృసింహస్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

పనులలో పురోగతి కనిపిస్తుంది. మీ సేవలతో గుర్తింపు పొందుతారు. నిరుద్యోగులకు భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురిస్తాయి. వాహనసౌఖ్యం. ప్రముఖులతో పరిచయాలు. వ్యాపారాలలో ఒడిదుడుకుల నుంచి బయటపడతారు. వైద్యులు, రాజకీయవర్గాలకు శుభసందేశాలు, విదేశీయానం. 9,10 తేదీల్లో ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆర్థికంగా మరింత అభివృద్ధి కనిపిస్తుంది. మిత్రులతో విభేదాలు తొలగుతాయి. తీర్థయాత్రలు చేస్తారు. ఆస్తుల వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. గృహ, వాహన యోగాలు. వ్యాపారాలలో లాభాలు గడిస్తారు. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. రచయితలు, వైద్యులకు ఆహ్వానాలు అందుతాయి. 5,6 తేదీల్లో అనుకోని ధనవ్యయం. బంధువులతో వివాదాలు. అనారోగ్యం. దుర్గాస్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కార్యక్రమాలలో ఊహించని విజయాలు. ఆస్తుల కొనుగోలు యత్నాలు అనుకూలిస్తాయి. ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. కొన్ని వివాదాల నుంచి గట్టెక్కుతారు. నూతన ఉద్యోగాలు దక్కించుకుంటారు. వ్యాపారాలు మరింత విస్తరిస్తారు. ఉద్యోగాలలో అనుకూలమైన మార్పులు ఉండవచ్చు. సాంకేతిక నిపుణులు, రాజకీయవర్గాలకు విజయాలు వరిస్తాయి. 4,5తేదీల్లో ఆరోగ్యసమస్యలు. మిత్రులతో విభేదాలు. గణేశ్ స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. విద్యార్థుల నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో ముందుకు సాగుతారు. ఉద్యోగాలలో ఈతిబాధలు తొలగుతాయి. రచయితలు, క్రీడాకారుల ఆశయాలు నెరవేరతాయి. 8.9 తేదీల్లో శ్రమాధిక్యం. బంధువర్గంతో మాటపట్టింపులు. అనారోగ్యం. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

తుల.....

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కార్యక్రమాలలో అవాంతరాలు. కష్టిస్తే గానీ ఫలితం కనిపించదు. ఆస్తి వివాదాలు నెలకొని ఇబ్బందిపడతారు. కొత్త వ్యక్తుల పరిచయం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో కొద్దిపాటి ఒడిదుడుకులు. ఉద్యోగాలలో కొంత గందరగోళం. రాజకీయవర్గాలకు, వైద్యులకు ఒత్తిడులు రె. 7.8 తేదీల్లో శుభవర్తమానాలు. ఆకస్మిక ధనలాభం. వాహనయోగం. గణేశాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. ఆకస్మిక ధనప్రాప్తితో ఉత్సాహంగా గడుపుతారు. స్థిరాస్తి వివాదాలను నేర్పుగా పరిష్కరించుకుంటారు. వ్యాపారాలు అభివృద్ధి పథంలో సాగుతాయి. కళాకారులకు సన్మానాలు. రచయితలు, వైద్యుల యత్నాలు సఫలం. 9,10 తేదీల్లో ధనవ్యయం. కుటుంబంలో చికాకులు. అనారోగ్యం. రాఘవేంద్రస్వామి స్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. పలుకుబడి మరింత పెరుగుతుంది. పరిస్థితులు అనుకూలిస్తాయి. ఒక ఆహ్వానం సంతోషం కలిగిస్తుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో అనుకూలత ఉంటుంది. ఉద్యోగాలలో సమస్యలు తీరతాయి. రాజకీయవర్గాలకు ఒత్తిడులు తొలగుతాయి. 6,7తేదీల్లో ధనవ్యయం. ఆరోగ్యసమస్యలు. లక్ష్మీస్తుతి మంచిది.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఇంటాబయటా ఎదురులేని పరిస్థితి ఉంటుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ఇంటి నిర్మాణాలలో అవాంతరాలు తొలగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో ఆటుపోటు. ఉద్యోగాలలో హోదాలు దక్కే అవకాశం. రాజకీయ, పారిశ్రామిక వేత్తలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 9,10 తేదీల్లో వ్యయ ప్రయాసలు. ఆరోగ్య భంగం. శ్రమతప్పదు. ఆదిత్యహృదయం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

పలుకుబడి మరింత పెరుగుతుంది. స్థిరాస్తి వివాదాలను నేర్పుగా పరిష్కరించుకుంటారు. . నూతన విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కుటుంబసభ్యుల చేయూతతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. వ్యాపారాలు పుంజుకుంటాయి. రచయితలు, కళా కారులకు మరింత ఉత్సాహం. 7,8 తేదీల్లో మిత్రు లతో విభేదాలు. అనారోగ్యం. శ్రమాధిక్యం. ఆంజనేయ దండకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి సమయానికి పూర్తి చేస్తారు. జీవిత భాగస్వామి ద్వారా ఆస్తిలాభ సూచనలు. ఆర్థికంగా గతం కంటే మెరుగ్గా ఉంటుంది. విద్యా, ఉద్యోగావకాశాలు దక్కుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో ఆశించిన లాభాలు ఆర్జిస్తారు. క్రీడాకారులు, వైద్యుల సేవలు విస్తృతమవుతాయి. 4,5 తేదీల్లో వ్యయప్రయాసలు. ఆరోగ్యసమస్యలు. ధనవ్యయం. అంగారక స్తోత్రాలు పఠించండి.

# పదరసం-454

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | 4 | | 5 |
| | | | | 6 | | 7 | | | |
| 8 | | | | | | | | | |
| | | 9 | | | | | 10 | | |
| 11 | | | | | | | | | |
| | | 12 | 13 | | 14 | | | | |
| 15 | | | 16 | | | | | | 17 |
| 18 | | | | | 19 | 20 | | 21 | |
| | | | 22 | | | | | 23 | |
| 24 | | | | | 25 | | | | |

## ఆధారాలు

**అడ్డం**

1) వాడుకభాషలో "భారీ అవినీతి మోసం" (4)
4) తిరగబడ్డ నమ్మకం, జామీను (3)
6) దౌత్యం (4)
8) రోలువచ్చి దీనితో మొరపెట్టుకుందని సామెత (3)
9) ఏమైనాసరే (అటునుంచి) కుదరనేకుదరదనడం (4)
10) విషయం (3)
11) చెదరినగాలి (3)
12) మంచికానిది తిరగబడింది (2)
14) నరకంలోని ఒకయేరు (4)
16) పత్రికాభాషలో అటునుంచి "అందిన సమాచారం" (3)
17) ... పోవడమంటే చాలా బాధపడటం (1)
18) వరుస తిరగబడింది (4)
19) ఈనీరు పవిత్రమైనది (4)
22) జాబితా అటునుంచి (2)
23) కుట్టేటప్పుడు లోపలికి పోనించి కుట్టే అదనపు గుడ్డ (2)
24) గుర్తు (4)
25) సంస్కృతంలో అదికావ్యం (4)

**నిలువు**

1) ధరించేపూవు కాదు, అతిఖరీదైనది (5)
2) ఉత్తమాటలు, కబుర్లు చెప్పేవాడిని ఇలా అంటారు (6)
3) పిండివంటలు చేసేటప్పుడు ఒకసారి పోసే/తీసే మొత్తం (2)
4) చేవ, సత్తా (2)
5) నందోరాజా...అని సామెత (4)
6) రామాయణంలో లంకకు వేయబడ్డ వంతెన(4)
7) అప్పు, మిగిలిన శేషం (2)
10) ఆకలివేసేటప్పుడు కడుపులోఊరేది పైకొచ్చింది (5)
13) ఇవి వేసుకు తిరుగుతున్నారంటే పూర్తిగా కలిసిపోయినట్లు (5)
14) విశేషమైన అధిక సంపద (3)
15) పైకొచ్చే మన్నన (4)
20) వరిపంట పెట్టే నేల చెదరిపోయింది (3)
21) రోగంవలన ఆహారం తినకపోవడం (3)

## పదరసం - 453 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వి[1] | తం | డ[2] | వా | దం[3] | | గ[4] | | మో[5] | వి[6] |
| ల | | మ | | పు[7] | న | ర్జ | న్మ | | సు |
| క్ష[8] | పే | ఆ | | డు | | న | | చి[9] | గు |
| ణం | | | ఊ[10] | బి | | | మ[11] | ట్టు | |
| | మ[12] | బ్బు | | య్యం[13] | నె[14] | | ధ్య | | అ[15] |
| ఆ[16] | న | | హే[17] | | గ[18] | దా | ధ | రు | డు |
| | వి[19] | క్ర | మా | ర్కు | డు | | రా | | గు |
| ద[20] | | | హే | | | దో[21] | | ట్టు[22] | బో |
| అ[23] | మీ | తు | మీ | | రా[24] | మ | ప్పు[25] | | డు |
| ను | | | లు[26] | తో | త | | గో[27] | డు | గు |




**అరుణ**

పేరెన్నికగన్న హాస్య నటులు కథానాయకులుగా తమ అదృష్టం పరీక్షించుకున్న దాఖలాలు తెలుగులో అనేకం! అందులో చాలా మంది కొన్ని చిత్రాలకు మాత్రమే పరిమితమయ్యారు. అలా ఫిబ్రవరి 23న ఇద్దరు కమెడియన్స్ హీరోలుగా ఎంట్రీ ఇచ్చారు. వైవా హర్ష 'సుందరం మాస్టర్' మూవీతో, అభినవ్ గోమఠం 'మస్త్ షేడ్స్ ఉన్నయ్ రా' సినిమాతోనూ హీరోలు అయ్యారు. తమ ఇమేజ్‌కు తగ్గ పాత్రలను పోషించి ఫర్వాలేదనిపించుకున్నారు. గతంలో రెండు మూడు సినిమాల్లో హీరోగా నటించి, ఇది తనకు సరిపడదని భావించిన 'వెన్నెల' కిశోర్ సైతం ఇప్పుడు మరోసారి తన లక్ ను 'చారి 111' మూవీతో పరీక్షించుకున్నాడు. టి.జి. కీర్తి కుమార్ దర్శకత్వంలో అదితి సోని నిర్మించిన ఈ సినిమా మార్చి 1న జనం ముందుకు వచ్చింది.




# నవ్వించే సీక్రెట్ ఏజెంట్

టెర్రరిస్టుల ఆగడాలను అడ్డుకోవడానికి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని 2005లో భారత ప్రభుత్వం ఏపీ సీఎం విజయ్ రెడ్డి ('శుభలేఖ' సుధాకర్)ని ఆదేశిస్తుంది. దీంతో ప్రసాదరావు (మురళీశర్మ) నేతృత్వంలో రుద్రనేత్ర అనే యాంటీ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్‌ను ఆయన ఏర్పాటు చేస్తారు. దేశ భద్రత కోసం కొంతమంది సీక్రెట్ ఏజెంట్స్‌ను నియమించి, ప్రభుత్వ పరంగా చేయలేని పనులు వాళ్లు చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతుంటారు. ఇదిలా ఉంటే... తాజాగా హైదరాబాద్ నగరం నడిబొడ్డులోని ఓ షాపింగ్ మాల్‌లో మానవబాంబు విధ్వంసాన్ని సృష్టించి, కలకలం రేపుతాడు. అతను ఎవరు? అతని వెనుక ఉంది ఎవరు? వారి మోటో ఏమిటి అనేది తెలుసుకోవడానికి ప్రసాదరావు... సీక్రెట్ ఏజెంట్ చారి 111 ('వెన్నెల' కిశోర్)ను ప్రస్తుతం సీఎం (రాహుల్ రవీంద్రన్) అనుమతితో రంగంలోకి దించుతాడు. తన తల్లికి జరిగిన అవమానానికి ప్రతీకారంగా రావణ్ (చైతన్య) అనే వ్యక్తి ఏకంగా కెమికల్ వార్ కు సిద్ధపడ్డాడని, తద్వారా ఈ దేశాన్ని, ప్రపంచాన్ని కూడా అతలాకుతలం చేయబోతున్నాడనే విషయం ప్రసాదరావు ద్వారా తెలుస్తుంది. దీనిని సీక్రెట్ ఏజెంట్ చారి ఎలా అడ్డుకున్నాడన్నదే చిత్ర కథ.

జేమ్స్ బాండ్ మూవీస్‌ను ఆరు దశాబ్దాలకు పైగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. తరాలు మారినా జేమ్స్ బాండ్‌కు ఉన్న క్రేజ్ తగ్గలేదు. తెలుగు చిత్రసీమలోకి సూపర్‌స్టార్ కృష్ణ వంటి వారు జేమ్స్ బాండ్‌ను తీసుకొచ్చారు. ఇప్పటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా నవతరం హీరోలు సైతం జేమ్స్ బాండ్ పేరు ఉపయోగించక పోయినా ప్రతి యేడాది మూడు నాలుగు సీక్రెట్ ఏజెంట్ మూవీస్ చేస్తూనే ఉన్నారు. అయితే... అదే సమయంలో జేమ్స్ బాండ్ తరహాలోనే డిటెక్టివ్ మూవీస్ కూడా రావడం మొదలైంది. చిరంజీవి 'చంటబ్బాయ్' ఆ కోవకు చెందిన సినిమానే. జేమ్స్ బాండ్‌కు ఇది కామిక్ వర్షన్ అనుకోవచ్చు. స్టార్ డమ్ ఉన్న చిరంజీవి లాంటి వ్యక్తి 'చంటబ్బాయ్' సినిమా చేస్తే దానిని ప్రయోగాత్మక చిత్రంగా భావించి ఓ మాదిరిగానే ప్రేక్షకులు ఆదరించారు. అయితే ఇటీవల ఇలాంటి సినిమాను నవీన్ పోలిశెట్టి 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'లో చేస్తే జనం బాగా ఆదరించారు. ఆ నమ్మకంతోనే ఇప్పుడు 'వెన్నెల' కిశోర్ తో 'చారి 111' మూవీని దర్శక నిర్మాతలు తెరకెక్కించారని అనుకోవచ్చు.

టెర్రరిస్టులను ఎదుర్కోవడం, వారి చర్యలను అదుపు చేయడం అనేది చాలా సీరియస్ వ్యవహారం. దానిలో కామెడీకి చోటు ఉండదు. డిటెక్టివ్‌గా వర్క్ చేయడం అనేది వ్యక్తిగతమైంది. అందులో ఎంత కామెడీని అయినా చొప్పించొచ్చు. కానీ దేశాన్ని, దేశ ప్రజలను రక్షించే ఓ ఆర్గనైజేషన్ లో కామెడీ సీక్రెట్ ఏజెంట్‌ను పెట్టడం అనేది ఏ మాత్రం కన్విన్సింగ్ గా అనిపించదు. ఇదే కథను వేరే హీరోతో చేస్తే మరో రకంగా ఉండేది. కమెడియన్ ఇమేజ్ ఉన్న 'వెన్నెల' కిశోర్‌ను హీరోగా తీసుకోవడంతో స్టోరీలో సీరియస్ నెస్ పోయింది. ఎంటర్ టైన్ మెంట్ మూవీగా మారిపోయింది. బహుశా ప్రేక్షకులు ఈ వినోదాన్ని ఆస్వాదిస్తారని, ఆమోదిస్తారని దర్శకుడు టి.జి. కీర్తి కుమార్ అభిప్రాయపడ్డారేమో, కానీ అది నెరవేరే ఆస్కారం కనిపించడం లేదు.

'వెన్నెల' కిశోర్ నుండి ప్రేక్షకులు కోరుకునే కామెడీని దర్శకుడు అందించే ప్రయత్నం చేశాడు. పంచ్ డైలాగ్స్‌తో అతని క్యారెక్టర్‌ను నడిపాడు. సిట్యుయేషన్ ఏదైనా... ఆ పాత్ర కౌంటర్ డైలాగ్స్ వేస్తూనే ఉంటుంది. తన పాత్ర వరకు 'వెన్నెల' కిశోర్ చక్కని న్యాయం చేశాడు. అతని బాస్‌గా మురళీశర్మ సైతం చక్కగా నటించాడు. నిజానికి ఈ సినిమాకు అసలు హీరో అతనే! కథంతా అతని చుట్టూనే తిరుగుతుంది. అయితే హీరోను ఎలివేట్ చేయాలి కాబట్టి క్లైమాక్స్‌లో ప్రసాదరావు పాత్రను డమ్మీని చేశారు. ఇందులో ఇతర పాత్రలకు దర్శకుడు తగినంత స్పేస్ కల్పించాడు. లేడీ సీక్రెట్ ఏజెంట్‌గా, హీరోని మించి పోరాట విన్యాసాలు చేసే యువతిగా సంయుక్త విశ్వనాథన్‌బీ చారి అసిస్టెంట్స్ గా సత్య, తాగుబోతు రమేశ్ నటించారు. వారి కొలీగ్ గా పావని రెడ్డి నటించింది. విలన్ రావణ్‌గా చైతన్య, అతని తల్లిగా ప్రియా మాలిక్, బిజినెస్ మ్యాన్‌గా బ్రహ్మాజీ యాక్ట్ చేశారు. తండ్రీ కొడుకులైన ముఖ్యమంత్రుల పాత్రలను 'శుభలేఖ' సుధాకర్, రాహుల్ రవీంద్రన్ పోషించారు. ఆర్టిస్టుల నుంచి నటనను రాబట్టడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడు. అలాగే మేకింగ్ పరంగా మూవీని మరో స్థాయికి తీసుకెళ్ళాడు. కాషిష్ గోవర్ సినిమాటోగ్రఫీ, సైమన్ కె కింగ్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ మూవీ కి హైలైట్. ఫ్లాష్ బ్యాక్ సీన్స్ చిత్రీకరణ బాగుంది.

తీవ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించే పనిని సహజంగా ప్రభుత్వ అధీనంలోని యాంటీ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్స్ చేస్తుంటాయి. కానీ కొంతకాలంగా ఈ పని కోసం ప్రభుత్వాలే సీక్రెట్ ఏజెన్సీలను నడుపుతున్నట్టు సినిమాల్లో చూపుతున్నారు. నిజానికి ప్రతి దేశంలో ఇలాంటి సీక్రెట్ ఏజెన్సీలు ఉంటాయి. కాకపోతే వాటిని ఈ మధ్య కాలంలో బాగా హైలైట్ చేస్తున్నారు. 'చారి 111' సినిమాలో ప్రత్యేకత ఏమిటంటే.... అలాంటి ఓ ఆర్గనైజేషన్‌లోని కామెడీ ఏజెంట్ ద్వారా దేశం రక్షణపొందడం! కథను పక్కనపెట్టి 'వెన్నెల' కిశోర్ కామెడీ ఎంజాయ్ చేసే వారికి సినిమా నచ్చే ఆస్కారం ఉంటుంది. లేని వారికి తలా తోక లేనట్టుగా అనిపిస్తుంది!!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# ఖజురాహో నృత్యోత్సవం అదరహో



ఖజురాహో యాభయ్యో నృత్యోత్సవం ఫిబ్రవరి 21 నుంచి 25 వరకు జరిగింది. అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న ఈ ఉత్సవాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రారంభించారు. 1975 నుంచి ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు. భారత పురావస్తు శాఖ, మధ్యప్రదేశ్‌కే చెందిన ఉస్తాద్ అలావుద్దీన్ సంగీత అకాడమి కలసి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. చందేలా వంశీకులు ఈ ఆలయాన్ని నిర్మించారు. నిజానికి ఈ ప్రాంగణంలో పలు దేవాలయాలు ఉన్నాయి. అక్కడే ముక్తకాశీ పేరుతో ఉండే వేదిక మీద నృత్యోత్సవం జరుపుతారు. ఇక్కడ ప్రదర్శించేవన్నీ సంప్రదాయ నృత్యాలే. మొదటి నృత్యం ఒడెస్సీ సంప్రదాయంలోని శివతాండవం.





From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 17


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.220/-




వెల : ₹.200/-



వెల : ₹.390/-




వెల : ₹.250/-




వెల : ₹.250/-




వెల : ₹.360/-




వెల : ₹.90/-



వెల : ₹.200/-




వెల : ₹.100/-




వెల : ₹.150/-




వెల : ₹.999/-




వెల : ₹.395/-




వెల :₹.495/-




వెల : ₹.799/-




వెల : ₹.599/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ – 2, దూరవాణి : 8333812687